

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

'55

నిరాలా

సబ్బు



బట్టలను ఉతకడం
అతితేలిక



బట్టలను బండకు వేసి బాదడం, నడుములు విరిగేటట్టు ఉతకడం అవసరం లేదు. నిరాలా సబ్బుకు చాలా నురుగు గబగబా వస్తుంది గనుక అతితేలికగా, శుభ్రంగా, బట్టలు చిరగకుండా ఉతకవచ్చు.

తుక్కు
ముక్కలు
లేవు

తుంగభద్ర ఇండస్ట్రీస్ లిమిటెడ్
కర్నూలు

NS-1/53


సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

సంపుటము 49
సంచిక 15
14.12-55

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

మన్మథ కార్తీక బహుళ అమావాస్య బుధవారం



సౌదీ అరేబియా రాజు నవంబరు 29 తేదీన జుమ్మా మసీద్ (ఢిల్లీ) కు వెళ్లి నమాజ్ చేశారు.

ముఖచిత్రం: "మాత-శిశువు"
చిత్రకారుడు: కె. పి. శర్మ
—విజయనగరం.

25 వ పేజీలో చిత్రము
నాగార్జునుడు—

విషయానుక్రమణిక

సర్వదా మక్కాకు అభిముఖుడైఉండే సావూద్

ఆరున్నర అడుగుల ఆజానుబాహుడు ఒకరు నవంబరు 27 న మనదేశం వచ్చారు. ఆయన మనదేశంలో కాలు పెట్టగానే శతఘ్నివందనంతో రాజోచితమైన స్వాగతం ఇచ్చారు. ఆయన, సావూదీ అరేబియా రాజు సావూద్ బిన్ అబ్దుల్ అజీజ్ (బిన్ అంటే కుమారుడని అర్థం).

సావూద్, మన ప్రభుత్వం ఆహ్వానం పురస్కరించుకొని వచ్చారు. రాజసోదరులు 12 మంది, పలువురు మంత్రులు, మొత్తం 200 మంది ఆయనవెంట వచ్చారు.

ఇస్లాం మతధర్మం 'సారియత్'కు లోబడి రాజ్యంచేసే సావూద్, ఆఖరికి ప్రయాణంచేసే విధంలో కూడా ధర్మం తప్పలేదు. ఇస్లాం సంప్రదాయం ప్రకారం ఆయనసర్వదా మక్కాకుఅభిముఖులైఉండాలి. అందుకని, ఆయన రైల్లో ప్రయాణంచేసినా విమానంలో వెళ్ళినా, ప్రయాణం ఏదిక్కుగా జరిగినా, ఆయనమాత్రం పశ్చిమ దిక్కును చూస్తూ ఉండే విధంగా ప్రత్యేకం, తిరిగే కుర్చీ ఒకటి తయారు చేశారు. సూదంటురాయి సహాయంతో, ఆ కుర్చీ ఎప్పుడూ పశ్చిమాభిముఖంగానే ఉండే ఏర్పాటు చేశారు.

పర్షియా సింధుశాఖకూ, ఎర్ర సముద్రానికీ మధ్యఉన్న అరేబియా ద్వీపకల్పంలో అత్యధిక ప్రాంతం సావూదీ అరేబియా రాజ్యంక్రిందకే వస్తుంది. దీని రాజధాని ఎర్ రియాద్ వైశాల్యం 7 లక్షల చదరపు మైళ్ళని లోగడ భారతప్రభుత్వం అంచనా వేశారు. 9 లక్షలని అమెరికా బ్రిటన్ల అంచనా. లెక్కలు సేకరించనందువల్ల జనాభాకూడా ఇదమిత్థంగా నిర్ధారణ కాలేదు. సుమారు 70 లక్షలని అంచనా. ఇందులో, దాదాపు 40 లక్షలమందివంకూ కోస్తా ప్రాంతమైన హెజాజ్ రాష్ట్రంలోనే ఉంటారు. మిగతావారు ఎడారి మడుగులలో అక్కడక్కడ చెల్లా చెదరుగా ఉంటారు. ఇస్లాం మతస్థులకు పవిత్రస్థలమైన మక్కా ఈ రాష్ట్రానికి రాజధాని. దీనిజనాభా లక్షపై చిలుకు. యాత్రాసమయంలో 3 లక్షలకు పెరుగుతుంది.

మక్కాకు సింహద్వారంవంటిది జిడ్డా నగరం. ఇది అరేబియాఅంతటికీ ముఖ్యమైన రేవుపట్టణం. జిడ్డా అంటే 'అమ్మమ్మ' అని అర్థం. సెమెటిక్ జాతుల నమ్మకంప్రకారం ప్రపంచంలో మొట్టమొదట అవతరించిన స్త్రీ 'ఈవ్'ను ఇక్కడే సమాధి చేశారని కథ. అందుకని దీని కాపేరు వచ్చింది. మరొక పుణ్యస్థలం మదీనా. ఇక్కడే మహమద్ ప్రవక్త అస్తమించాడు.

నాలుగైదుఏళ్ళక్రితంవరకూ సావూదీ అరేబియాలో రహదార్లు లేవు. మక్కా జిడ్డాలమధ్య 50 మైళ్ళ రోడ్డుమాత్రం ఉండేది. రైలుమార్గాలు లేవు. బ్యాంకులుగాని, టంకసాలగాని లేవు. ఇక్కడ నాణెం పేరు రియాల్. ఇది మన రూపాయకు సమానం.

మొన్న మొన్నటివరకు సావూదీ అరేబియా రాబడి ప్రధానంగా తైర్థికులపై వేసే పన్నువల్ల వచ్చేది. ఏటేటా మక్కా మదీనాలకు వెళ్ళే యాత్రికులపై తలకు 375 రూపాయలవరకుకూడా పన్ను పడుతూ ఉంటుంది. దీనివల్ల రాబడి సాలుకు సుమారు 3 కోట్ల రూపాయలు. అయితే అమెరికావారు ఇక్కడ నూనెగనులు త్రవ్వడం మొదలు పెట్టాక రాబడి బాగా పెరిగింది. ఇక్కడ అపారంగా నూనెగనులున్నాయి. 1945లో త్రవ్వి తీసిననూనె సుమారు 20 లక్షల టన్నులు. ప్రపంచం మొత్తంమీద దొరికే దాంట్లో, దాదాపు సగంనూనె సావూదీ అరేబియా సీమలో ఉందని ప్రవీణుల అంచనా. ఇప్పటికే దీనివల్ల వస్తున్న డబ్బును సావూద్ దేశాభివృద్ధికి సద్వినియోగం చేస్తున్నారు.

రైలుమార్గాలు,రహదార్లూ, పాఠశాలలూ ఆస్పత్రులూ విరివిగా నిర్మిస్తున్నారు. దేశంలో నాలుగుసంవత్సరాల ప్రణాళికను అమలుజరుపుతున్నారు. ప్రభుత్వం ప్రాథమికపాఠశాలలు నెలకొల్పి ఉచిత విద్యాసౌకర్యాలు ఏర్పాటు చేసింది. ప్రపంచ రాజకీయాలలో సావూదీ అరేబియాదిస్వతంత్ర విధానం. ఏ సైనికకూటంలోనూ చేరకుండాతటస్థంగా ఉంటున్నది. ★



అరేబియారాజు సావూద్ బిన్ అబ్దుల్ అజీజ్ కు ఢిల్లీ పురపాలకసంఘం నవంబరు 28న లాల్ ఖిల్లాలో సన్మానపత్రం సమర్పించారు.

ఆద్యంతాలు

కొంతి కృష్ణమూర్తి

1

అతనిపేరు సుందరమూర్తి. పేరు వినగానే మీ కళ్ళకు సుందరాతి సుందరమైన విగ్రహస్వరూపం పొడగట్టకమానదు. కాని మనిషిని చూశాక అతను సుందరుడు కాడని పించవచ్చు.

అలాగని అతను అసహ్యంగా కనిపిస్తాడని మీరనుకున్నా, అదీ భ్రమే అవుతుంది. చామనచాయగా వున్నా కంటికి నిండుగా వుండే ఆకారం; అంత పొడుగూ, పొట్టీ, లావూ, సన్నంకాని విగ్రహం! అన్నిటి కన్న అతనికి యితరుల స్నేహాన్ని క్షణంలో పొందే చాకచక్యం ఉన్నది. అందువల్లే కొన్ని క్షణాల్లోనే – ఆకారంవల్ల ఆకర్షించ బడకపోయినా – చాలామంది త్వరలోనే మిత్రులు ఐపోతారు. అదే అతని ఘనత!

అతడు చాలా బీదకుటుంబంలో జన్మించాడు. స్వశక్తివల్లనే కష్టపడి చదువుకుని, అభివృద్ధిలోకి వచ్చాడు. అంటే ఉద్యోగం చేస్తూ, తల్లితమ్ములతోబాటు మరికొందర్ని ఆదుకునే సామర్థ్యం వచ్చిందన్నమాట.

అతను ఇంటర్మీడియేట్‌లో చేరిందిలగాయతు పదిహేనువం... లిస్తామనీ, రెండువే లిస్తా.. నీ, నాలుగు ఎకరాల మాగాణిపొలం రాసిస్తా..., ... ఇంకా చదువుచెప్పిస్తామనీ ఎన్నో సంబంధాలు వచ్చేవి.

కాని సుందరమూర్తికిమాత్రం తనకాళ్ళ మీద తను నిలబడే సామర్థ్యం వొచ్చేవరకూ పెళ్ళి చేసుకోకూడదనే గాఢవాంఛకలిగింది.

అందువల్ల అందర్నీ నిరాకరించేవాడు. అది తల్లిదండ్రుల మనస్సుకు యెంతో బాధ కలిగించింది. ఎన్నో చెప్పి అతని మనస్సుని మార్పించాలని యత్నించేవారు. కాని అతని మొండిపట్టుదలచూసి కోపగించుకునేవారు.

ఆ నాలుగెకరాల మాగాణిభూమి రాసిస్తామన్న సంబంధాన్ని అతను నిరాకరించిన రోజున వాళ్లింట్లో రెండో ప్రపంచయుద్ధమైనంత గొడవ జరిగింది.

"కలిసి వొస్తున్న సిరిని కాళ్లతో తన్నుకుంటున్నావురా. అనుకున్ననాడు ఐన సంబంధాలు రావురా" అని తల్లివాపోయింది.

"వెధవకి తండ్రి మాటమీద ఈపక్షాత్రం గౌరవమున్నా ఏడిస్తేగా. ఒరేయ్! నామాట విను. చెడిపోతావ్. పండువంటి సంబంధాన్ని వొదులుకున్నావా, మళ్లీ నీ మొహం చూసేవాళ్లుండరు" అంటూ తండ్రి దీవన్లను కురిపించేడు.

"నా చదువు పూర్తయి, ఉద్యోగంలో చేరేవరకూ పెళ్లాడను. నా జీవనాధారం నాకే లేనప్పుడు మరో జీవితాన్ని, కట్నానికి ఆశపడి, నాశనం చెయ్యలేను" అని కచ్చితంగా చెప్పేశాడు.

2

ఇప్పుడు సుందరమూర్తి తహసీల్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. అతని సీటు కూడా చాలా మంచిదేనని ప్రతీతి. అది వారం నాడుకూడా హాజరుకావల్సిన పనే ఐనా, కొంచెం పెరాబడి అకష్టంవల్ల వచ్చే నష్టాన్ని పూడుస్తోందని సంతుష్టి పడేవాడు.

కష్టపడి బతికినవాడైన మూలాన అతనికి దురలవాట్లు ఏమీలేవు. సంవత్సరానికి ఓ సినిమా కన్న ఎక్కువచూడడు. డబ్బిచ్చి ఎప్పుడూ కాఫీతాగడు. సిగరెట్లు, నస్యం వంటి దురలవాట్లు లేవు. ఒకళ్ళదగ్గర అప్పు తీసుకోడు; ఎవ్వరికీ అప్పివ్వడు. డబ్బు విలువ తెలిసినవాడు కాబట్టి ఒక కానీ ఐనా అనవసరంగా ఖర్చుపెట్టడు.

ఇన్ని సద్గుణాలున్నాయి కనకనే అతనో వెయ్యిరూపాయలు వెనకేశాడని అందరూ కంటతడి పెడుతుంటారు – ఇతరుల బాగును సహించలేనీ, తాము బాగుపడడం ఎరగని దౌర్భాగ్య దామోదరులు. అతన్ని లోభి కింద చిత్రించి, ఉడికించ చూసేవారు.

కాని ఆపప్పులు అతనివద్ద ఉడికేవి కావు. వాటి నన్నిటినీ ఒక చిరునవ్వునవ్వి అధిగమించేవాడు. ఆఖరికి వాళ్లే ఉడుక్కుని తుర్రుమనేవారు.

అతని తండ్రి పరలోకగతుడయ్యాడు. తల్లే ఇంటికి పెద్ద దిక్కు. పెళ్లిచేసుకోమని ఒకటే పోరు పెడుతోంది. అతని పెళ్లి తమ్ముడి పోషణకు అడ్డురాదని అనేది.

కాని ఆవిడ ఇది వరకన్నమాట యదార్థమైంది. ఎప్పుడో ఎక్కడోగాని ఒక్క సంబంధమూ రావడంలేదు వొచ్చినా, ఇద్దర్లో ఎవరికో ఒకరికి నచ్చక చెడిపోతోంది.

ఇలా మూడేళ్ళుగడిచేయి. మాతృహృదయం తల్లడిల్ల సాగింది. కొడుకుని ఒక ఇంటివాడిని కమ్మనమని తెగపోరసాగింది.

అతనేం చేస్తాడు – ఇస్తామని ఎవరన్నా రావాలిగా! తనంత తనే అడగలేడు కదా!

అహం అడ్డువస్తుంది. అలాంటిది మన దేశంలో కనీవిని ఎరగం.
కనుక అంతులేని నిరీక్షణ తప్ప అతనికి గత్యంతరం లేకపోయింది.

నిజానికి అతనికి ఉద్యోగంలో చేరిన మర్నాటినుండే పెళ్లి చేసుకోవాలని అనిపించేది. ప్రేమకథల పత్రికలను తెగ చదివే వాడు మిత్రులు ప్రేమగాథలు చెబుతుంటే

చెవులు పెద్దవిచేసుకుని వినేవాడు. కొలా మంది సన్నిహితులైన మిత్రులవద్ద ఇంత అనేవాడు:
“మనమూ స్వీకరిస్తామోయ్ త్వరలో

గృహస్థాశ్రమం. నాకు కులాలు, గోత్రాలు అంత పట్టింపు లేదులే"

అలా అంటే మిత్రులు తమ ఎరికలో వున్న సంబంధాల వాళ్ళకీ విషయం చెప్పక పోతారా ! అని అతని ధీమా !

ఎవర్నో ఒకర్ని పెళ్ళిచేసుకునీ మనసు కలుపుకుని, సంసారజీవితం కొనసాగిద్దామని అనిపించే దతనికి అప్పుడప్పుడు.

అలాంటప్పుడు పెళ్ళి కాని పంతులమ్మలూ, నర్సులూ, టైపిస్టు గరల్సూ అతని మనః ఫలకంమీద మెరిసేవారు.

ఎవళ్ళన్నా తిన్నగా ప్రేమించకపోతారా అని పగటి కలలు కనేవాడు.

ఆ వూరికి కొత్తగా ఓ మేజిస్ట్రేట్ వొచ్చాడు. పాపం, ఆయనకు ఆడ సంతానం యెక్కువ. అర డజను పిల్లలు. అందులో మొదటి ఇద్దరికీ పెళ్ళిళ్లు చేశాడు — చెప్పుకో దగ్గ సంబంధాలనే. కాని మూడో అమ్మాయికి అంతకట్నం ఇవ్వలేమనే ఉద్దేశంతో కొంత తక్కువస్థాయి సంబంధమైనా ఫర్వా లేదనుకున్నాడు. అతనివద్ద బెంచిక్లర్కుగా వుంటున్న నాగభూషణంవద్ద ఆ ప్రస్తావన తెచ్చి "ఈ వూళ్ళో మంచి పెళ్ళి సంబంధాలేమన్నా వుంటే చెప్పవోయ్" అన్నాడు.

నాగభూషణం సుందరమూర్తి మిత్రకోటిలో ఒకడు. కనుక వెంటనే అతనికి జ్ఞాపకం వచ్చి, మిత్రుడి సంగతి సందర్భాలు గొప్పచేసి చెప్పాడు.

మర్నాడు మేజిస్ట్రేట్‌గారు తన బావమరిదిని పంపించి, సుందరమూర్తిని పెళ్ళి చూపుల కాహ్వానించేడు. పంచాంగాలు చూచుకుని ఆదివారంనాడు రెండు గంటలకు మంచిదిగా నిశ్చయించుకున్నారు.

అంత గొప్ప సంబంధం వచ్చినందుకు సుందరమూర్తి చాలా సంతోషించాడు; అతని తల్లి ఆనందం చెప్పతరంకాదు. ఏలాగో ఒకలాగ ఈ సంబంధం ఒప్పుకోమని తల్లి సలహా. అతనికీ మనసులో అలానే వుంది — సాధ్యమైనంతవరకూ ఇది జారవిడువకూడదని.

సాయంత్రం నాగభూషణం వొచ్చి అంతా సవిస్తరంగా చెప్పేడు. మిత్రుడి సహాయానికి చాలా కృతజ్ఞత తెలిపి, హోటలుకు తీసుకువెళ్లి, రెండణాలు ఖర్చుపెట్టి కాఫీ ఇప్పించేడు, సుందరమూర్తి. 'అనారోగ్య' కారణం సాకుగా తనమాత్రం తాగలేదు. నాగభూషణాన్ని ఆదివారంనాడుతనకు తోడుగా రావల్సిందిగా పరిపరి విధాల ప్రార్థించాడు. తర్వాత పెళ్ళిచూపులు ఎలా జరుగుతాయో, ఏమేమి ప్రశ్నించాలో అంతా సవిస్తరంగా ఆలోచించుకున్నాడు.

చివరికి సుందరమూర్తి ఇలా అన్నాడు: "చూసేవోయ్, నాగభూషణం. నావైపు పెళ్ళిపెద్దవు నీవే నన్నమాట. నేనేం అడిగినా బాగుండదు, చూడు. అందుకని అన్ని ప్రశ్నలూ నువ్వే అడగాలి."

నాగభూషణం "దానికేమిటోయ్! నీ శ్రేయోభిలాషిని కాకపోతే ప్రత్యేకం మేజస్ట్రేట్‌గారికి నీ విషయం ఎందుకు చెబుతాననుకున్నావ్? నీ పెళ్ళి చేయించే బాధ్యత నాదేననుకో. నువ్వేం భయపడకు" అని ధైర్యం చెప్పాడు—అతను ఇప్పించిన కాఫీని ఇంకా మర్చిపోలే నట్టుంది.

సుందరమూర్తి నేటికాలపు స్నేహాల మీద, అసలుండాల్సిన స్నేహధర్మాల మీదా ఒక ఉపన్యాసం ఇచ్చి మరీ వొదిలాడతన్ని.

4

నాలుగురోజులూ నాలుగు తుగాల్లా గడిచేయి సుందరమూర్తికి. తల్లి తనకొడుకు పెళ్ళిచూపుల వేళకు నవమన్మథుడిలా కావాలనే కాంక్షతో బాగా పెరుగూ, నెయ్యి, కూరలూ వేసి అతన్ని పోషించింది.


ఆదివారం వొచ్చింది; అనుకున్న





రాత్రివేళ భాక్రానంగల్

దేశపురోభివృద్ధికై అహోరాత్రాలూ జరుగుతున్న మహత్తర నిర్మాణకార్యక్రమంలో భాక్రానంగల్ ప్రాజెక్టు నిర్మాణం ఒక ముఖ్యవిభాగం రాత్రి వేళలలోకూడా నిర్విరామంగా నిర్మాణం సాగించే నిమిత్తం భాక్రా ఆనకట్టవద్ద వేలాది విద్యుద్దీపాలు అమర్చారు. దీపతోరణాలతో భాసిస్తున్న భాక్రా ఆనకట్ట నిర్మాణదృశ్యాలను ఈ చిత్రాలలో చూడవచ్చు.



ముహూర్తం వచ్చింది. నాగభూషణం అరగంట ముందుగానే వొచ్చాడు. అప్పటికే సుందరమూర్తి రెడీగా వున్నాడు.

ఇద్దరూ రిక్షాలో వెళ్ళారు. సుందరమూర్తే రిక్షాడబ్బు లిచ్చాడు. మేజస్ట్రేట్ రావుగారు గుమ్మంవద్దనే స్వాగతమిచ్చారు. ఆయన బావమరిది తోడునీడగా వున్నట్టు తోచింది.

ఆయనేవో ఫలహారాలు చేయించేరు. కాని వాళ్ళవేమీ ముట్టలేదు. నాగభూషణానికైతే ప్లేటులు ఖాళీచేద్దామని వుంది కాని సుందరమూర్తి ఏమీ తాకదల్చుకోలేదు కారణం వాళ్ళ అమ్మ 'ఫలహారాలు చేస్తే పొత్తు కుదర'దనే మూఢనమ్మకాన్ని కలిగించడమే. అతను దాన్ని నమ్మేడని కాదు; తల్లిమాట జవదాటడనీ కాదు; కాని ఆ పరిస్థితుల్లో సంబంధం చెడిసిపోకుండా సాధ్యమైనన్ని అవసర చర్యలూ తీసుకోవడమే అతని ఆశయం. అందువల్లే అతను మూఢనమ్మకాలకు కూడా తాత్కాలికంగానైనా తలవొగ్గింది. అందులోనూ ఇది మంచి సంబంధం అనుకున్నారు కూడాను. ఇది చెడితే మళ్ళా ఇంత మంచి సంబంధం వస్తుందో లేదో అనే అదట్టొకటి. అతను చాలాసార్లు పూర్వం వొదులుకున్న ఉత్తమ సంబంధాలు గుర్తుకొచ్చినప్పుడు తను తెలివి తక్కువగా ప్రవర్తించేడనే అనుమానం కూడా కలక్కపోలేదు. దానికి చింతించేవాడు కూడాను.

వాళ్లు నొచ్చుకున్నా, పెళ్ళి అయ్యేవరకూ పెళ్ళివారికి సానుకూలంగా నడుచుకోవాలి కనుక పైకేమీ అనలేదు. పదిహేను నిమిషాలు మేజస్ట్రేట్ గారు అమ్మాయి అందచందాలని వర్ణించేడు. తర్వాత ఆయన బావమరది తన బావ ఘనతనూ, ఉన్నతోద్యోగుల పిల్లల్ని చేసుకోవడంవల్ల కలిగే లాభాలనూ, పొందజాలిన ఉన్నత స్థితిని గురించి చిన్న లెక్చర్ రూపంలో సెలవిచ్చేడు.

సుందరమూర్తి, నాగభూషణం నవ్వుముఖాలతో "అవునండి", "అంతేనండి", "బాగా చెప్పారు", "నిజమే" అంటూ కాలక్షేపం చేశారు. అరగంట గడిచింది. అమ్మాయినిమాత్రం ఇంకా రంగస్థలం మీదికి తేలేదు.

సుందరమూర్తి మెదడులో ఆలోచనా తరంగాలు: మేజస్ట్రేట్ గారు అంత అందగాడు కాదు; కూతురెల్లా వుంటుందో? తల్లి పోలికట. తల్లి అప్సరసలా వుంటుందని ఆయన పరోక్షంగా వ్యక్తపర్చారు, భార్య గొప్పతనాన్ని గురించి. కాని బావమరదిని

చూస్తుంటే ఆవిడా అలాగే వుంటుందేమో ననిపించసాగింది.

"అమ్మాయిని రమ్మనవోయ్" అన్నాడు మేజస్ట్రేట్ గారు బావమరదితో, కొంత ఆజ్ఞాపూర్వకస్వరంతో.

ఆయన మళ్ళా హాలువద్దకు వెళ్లి "అమ్మాయిని పంపవే, అక్కయ్యా" అన్నాడు.

మరుక్షణంలో పెళ్ళికూతురు అడుగులో అడుగేసుకుంటూ. చిత్రమాపులతో నేలమీద పర్చిన తివాసీని చూస్తూ ప్రవేశించింది. కూడా తల్లి గావును అనుసరించింది. కూతుర్ని సోఫామీద కూచోబెట్టి కాబోయే అల్లుడిని ఓసారి పరికించింది.

మేజస్ట్రేట్ గారు అతన్ని చూపి "ఇతనే సుందరమూర్తి. బి. ఎ. ప్యాసయ్యాడు" అంటూ ఆవిడకు పరిచయం చేశాడు

సుందరమూర్తి "నమస్కారమండి" అన్నాడు.

"అలా కూచో మనవాడేలే" అన్నాడు బావమరది. ఆవిడ కూతురికి పక్కగా వున్న సోఫామీద కూచుంది

సుందరమూర్తి తల్లీ కూతుళ్ళను పరిశీలనగా చూడసాగేడు. ఆ అమ్మాయి నిజంగా తల్లి పోలికే. తల్లి అందంగానే ఉంది. కాని

> టెలిగ్రాంఫారం తీసుకుని, కలం ఎరువడిగి, దానిమీద సంగతి వ్రాసి, జేబులోనుంచి పర్సు, పర్సులోంచి డబ్బూ తీసి, స్టాంపుకొన్న ఒక ఆసామీకి తను అప్పటికే చాలా కష్టపడ్డట్టు అనుమానం వేసింది. పోస్టువాళ్లు చెయ్యవలసినంత సేవ చెయ్యటం లేదని ఊహ వచ్చింది.
>
> స్టాంపు తడిచేస్తూ, ఆఖరికి స్టాంపూ నేనే అంటించుకోవాలా అన్నాడు కొంత ఈసడింపుగా.
>
> "మీ వద్దు టెలిగ్రాం ఫారానికి అంటించండి." అని సలహా యిచ్చాడు గుమాస్తా.

వైద్యుడు: నే నిచ్చిన మందు ఎలా పనిచేసిందండి?

రోగి: భేషుగ్గానండి. మీ రిచ్చిన పొడుంతో నా జ్వరం, మా అత్తగారి కీళ్ల నొప్పులు, అమ్మాయి జలుబు నయమైపోయాయి. మిగతా పొడుం పెట్టి, ఇవాళ మా ఆవిడ కాఫీగిన్నెలు తోముతోందండి.

జుట్టు పాపిడిదగ్గర తెల్లబడింది. జడ సన్నగా అయిపోవడంవల్ల బర్నాసుడి వేసుకుంది. మొహం పాలిపోయి తెల్లగావుంది. కళ్ళు పెద్దవైనా లోతుకుపోయి, లోతైన నూతుల్ని గుర్తుకు తెస్తున్నాయి. ఐనా పూర్వపు సౌందర్యచ్ఛాయలు స్పష్టంగా కనబడుతూనే ఉన్నాయి.

ఆ అమ్మాయి చాలా అందంగా ఉందనిపించిందతనికి. జీవిత ప్రాంగణంలో అడుగు పెట్టబోతున్న కన్యారత్నం కట్టుకున్న గులాబీరంగు చీర, పూసుకున్న సెంటు వాసనలు అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

"అమ్మాయి నీ పేరేమిటమ్మా" అన్నాడు నాగభూషణం.

ఒకసారి లేడి చూపులతో వారినిచూసి, "విశాల" అంది సుందరమూర్తి సంతృప్తికరంగా చిరునవ్వు నవ్వేడు - పేరు బాగానే ఉందన్నట్టు.

"ఏం చదువుకుందో అడుగు" అన్నాడు నాగభూషణంతో.

"హెచ్. యస్. సి. చదువుతోం"ది అన్నాడు బావమరది.

"ఆ అమ్మాయినే చెప్పనీండి" అని నాగభూషణం అడ్డొచ్చేడు.

"చెప్పవే" మేజస్ట్రేట్ అన్నాడు.

"పదోక్లాసు" తీయని గొంతుకతోనే అంది.

"ఏమన్నా పాటలు వచ్చేమో?" అని కొసిరాడు, సుందరమూర్తి.

"సంగీతం ప్రత్యేకం నేర్పించలేదుగాని, ఏవో గాలిపాటలు కొన్నివచ్చు" తల్లి అందుకుని బదులు పలికింది.

"ఒక పాటపాడమ్మా" అన్నాడు నాగభూషణం, పెళ్లిపెద్దలా మొహంపెట్టి, మేజస్ట్రేట్ గారికేసి చూస్తో. కాసేపు బెంచిక్లరుక్కనని మర్చిపోవడానికి యత్నిస్తున్నాడు. ఆయన నవ్వుమొహం అతనికి మరికొంత ధైర్యాన్నిచ్చింది.

ఆఅమ్మాయి "రామ నీసమాన మెవరురా?" అని అందుకుని మధురంగా పాడింది.

అది పెళ్ళివారికి సంతృప్తిని కలిగించింది.

కాసేపయ్యాక నాగభూషణమే "ఇంక అమ్మాయిని లోపలికి తీసుకెళ్లండమ్మా" అన్నాడు.

ఆవిడ కూతురుతోబాటు నిష్క్రమించడానికి లేచింది. వెళ్లేముందు ఓసారి ధైర్యం చేసి, విశాలమైన నేత్రాలతో కాబోయే భర్తని వీక్షించింది, విశాల

"రెండురోజుల్లో ఏ విషయమూ తెలీజేస్తా" నని అన్నాడు సుందరమూర్తి.

"తొంభైపాళ్లు కుదిరినట్టే. మావాణ్ణి వొప్పించేభారం నాది" అన్నాడు నాగభూషణం సెలవుతీసుకుంటూ.

5

రెండురోజులు సెలవుపెటి తీవ్రంగా తన భవిష్యత్ గురించి ఆలోచించుకోసాగేడు సుందరమూర్తి.

తల్లి ఆత్రుత మరీ అధికమైంది. ఆ సంబంధము తప్పక వొప్పుకోమనీ, మరో తప్పటడుగు వేయవద్దనీ, అదేపనిగా వికరువు పెట్టసాగింది.

అతనికీ అంత అభ్యంతర మేమీ వున్నట్టనిపించలేదు.

'అమ్మాయి బాగానే వుంది. గౌరవప్రతిపత్తులుగల కుటుంబం. మూడు వేలకు పైగా కట్నమీయక మానరు. మామగారి హోదా, పలుకుబడీ అతని కెప్పటికన్నా తోడ్పడక మానవు.'

ఏ విధంగా చూసినా సంబంధం మంచిదనే తోస్తోంది.

కాని ఒక్కటే అతని మెదడులో చీడపురుగులా బాధించసాగింది. అదేమిటంటే ఆ అమ్మాయి తల్లిపోలిక నుండడమే.

మరో పదిహేనేళ్లు పోతే తన కాబోయే భార్య ఆమె తల్లి మోస్తరుగా మారుతుందన్నమాట! అంటే ఆ పాపిడి చుట్టూ తెల్లని జుట్టూ, ఆ పాలిపోయిన మొహం, లోతుగా ఉన్న కళ్ళూ, పిలకలాంటి జడా—అచ్చం ఆ తల్లి ఆకృతినే పొందుతుంది. అందులో సందేహం లేదు.

ఈ వూహ మనసుకి తోచేటప్పటికి అతనికి వివాహంమీదే విరక్తి కలగసాగింది. ఏవో నిగూఢ జీవితసత్యం కళ్లముందు ప్రత్యక్షమైనట్లనిపించింది.

'జీవితం ఇంతే! ఈనాడు అందంగా విప్పారిన గులాబీ, మర్నాడు రేకలు రాలి నేలపాలవుతుంది. అలాంటి క్షణిక సుఖానికి ఎగబడి, నిరాశపాలవడం దేనికి? చూస్తూ అగ్నిలో వేలు పెట్టడం ఎందుకు? అనుకున్నాడు, పెళ్లి చేసుకోవాలనే నిశ్చయాన్ని విరమించుకుంటూ.

న్యాయవాది: (క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తిచేశాక) పాపం, నా ప్రశ్నలవర్షం మిమ్మల్ని చికాకు పరిచి వుంటుంది.

సాక్ష్యానికి వచ్చిన స్త్రీ: అబ్బే లేదండి. మా అబ్బాయికి అడ్డమైన ప్రశ్నలన్నీ అడగడం సరదా. నాకు అలవాటే లెండి.

6

మర్నాడు నాగభూషణం మేజస్ట్రేట్ గారింటికి వెళ్ళి, "అతను తమ్ముడి చదువు పూర్తయ్యేవరకు పెళ్లి చేసుకోడట" అని చెప్పారు.

పెళ్లిసంబంధాలను వెతకలేక వేసారిపోతున్న మేజస్ట్రేట్ గారు "అదీ మన దురదృష్టమే" అన్నాడు. బావమరిది భావాలు మనసులోనే ఆగిపోయాయి. ★

ఆఫీసరుగారి బదిలీ

సాయంకాలం. ప్రశాంత వాతావరణం. అప్పుడే వాన కురిసి వెలిసింది. సూర్యుడు మబ్బుచాటునుంచి తప్పించుకొని తన కాంతి కిరణాలను భూమిమీద ప్రసరింపజేస్తున్నాడు. అది ప్రయాణీకులబంగళా. చుట్టూ పెద్ద కాంపౌండు. అన్ని వైపులా రకరకాల వృక్షాలు ఏపుగా పెరిగి బంగళాకు శోభ కూరుస్తున్నాయి. బంగళాకు తూర్పువేపు కాంపౌండులో విశాలమైన ఖాళీస్థలముంది. అక్కడ వలయాకృతిలో పెద్దపెద్ద బల్లలు, కుర్చీలు పేర్చబడివున్నాయి. బల్లలమీద రకరకాల అల్లికలతో కూడిన అందమైన గుడ్డలు పరచబడివున్నయి.

ఆ సాయంకాలం బంగళా అంతా చాలా సందడిగా వున్నది నౌకర్లు హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. కొంతమంది నీటుగా ముస్తాబై, నౌకర్లకు పనులు పురమాయించుతూ అధికారం చేస్తున్నారు.

టైము అయిదు గంటలు కావస్తున్నది. బంగళా గేటుదగ్గర ఇద్దరు వ్యక్తులు, ధోవతి, కోటు, తలగుడ్డలతోను నీటుగా ముస్తాబై, లోనికి వచ్చే అతిథులను ఆహ్వానిస్తున్నారు

చాలామంది ప్రజలు, వుద్యోగులు జంటలు జంటలుగా రావటం మొదలు పెట్టారు. అతిథులకోసం వేయబడిన కుర్చీలు చాలావరకు నిండాయి. సరిగా అయిదున్నరకి ఒకఆకుపచ్చని కారు బంగళా గేటుదగ్గర ఆగింది. కారులోనుంచి ఒక నలభైయేళ్ళ వ్యక్తి - సుందరమైన ముఖం. పసిమివన్నె ఛాయ, బలిష్ఠమైన దేహం. ప్రసన్న వదనంతో దిగాడు. అతడు ధరించిన సూటు మంచి ఖరీదైనది. నెత్తిన టోపీ వున్నది.

శ్రీ రాగి

గేటుదగ్గరవున్న ఉద్యోగులు అతనికి అభివందనంచేసి లోనికి దారి చూపించారు ఆయన లోనికి రాగానే, కుర్చీలలో కూర్చొన్నవారు గౌరవపురస్సరంగా లేచి నిలబడ్డారు. వలయాకారంలో అమర్చబడిన ఆ కుర్చీల మధ్య, ఎత్తుగా అందమైన రోజ్‌వుడ్ కుర్చీ ఒకటి వేయబడివుంది సూటువేసుకొన్న వ్యక్తి దానిలో ఆసీనుడైనాడు. ఆయనతోపాటు అందరు తమ తమ స్థానాలలో కూర్చొన్నారు.

అయిదునిమిషాలలో అతిథులందరికీ ఫలహారాలు, పండ్లు, టీ, కిళ్లీలు, సిగరెట్లు పంచబడ్డాయి. అందులో ఎవరో "యింక కానివ్వండి" అన్నారు. అతిథులందరూ, చిరునవ్వుముఖాలతో ఫలహారాలు సేవించటము మొదలు పెట్టారు. సూటు వేసుకున్న వ్యక్తిప్రక్కన కూర్చొన్న వర్తక ప్రముఖుడు రమణారావు ఆయనను ఏదో సంభాషణలో దింపి నవ్విస్తున్నాడు.

అరగంటలో అతిథులంతా ఫలహారాలు ముగించి, టీ త్రాగి, కిళ్లీలు నములుతూ, ధూమపానం మొదలు పెట్టారు. రమణారావు లేచి గొంతు సవరించుకొని యేదో చెప్పటం ప్రారంభించాడు. అతిథులు తమతమసంభాషణలను ఆపివేసి, అతడు చెప్పే మాటలను ఆసక్తితో వినటానికి సంసిద్ధులయినారు.

"మహాశయులారా! - మనం ఈ రోజున ఇక్కడ ఎందుకు సమావేశమైనామో చెప్పనవసరం లేదనుకుంటాను ఈరోజు మనకు చాలా విచారకరమైన దినం. ఎందుకంటే మన జిల్లా ఆఫీసరుగారైన రమేశంగారు ఇంకో జిల్లాకు బదిలీ చేయబడిన సందర్భంలో వారికి వీడ్కోలు ఇవ్వటానికి మనం ఇక్కడ సమావేశమైనాము. వారిని మనం వదులుకోటం అంటే యెంత విషాదకరమైన విషయమో మీ అందరికీ తెలుసు. వారు ఇతర ఆఫీసర్ల వంటివారు కారు. వారు తమవుద్యోగధర్మాలను 'తు, చ.' తప్పకుండా అనుసరిస్తారు. తమ ఉద్యోగనిర్వహణలో ఎటువంటి ఆటంకాలువచ్చినా జంకరు. ఇలాంటి ఆఫీసర్లు మనకు ఈ రోజుల్లో దొరకటంటే అతిశయోక్తిగాదు. వీరిని యీ జిల్లానుంచి ఇంత త్వరలోనే బదిలీచేయటం మన దురదృష్టం వీరి పరిపాలన కొన్నాళ్లు మనం చవిచూచినకర్వాత మరచిపోవటం కష్టం. వీరికి భగవంతుడు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను" అని ముగించి శ్రేష్ఠిగారు తమ స్థానంలో కూర్చున్నారు.

అతిథులలోనుంచి కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. ఆఫీసరుగారి ముఖంలో చిరునవ్వు తాండవించింది.

ఇంకొక తలపాగాఆయన లేచి చెప్పటం మొదలు పెట్టాడు.

" మన ఆఫీసరుగారిని గురించి రమణారావుగారు చెప్పినవిషయాలు చాలా వాస్తవమైనవి అసలు వారిని మనజిల్లాకు వేసినపుడే మన మెంతో అదృష్టవంతులమని అనుకొన్నాను. వారు యిక్కడ పనిచేసిన రెండు సంవత్సరాలలోనే ఆ విషయం

స్పష్టమయింది. వారు సేవాధర్మంలో దేనినీ లెక్క చేయరంటే అతిశయోక్తి గాదు. వారి పరిపాలనలో ప్రజలకు గానీ, వారిక్రిందపని చేసే ఉద్యోగులకు గానీ అన్యాయం జరిగిందని ఎవరన్నా అంటే, అది వారంటే కిట్టని వాళ్లు చేసే ప్రచారమని మనం వెంటనే నమ్మవచ్చు. వారి హయాంలో వారి క్రింద ఉద్యోగస్థులలో ఋజువర్తనం అభివృద్ధి అయిందని గట్టిగా చెప్పవచ్చును. ఇంత త్వరలో వీరు ఇక్కడనుంచి బదిలీ కావటం చాలా విచారకరం. వీరిని ప్రభుత్వమువారు ఇక్కడనే కొన్నాళ్లు వుంచితే బాగా వుండేదని నా అభిప్రాయం. భగవంతుడు వీరికి ఆయురారోగ్యములు ప్రసాదించుగాత!" అని చెప్పి తన సీటులో ఆసీనుడయ్యాడు.

బిస్కట్ల ఫ్యాక్టరీ యజమాని పాపారావు, సినిమా ప్రొప్రయిటరు వినోదారావు, అచ్చాఫీసు ప్రొప్రయిటరు రాజారావు, పైన చెప్పినవారి అభిప్రాయాలను బలపరచుతూ ఉపన్యసించారు. ఆ ఆఫీసరుగారు అంత త్వరలో బదిలీ కావటం దురదృష్టమే నన్నారు.

అందరిలోకి చివరగా కూర్చొన్న ఒక గుమాస్తా కాబోలు లేచి ఇలా అన్నాడు. "........మన ఆఫీసరుగారు బదిలీ అయివారని వినగానే అపరిమితంగా దుఃఖించిన వాళ్ళల్లో నే నొకణ్ణి వారి హయాంలో మనం ఎన్నో విషయాలు నేర్చుకొన్నాం. ప్రజ లెవ్వరూగూడా, ఏ పనికైనా, నాబోటి చిన్నఉద్యోగుల దగ్గరికి రావలసిన అగత్యంలేకుండా చేశారు మన ఆఫీసరుగారు. అదే మనకు ఎన్నో గుణపాఠాలు నేర్పింది. కాఫీ, సిగరెట్లు మొదలైన దురలవాట్లు మానుకొన్నాం. సినిమాల జోలికి అసలే పోవటంలేదు. గాంధీగారిలాగ తక్కువడబ్బుతో సంసారం సాగించటం నేర్చుకొన్నాం. సాదా దుస్తులే ధరిస్తున్నాం. వళ్లువంచి పనిచేస్తున్నాం. ఇలా చెప్పుకు పోతుంటేమనం ఈ స్వల్ప కాలంలో నేర్చుకొన్న గుణాలు ఓ పెద్ద పుస్తకంగా వ్రాయవచ్చు. అజీర్ణరోగ కారణంగా డాక్టరు బిల్లు చెల్లించుకొనే అవసరం ఏమాత్రం మనకిప్పుడు లేదు. ఇది ఎంతగానో సంతోషించదగిన విషయంగా నేను భావిస్తున్నాను.

మన జీతాలు చాలా తక్కువ కావటం వల్ల వీరి హయాంలో మనలో కొంతమంది అకారణంగా అసంతృప్తి చెందియుండవచ్చు. అందుకు ఆఫీసరుగారు బాధ్యులు గారు. జీతాలు ఎక్కువచెయ్యాలనే వారికి వుండవచ్చును. కాని అది వారిచేతిలో పని కాదుగదా! మనం ఎంతో శ్రమచేస్తేగాని అబ్బని గుణాల్ని ఈ ఆఫీసరుగారి హయాంలో మనం ఇంత తేలికగా అలవరచుకొన్నామంటే అది అంతా మన ఆఫీసరుగారి చలవే.

కాబట్టి ఇటువంటి ఋజువర్తనంగల ఆఫీసరుగారు బదిలీ అయిపోతున్నారంటే ఎవరికి విచారముండదు? వారిని ఇంకా కొంత కాలం ఇక్కడ వుంచనందుకు నా తరఫున మీ అందరితరఫునా విచారం వెలిబుచ్చుతూ వారికి భగవంతుడు మేలుచేయుగాక అని కోరుతూ ఇంతటితో విరమిస్తున్నాను" అంటూ ఆయన తనకుర్చీలో చతికిలబడ్డాడు.

తిరిగి కరతాళధ్వనులు చెలరేగాయి.

తన వీడ్కోలుకు సమాధానం చెప్పటానికి ఆఫీసరు రమేశంగారు లేచారు.

"మీ రినాడు నా యీ బదిలీ సందర్భంలో చేసిన గౌరవానికి ఎంతో కృతజ్ఞుడను. రాజా రావుగారు, పాపారావుగారు, రమణారావు గారు యింకా యితర ప్రజా ప్రముఖులైన మీరంతా ముఖ్యమైన మీ పనులు మానుకుని ఈ సమావేశంలో పాల్గొన్నందుకు, నేను మీకు - అంటే ఈ జిల్లాప్రజలకు చేసిన అత్యల్పమైన సేవను ఎంతో గొప్పగా పొగడుతూ అభినందించినందుకు, నాకు చాలా సంతోషంగావుంది. నేనునిర్వర్తించినసేవా ధర్మాన్ని అర్థంచేసుకొని సహకరించినందుకు ఎంతో కృతజ్ఞుడ్ని. మీరు చెప్పినవన్నీ విన్న తర్వాత మీకు నాయందు, ఎంతో భక్తిగౌరవాలున్నాయని విశదమౌతున్నది. తర్వాత నేను బదిలీ అయినందుకు మీరు చాలా విచారిస్తున్నట్లుగాకూడ తెలుస్తున్నది. అందుకనే మీకో చిన్న సలహా ఇవ్వటానికి నేను సాహసిస్తున్నాను. నా కుటుంబ పరిస్థితులవల్ల నేమి, మీరు చెప్పిన మాటలు విన్న తర్వాతనేమి, ఈ జిల్లాలో ఇంకా కొంతకాలముండి మీ సేవ చెయ్యాలని కుతూహలంగా వుంది. అది అనుకూలం చేసే వుపాయం మీ చేతుల్లోనే వుంది. మీరంతా కలిసి ఒక విజ్ఞాపన ప్రభుత్వానికి అందచేస్తే బహుశా నా బదిలీ ఆగిపోవచ్చు. అందుకు మీరు ముందుకు వస్తారని ఆశిస్తున్నాను" అంటూ ఆఫీసరుగారు తమ కుర్చీలో ఆసీనులైనారు.

ఆఫీసరుగారి ఉపన్యాసను అక్కడిప్రజలలోనూ ఉద్యోగస్థులలోనూ కొంత కలకలం బయలుదేరతీసింది. రెండు మూడు నిమిషాల తర్వాత రమణారావు లేచి ఇలా అన్నాడు.

"ఈ రెండుసంవత్సరాలలోనూ, మీ పరిపాలనలో ఈ జిల్లా ప్రజలైన మేమూ— మీ క్రింది ఉద్యోగస్థులూ, ఎంతగానో సుఖించాము. బాగుపడ్డాము. మీరు నిజంగా ఇక్కడే కొంతకాలం వుండాలని మేము కోరుకొన్నట్లయితే మిమ్మల్ని 'స్వార్థపరుల' క్రింద జమగడతారు. పైగా మీకిప్పుడు బదిలీఅయినజిల్లా ప్రజలకు, అక్కడి ఉద్యోగులకు తీర్చలేనినష్టం కలగచేసినవాళ్ళమవుతాం. కాబట్టి మీరు కొంతకాలం ఆ క్రొత్తజిల్లాలోగూడా పనిచేసి, ఆ జిల్లా ప్రజలకు అక్కడి ఉద్యోగులకు మీ పరిపాలనా సామర్థ్యంవల్ల, మేలు కలగచేస్తారని ఆశిస్తున్నాను" అని రమణారావు కూర్చొన్నాడు.

అక్కడి సమావేశమైన ప్రజలూ, వుద్యోగులూ ఆయన చెప్పిన మాటలను బలపరుస్తున్నట్లుగా కరతాళధ్వనులు చేశారు.

ఆఫీసరుగారి ముఖం కళ తప్పింది. తరంగాలలాగా వారి ముఖంలో అనేకభావాలు పొడగట్టినాయి. ★

అపూర్వ హంతకులు

మూలం: ఎడ్గార్ వాలెస్ అనువాదం: 'వినాయక'

2. పార్లమెంటులో చర్చ

మదించి పొగరెక్కిన పొట్టేలంతటి మహా భయంకరమైనదేదీ లేదని — గ్లాడ్‌స్టనేలా ఉంది — ఒక చోట వ్రాశాడు. ముందు వెనకలు చూసుకోకుండా నోటికొచ్చిందల్లా ఇష్టం వచ్చినట్లు వాగేసే రాజకీయవేత్త కూడా సరిగా ఈ బాపతే!

రాజకీయవాదులు ప్రపంచ రాజ్య సమావేశాల్లో బహు జాగ్రత్తగా ప్రసంగిస్తారు. ఒకప్పుడు మిత్రరాజ్యాలు కూడా వీరిని పడగొట్టడానికి వెనకనించి గోతులు తవ్వుతూంటాయి. ఇలాంటి సందర్భాల్లో కూడా ఒకరినీ నొప్పించక తాము నొవ్వక, తప్పించుకు తిరగడం రాజకీయవాదులకు వెన్నతో బెట్టిన విద్య! అయినా వీరు తమ జాగ్రత్త అంతా ఒక్కసారిగా మంటగలిపి, ఒక్కొక్కప్పుడు కేవలం సామాన్యజనంలాగే వ్యవహరిస్తారు. దీనికి మన శాస్త్రవేత్తలేవేవో కారణాలు చెబుతారు గాని, జనసామాన్యానికి రాజకీయవాదుల వింత చర్యలు మాత్రం చాలా విడ్డూరంగా కనిపిస్తాయి.

ఆంగ్లదేశం విదేశశాఖమంత్రి సర్ ఫిలిప్ రేమన్ చాలా విచిత్రమైన వ్యక్తి. ఇతరేదైనా విషయంలో ఒక నిశ్చయానికి వచ్చివేస్తేమరి అందులోనించి అతన్నెవరూ కదిలించలేరు! అతనిది కేవలం భిల్లూకపు పట్టే! చెంపలు చాలా పెద్దవి. కళ్ళల్లో చిత్రమైన నీలిరంగు. ఇది సామాన్యంగా పచ్చిరక్తం తాగే హంతకుల కళ్ళల్లోను, పెద్ద పెద్ద సైన్యాధిపతుల కళ్ళల్లోను కనిపిస్తూంటుంది. అయినా సర్ ఫిలిప్ రేమన్‌కు తాను తలపెట్టిన ఘనకార్యాన్ని గురించి ఆలోచించేసరికి గుండెల్లో కొంచెం దడ బయలుదేరింది! కాని పైవారికి చాలామందికీ విషయం ఊహాతీతం!

విగ్రహపుష్టినిబట్టిమాస్తే కొందరు వీరాధివీరుల్లా కనిపిస్తారు. మృత్యుదేవత చెవులు పట్టుకుని గుబగుబా గుంజీలు తీయించేటట్టు మాట్లాడుతారు! కాని ఈఘనులంతా సమయం వచ్చేసరికి చల్లగా జారుకుంటారు! చిన్న పిలికూన మ్యావంటే మైలుదూరం పరిగెత్తితేగాని వెనక్కి తిరిగి చూడరు! కోర్టులో ఇలాంటి వీరాధివీరుల సాహసకృత్యాలు, చరిత్రలు రోజూరోజూ అందరికీ వినబడుతూనే ఉంటాయి!

అయితే మంత్రి పై దానికి కేవలం వ్యతిరేకం! పిడిరాళ్లలాంటి మనుషు లతన్ని చూస్తే 'పట్టి పిరికిగుండెరా!' అని తేలిగ్గా కొట్టి పారేస్తారు! ఆయనకి దెబ్బన్నా, చావన్నా మహా చెడ్డభయం!

'బాకా'లో ప్రకటనపడిన రెండురోజుల తరవాత ఒక మంత్రివర్గ సమావేశం జరిగింది. ప్రధానమంత్రి ఈవిషయం ప్రస్తావించి, సర్ రేమన్‌తో ఇలాగన్నాడు.

"దీనికోసం మీరింతగా ఆందోళనపడడం ఎందుకు? ఈ విదేశీయ బహిష్కరణ శాసనం చల్లగా జారవిడిచి వెయ్యవచ్చునే! పార్లమెంటులో చర్చించవలసిన బ్రహ్మాండమైన విషయాలింకా చాలా ఉన్నాయే! ఈ సమావేశం దాదాపు అంతా అయిపోయింది కూడాను!"

దీనిమీద మిగిలిన మంత్రులంతా ఔనంటే ఔనన్నారు.

"నిజమే! ఇది జారవిడిచివేయడానికి మహా చక్కని సాకులున్నాయి. లేకపోతే అనవసరంగా అమాయకుల్ని పట్టుకుని బాధించామనే అపవాదొకటి మనమీద విరుచుకుపడుతుందికూడాను. ఇదీగాక నిరుద్యోగ నివారణచట్టం ఒకటి చాలాముఖ్యం. ఇంతకీ దీన్ని గురించి దేశంలో ఏ మంటారో మరి ఆ దేవుడికెరుక!"

దాంతో సర్ ఫిలిప్ రేమన్ శక్తికొద్దీ బల్లమీద ఒక గుద్దుగుద్ది, హుంకరిస్తూ ఇలా అన్నాడు: "ఏమైనాసరే! ఈ శాసనం పార్లమెంటులో ప్రవేశపెట్టితీరాలి! లేకపోతే స్పెయినుకీ మనకీమధ్య తగాదాలు బయలుదేరతాయి. ఫ్రాన్సుకీ మనకీకూడా చెడుతుంది. ఇంతే కాక మిగిలిన మిత్రరాజ్యాలతో కూడా తగాదాలు రావచ్చును. ఇది చట్టం అయి తీరుతుందని ముందుగా నేను మాటకూడా ఇచ్చాను!

జరిగిన కథ:-

స్పెయిన్‌లో అలజడి జరుగుతున్న రోజుల్లో విప్లవ సారథులు ఇంగ్లాండ్‌లో మకాం వేశారు. వాళ్ళని వెళ్ళగొట్టడం కోసం ఆ దేశపుమంత్రి ఒక చట్టం తేదలచాడు. ఆ మంత్రిని గుట్టుచప్పుడుకాకుండా అంతంచేస్తే, ఆ చట్టం నేలమట్టం కావచ్చును.

న్యాయ పరిరక్షణభారం భుజస్కంధాలపై వేసుకున్న నలుగురు పెద్దమనుషులు, ఆ చట్టం తలపెట్టవద్దని హెచ్చరిస్తూ, తలపెడితే హతమారుస్తామని బెదరిస్తూ ఆ మంత్రికి ఒక ఉత్తరం వ్రాశారు. 'బాకా'పత్రిక, మంత్రిదగ్గరనుండి ఆ ఉత్తరం నకలు కాస్తా తీసుకొని ప్రచురించడంతో ఊరూ వాడా గుప్పుమంది...

★ అపూర్వ హంతకులు ★

నలుగురు పెద్దమనుషులయేది! నాలుగు వేల లుస్కా సరే! ఇది వెంటనే చట్టం కావల పెద్దమనుషులయేది! ఎన్ని వేల బెదరింపు సింది!"

దీనిమీద ప్రధానమంత్రి ఋజా శేఖర వేశాడు. వీమ్మట ప్రభుత్వ ప్రధాన న్యాయ వాది వెంటనే అందుకుని "ఉన్నమాటకాస్తా అనేస్తున్నాను. నన్ను కొంచెం మన్నించాలి!



ఒక మెడికల్ కాలేజీ విద్యార్థి లైబ్రరీకి వెళ్లి శరీరశాస్త్ర గ్రంథాలన్నీ తిరగవేసి లైబ్రరీ అధికారితో అన్నాడు: "ఈ పుస్తకాలు పదేళ్లకిందటివి. కొత్తగా ఏమన్నా వచ్చినవి ఉంటే ఇవ్వండి."

లైబ్రేరియన్: "మేము శరీర శాస్త్ర గ్రంథాలు కొత్తగా తెప్పించడం మానివేశాము. ఈ పదేళ్ళలో మానవ శరీరంలో అంత కొత్తపరిణామాలు వస్తాయని మీ ఉద్దేశమా?"

మీరు పత్రికల్లో ఇదంతా ప్రకటించడంలో కొద్దిగా తొందరపడ్డారేమోనని అనిపిస్తూ ఉంది అయితే ఒకమాట! ఈ విషయంలో వ్యవహారం అంతా మీఇష్టంవచ్చినట్టే జరిగిపోవాలని మేమంతా అంగీకరిస్తున్నాము కాని మీరా వ్యవహారం అంతా కుండబద్దలు కొట్టినట్టుగా ఇలాగ పత్రికల్లో కెక్కించడం మాత్రం.. అంతగా.. "

"నా చర్య మంచిచెడ్డలనుగురించి చర్చించవలసిన అవసరమేమీ లేదు!" అన్నాడు సర్ ఫిలిప్ రేమన్ మూతి బిగించి.

ప్రభుత్వ ప్రధాన న్యాయవాది అటు పిమ్మట ఖజానా మంత్రితో కలిసి ఆ సమీపంలో అటూ ఇటూ పచారు సాగిస్తూ విదేశశాఖమంత్రి అన్న మాటమీద తన ఉక్రోషం అంతా వెళ్ళగక్కుతూ యాదాలాభంగా "వట్టి చాతావాతాగాని చాదస్తం మనిషిలే!" అన్నాడు. ఖజానా మంత్రి యువకుడు. ఈమాట విని ఒక్క చిరునవ్వునవ్వి ఇలా వ్యాఖ్యానించాడు.

"నిజం చెప్పాలంటే సర్ ఫిలిప్ రేమన్ వట్టి దచ్చునాగమ్మ! ఎక్కడకెళ్లినా ఈ నలుగురి హంతకులగోలే! ఈమధ్యన నేనొక హోటలులోకి వెళ్ళాను. అక్కడ ఒక స్నేహితుడు తటస్థపడ్డాడు. ఈ నలుగురి వ్యవహారంలోను ఏదో ప్రశ్రయం ఉండి తీరాలని నాతో చెప్పాడు.

అత నీమధ్యనే దక్షిణ అమెరికా వెళ్ళి వచ్చాడు. అక్కడ ఈనలుగురు చేసిన అఘాయిత్యం కళ్ళారా చూసి వచ్చాడు! "ఏమిటా అఘాయిత్యం?"

ఆ! ఏముంది? ఆ దరిద్రగొట్టు దక్షిణాది దేశాల పేర్లేమిటో నాకు తిన్నగా జ్ఞాపకం ఉండిచావదు! వాటిలో ఒకదాని అధ్యక్షుణ్ణో మరెవణ్ణో ఈ నలుగురు నిజాయితీపరులు హత్య చేశారట! ఇదంతా జరిగి అప్పుడే ఏడెనిది నెలలయిందిలే! ఈ అఘాయిత్యాల జాబితా చూస్తే ఇది పట్టుకోవచ్చును! మొత్తంమీద చాలా పెద్ద దారుణమే జరిగిపోయిందిలే! పాపం అర్థరాత్రివేళ సుఖంగా గుర్రుపెట్టి నిద్రపోతూన్న మనిషిని పట్టుకుని నోట్లో గుడ్డలు కుక్కి, కళ్ళు కనబడకుండా గంతలుకట్టి, బాహాటంగా జైలులోకి తీసుకుపోయారు! లోపలి కెలా వెళ్లారోగాని ఉరి స్తంభం దగ్గిరికి తీసుకుపోయి, ఉరితీశారు."

ప్రభుత్వ న్యాయవాదికి దీనిలో ఎక్కడా తలా తోకా కనబడలేదు. ఇంకా దీన్ని గురించి కొన్ని విషయాలడుగుదామని అనుకున్నాడు. ఇంతలో ఒక ప్రభుత్వ కార్యదర్శి న్యాయవాదిదగ్గిరికి వచ్చి, అతని కేదో చెప్పి నిలుచున్నపాటుగా వెంటబెట్టుకుపోయాడు! అతనితో కలసి వెడుతూన్న ఆ న్యాయవాది "ఆ! ఇవన్నీ వట్టి గోతాల్లే!" అన్నాడు.

ఇంతలో విదేశ శాఖమంత్రి గుర్రపు బగ్గీ టకటక చప్పుడు చేస్తూ తటాలున పార్లమెంటుభవనం ముందు ఆగింది. వెంటనే బగ్గీ వెళ్ళిన బాట కిరువైపులా బారులు దీర్చిన జనంలోనించి హర్షధ్వానాలు చెలరేగాయి. సర్ రేమన్ జన సామాన్యం జయజయ ధ్వానాలకోసం అర్రులుచాచే వ్యక్తి కాదు! ఇందువల్ల ఈ హర్షనినాదాల కతడేమీ ఉబ్బి తబ్బిబ్బైపోలేదు. మంత్రికి ప్రాణాంతక పరిస్థితి ఏర్పడినదనే ఉత్సాహంకొద్దీ జనం హర్షనినాదాలు చేశారని అతనికి తెలుసును. ఇందువల్ల ఈ హర్షధ్వానాలు వింటూన్నకొద్దీ అతనికి లోలోపల చిరాకు, కోపం ఎక్కువైనాయి. "ఈ అపూర్వ హంతకు లొకలెక్కా!" అని జనం అనుకుని ఉంటే మంత్రి ఆనందించి ఉండేవాడు! జనం తనకు భరవసా ఇచ్చినట్లే భావించి సంతోషించి ఉండేవాడు! కాని అలాగ జరగలేదు.

జనసామాన్యంలో పేరు ప్రఖ్యాతులంతగా లెక్కపెట్టక పోయినా-మంత్రి వారి అంతరాంతరాల్లోనించి సహజంగా పైకుబికే ఇష్టానిష్టాలు జాగ్రత్తగా గమనిస్తూనే ఉంటాడు ఇంతలో లాబీ వర్గాలలో ప్రముఖులు కొంతమంది మంత్రి చుట్టూ మూగి తాజావార్తలకోసం తహతహ లాడుతూ అతనిమీద ప్రశ్నవర్షం కురిపించారు. కొంతమంది అత్యాశ్చర్యంగా అతన్ని పరిశీలించారు. అయితే మంత్రిది మహా చెడ్డనోరు! అందువల్ల వారందరికీ లోలోపల కొంచెం బెదురుగానే ఉంది!

ఇంతలో ఒక పార్లమెంటు సభ్యుడు మంత్రిదగ్గరకు వచ్చాడు. అతడిది గంగాళం

★ అపూర్వ హంతకులు ★

లాంటి కళేబరం. జాతిగా శాక్యం తెలియని ఘటం. రోజుకొకటంటూ రొప్పుతుంటూ మంత్రికిలా భరవసా యిచ్చాడు!

"ఏమిటీ బెదిరింపు ఉత్తరాల గోల! మీరివ్వన్నీ ఖాతరీ చెయ్యరనే అనుకుంటున్నాను లెండి! రోజూ నాకిలాంటివి రెండూ మూడూ వస్తూనే ఉంటాయే!"

కాని మంత్రి అతని మాటలు లక్ష్యపెట్టకుండా విసుగ్గా చకచకా ముందుకు సాగిపోయాడు! అయినా సభ్యు డతన్ని వెంటాడిస్తూ "ఇదుగో!" అని ఏదో మొదలుపెట్టబోయాడు! మంత్రి "చాల్చాల్లే! పో!" అని అతన్ని గెంటివేసి, అంగలు వేస్తూ తన గదిలోపలికి వెళ్ళిపోయాడు!

దీనితో ఆ గౌరవనీయ సభ్యుడు దిగాలుపడిపోయాడు! "నోటికెంతవస్తే అంతేగాని జాతిగా మర్యాదకూడా తెలియదే! అబ్బే! ఏమిటిది! అస లీయనగారు వట్టి పిరికి మనిషి! లేకపోతే ఈ ఉత్తరాల కింత హంగామా ఎందుకు? నాకు రోజు రోజూ ఇలాంటివి ....."

ఇంకొకచోట కొంతమంది గౌరవనీయ సభ్యులు జోరుగా సిగరెట్లు తగలబెడుతూ చెక్కు చెదరకుండా తమ దమ్ము సామాన్య ధోరణిలో ఈ అపూర్వ హత్యనుగురించి చర్చించారు. వారిలో ఒక పార్లమెంటు సభ్యుడు హుందాగా ఇలా అంటున్నాడు.

"ఉన్నవాళ్ళంతా నలుగురు! వీళ్ళేదో కాకమ్మ కథలో మనుషులలాగే కనిపిస్తున్నారు! అంతేగాని అసలు వీళ్లున్నారో

దృక్కథాలు

సినిమాకి బయలుదేరిన ఒక జంట, పదిఅడుగుల దూరంలో ఆగిన బస్సుకోసం పరుగెత్తారు. బస్సు అందలేదు.

"ని ముస్తాబు మూలాన్నే బస్సుదొరకలేదు. ఒక్క నిమిషంముందర తెమిలితే ఎంత బాగుండేది?" అన్నాడు భర్త.

"అసలు మీరంత తొందర పెట్టకపోతే ఇంకో ఐదునిముషాల తరువాత వచ్చేవాళ్లం. అప్పుడు తరవాత బస్సుకోసం ఇలా పావుగంట పడిగాపులు పడిఉండే కర్మం తప్పేది" అంది భార్య.

లేదో కూడా అనుమానమే! వీళ్ళ కెదురుగా ప్రపంచంలోకల్లా అత్యుత్తమ నాగరక దేశం అని పేరెన్నికగన్న ఆంగ్లదేశం ప్రచండ రక్షక సైన్యం అంతా బారులుదీర్చి నిలవబడిఉంది! ఇలాంటప్పుడీ హంగామా, ఈ కంగారూ చూస్తే ఇదంతా వట్టి వేళాకోళం వ్యవహారంలా కనబడుతూంది!"

కాని ఇంకొక సభ్యునికి ఆంగ్లదేశం ప్రపంచంలోకల్లా అత్యుత్తమ నాగరక దేశం అనడం అంతగా నచ్చలేదు. వెంటనే ఆ మాట కడ్డు పడుతూ—

"ఒక్క జర్మనీతప్ప!" అన్నాడు.

మొదటి సభ్యుడు చిరాగ్గా "ఇప్పుడీ చర్చలో ఆజర్మనీగోలెందుకు!" అని కసురుకుని "మన చర్చల్లో మాటిమాటికీ జర్మనీ పేరెత్తి ఆకాశానికెత్తేయడం మానేస్తే మంచిది!" అన్నాడు.

కాని ఆ సభ్యుడా జర్మనీప్రస్తావన అంతటితో విడిచిపెట్టలేదు! ఇంకా అంతకన్న ఉత్సాహంగా "మరొక్క విషయం మరిచిపోతున్నారు. జర్మనీలో ఒక్క ఉక్కు, ఇనుము ఉత్పత్తి మాసినా, అది తల ఒక్కింటికి నూటికి 43 రెట్లెక్కువ పెరిగింది! ఇంకా నౌకా నిర్మాణంలో కూడా—" అని ఏదో ఏకరువు పెట్టబోయాడు!

ఇంతలో ఇంకొక సభ్యుడీ అంకెలగోడవ విడిచిపెట్టివేస్తూ "ఇంతకీ సర్ రేమన్ ఈ శాసనం ఉపసంహరిస్తాడంటారా?" అని అడిగాడు!

"రేమన్ ఉపసంహరిస్తాడా! అబ్బే! అతనిగొంతులో ఊపిరి ఉన్నంతవరకు అపని మాత్రం జరగదు! ప్రాణాలైనా విడిచిపెట్టడానికి సిద్ధంగా ఉన్నాడు!"

"ఇలాంటి అత్యద్భుత సంఘటన ఎన్నడు తటస్థించలేదు!" అన్నాడింకొక సభ్యుడు. మరి ముగ్గురు సభ్యులు 'అవును నిజమే' అని తలలూపారు!

ఇంతలో ఇంకొకమూల కూర్చున్న సభ్యుడులేచి "నేనే విదేశ మంత్రినయితే ఇంత హడావిడి జరిగినా ఊరుకున్నందుకు పోలీసువారిని హడలగొట్టేసిఉందును!" అన్నాడు.

ఈ సభ్యులీవిధంగా చర్చసాగిస్తూవుండగా ఓట్లలెక్కింపుకోసం గట్టిగా గంటమోగింది! సభ్యులంతా కంగారుగా లోపలికి పరిగెత్తారు.

తరవాత పార్లమెంటులో వేరొక అభివృద్ధిచట్టానికి సంబంధించిన "లేక యిక ముందు నిర్ణయించేవిధంగా" అనే సవరణ అత్యధిక సంఖ్యాకుల ఆమోదం పొందింది. అదిఅయిపోగానే పార్లమెంటులో తిరిగీ సర్ ఫిలిప్ ప్రవేశపెట్టబోయే చట్టాన్ని గురించిన చర్చ ప్రారంభమైంది.

ఒక ప్రముఖసభ్యుడు లేచి ప్రసంగిస్తూ "మంత్రివర్గసభ్యులు నిజమైన రాజకీయ వేత్తలయితే తమ వ్యక్తులకు సంబంధించిన విషయాలన్నీ పూర్తిగా మరిచిపోవాలి! ఇది నేనెప్పుడు చెబుతూనే ఉన్నాను! ఇప్పుడు తిరిగి ఆ విషయమేనొక్కి వక్కాణిస్తున్నాను!" అన్నాడు.

"వినుడు! వినుడు!" అని హెచ్చరించాడొకమూల కూర్చున్న సభ్యుడు.

తిరిగీ ఆసభ్యుడు తన అనన్య సామాన్య వాగ్ధోరణిలో ఇలా ఉపన్యసించాడు.

"మంత్రివర్గసభ్యులు తమ స్వంతవిషయాలొక మూలకునెట్టివేసి సర్వదా దేశశ్రేయస్సే తమ ఆరాధ్యదైవతంగా భావించాలి నిన్ననే జరిగిన ఒక బ్రహ్మాండమైన సమావేశంలో నేనీ విషయమే ఉద్ఘాటించాను. "మంత్రులుప్రజానీకం ఇచ్ఛానుసారంగా నడుచుకోవాలి! ప్రజలు అతిచాకచక్యంతో ప్రతీదీ జాగ్రత్తగా తూచితూచి మరీ నిర్ణయిస్తారు కనక వారి సున్నితమైన—కాదు—కాదు—మహోన్నతమైన—భావాలు జాగ్రత్తగా గమనిస్తూ వాట అడుగుజాడల్లో నడవాలి. ఏది ఏమైనా ఆ ఉపన్యాసంలో మాత్రం నేను మంత్రుల ధర్మనిర్వహణాన్ని గురించి విస్పష్టంగా వివరించి చెప్పాను."

అని చివరికి చప్పరించి ఊరుకున్నాడు.

ఇంతలో నౌకరొక పచ్చని కవరు పళ్లెంలోపెట్టి భద్రంగా ఒకసభ్యుని కందించాడు.

ఆ సభ్యుడా కవరుతీసి సులోచనాలకోసం తడుముకుంటూ "ఎవరైనా ఇది ఇక్కడ మరిచిపోయారా?" అని అడిగాడు. ఆ కవరుమీద "పార్లమెంటు సభ్యులకు" అని చిన్న చిరునామా కనిపించింది. ఆ సభ్యుడది చదివి కళ్ళద్దాలపైనించి పక్కవారిని పరకాయించి చూచాడు!

ఇంకొకసభ్యుడక్కడికి వస్తూనే అది చూసి "ఏదో లిమిటెడ్ కంపెనీ భోగట్టా అయిఉంటుంది. రోజూ నాకిలాంటివి వందలాదిగా వస్తూంటాయి. నిన్ననే—" అని ఏదో చెప్పబోయాడు.

ఉత్తరం అందుకున్న సభ్యుడది చేతితో పట్టుకుని "ఉత్తరం చాలా చిన్నది. కంపెనీ భోగట్టాలాగ కనిపించడంలేదే!" అన్నాడు.

లేకపోతే ఏదో మందులగోలై ఉంటుంది. తెల్లారి లేవగానే రోజూ నాకిలాంటిదొకటి తయారౌతూనే ఉంటుంది. దాని మీద "ఆరోగ్యమే మహాభాగ్యము" లాంటి దచ్చు ధర్మపన్నాలేవో తగులడుతూంటాయి! కిందటివారమే ఎవడో నాకిలాంటిదొకటి అంటుగట్టాడు!"

"కవరు చించండి!" అన్నాడొకాయన.

కవరందుకున్న సభ్యుడది చించి నాలుగు పంక్తులు చదివాడు. అంతే అతనిముఖం కందగడ్డలా మారిపోయింది. "ఏమిటి అఘాయిత్యం!" అంటూనే ఉత్తరం పైకి చదివాడు! ఆ ఉత్తరం ఇది :

మహాజనులారా!

ఆంగ్లప్రభుత్వం ప్రస్తుతం పార్లమెంటులో ఒక చట్టం ప్రవేశపెట్టాలని ఆలోచిస్తూంది. తమ దేశాన్ని రాక్షస ప్రభుత్వ పరిపాలనలోనించి తప్పించాలని కంకణం కట్టుకుని ప్రస్తుతం ఆంగ్లదేశంలో ఉన్న దేశభక్తులు కొంతమంది ఈ చట్టంమూలాన ఆ క్రూరప్రభుత్వం చేతుల్లో చిక్కుకునే ప్రమాదం ఏర్పడగలదు.

ఈ చట్టం పార్లమెంటులో ప్రవేశపెట్టబోయే మంత్రికీ విషయం ఇంతకు పూర్వమే తెలియజేశాం. ఇది వెంటనే ఉపసంహరించుకోకపోతే ఆయన్ని చంపివెయ్యడం ఖాయమేనని కూడా హెచ్చరించాం. విదేశ మంత్రి ధీరులు. విజ్ఞులు. చాలా నిజాయితీపరులు. అందువల్ల ఇంత తీవ్రచర్య తీసుకోవడం మా కిష్టంలేదు.

ప్రపంచంలోని పార్లమెంటుల కన్నిటికీ ఈ పార్లమెంటే మొట్టమొదటిది గదా! ఇలాంటి పార్లమెంటు సభ్యులైన మీరంతా

మీ శక్తి సామర్థ్యాలు ఉపయోగించి, ఈ చట్టం ఉపసంహరించేటట్లు చెయ్యాలని కోరుతున్నాం. మేము నిశ్చయించిన తీవ్ర చర్య తీసుకోవలసిన ఆవశ్యకత ఏర్పడకుండా ఉండాలందులకే మీకీ విషయం ఇంతగా వివరించి వ్రాస్తున్నాం.

మేము సామాన్య హంతకులమో, అరాజకవాదులమో అయివుంటే మిమ్మల్ని అందరినీ ఈపాటికి మూక ఉమ్మడిగా హత్య చేసేవాళ్ళమే! కాని మేమలాంటివాళ్ళం కాదు. మాది వటి బెదిరింపు కాదని ఋజువు పరచటానికి ఒక విషయం తెలియజేస్తున్నాం. మీరంతా విశ్రాంతి తీసుకునే గదిలో బల్లకింద కొంచెం పరిశీలించి చూడవలసిందని కోరుతున్నాం. అక్కడ ఒక యంత్రం కనిపిస్తుంది దానిలో ఈ భవనంలో చాలా భాగం ఒక్కసారిగా నేలమట్టం చెయ్యడానికి తగినంత విద్యుచ్ఛక్తి ఉంది!

(సం) అపూర్వ హంతకులు.

తాజాకలం. ఆ యంత్రం పేల్చడానికుపయోగించే తీగమాత్రం దానిలో జతపరచలేదు. కనక ఆ యంత్రం ఇటు అటు తిప్పి చూసినా ప్రమాదమేమీ లేదు!"

ఈ ఉత్తరం వింటున్న సభ్యుల కళ్ళల్లో వెలిగే వెలుగులన్నీ క్రమ క్రమంగా ఆరిపోయాయి! ఉత్తరం ధోరణి చూస్తే దానిలో నమ్మకుండా ఉండడానికెక్కడా ఆస్కారం కనిపించడం లేదు! వెంటనే వారి చూపులన్నీ ఆ గదిలో బల్లకిందికి వాలిపోయాయి అక్కడ నల్లగా నలుచదరంగా ఒక ఘనపదార్థం ప్రత్యక్షమైంది! అది చూడగానే సభ్యులంతా ఒక్కసారిగా "అమ్మయ్యో!" అని వెనక్కి తగ్గారు.

* * *

ప్రధానమంత్రి వెంటనే స్కాట్లండ్ పోలీసు కార్యాలయంనించి ఒక పోలీసు ఉద్యోగిని రప్పించాడు. ఇతడిలాంటి విషయాలలో ప్రత్యేకంగా నిపుణుడు. ప్రధానమంత్రి "ఇదంతా ఊరికే హడలగొట్టడానికి చేసిన పనేనా?" అన్నాడు.

పోలీసు ఉద్యోగి గంభీరంగా దానికేసి చూస్తూ "సరిగ్గా ఆ ఉత్తరంలో రాసినట్లే ఉంది సార్ ఆ తీగ లేకపోవడం కూడా సరిగ్గా ఆ ఉత్తరంలో ఉన్నట్లే ఉంది." అన్నాడు.

"అయితే ఇదంతా నిజంగా—?"

"ఇది పార్లమెంటు కట్టడం అంతా ఒక్కసారిగా నేలమట్టం చేసే యంత్రమే సార్!" అని సమాధానం!

ప్రధాన మంత్రి గబగబ తన గది నించి ఇవతలికి వచ్చి, కంగారుగా వరండాలో పచారు ప్రారంభించాడు.

ఒకసారి దిగులుగా కిటికీలోంచి పైకి చూశాడు. ఎదురుగా డాబామీద చాలామంది సభ్యులు గుంపులుగుంపులుగా గుమిగూడి కంగారుగా ఏవేవో విషయాలు మాట్లాడుకుంటున్నారు.

"పరిస్థితి బాగా ప్రమాదకరంగా తయారయిందే!" అని మంత్రి లోలోపల గొణుక్కున్నాడు. తరవాత పోలీసు ఉద్యోగితో "ఇంతకుపూర్వమే జనానికీ కేసును గురించిన విషయాలెన్నో తెలియజేశాం. ఇక ముందుకూడా అదే మంచిపనిలా కనబడుతూంది. ఈ వేళ జరిగిన వివరాలన్నీ పూర్తిగా పత్రికలకివ్వడమే మంచిది! ఆ ఉత్తరం నకలు కూడా ఇవ్వాలి" అన్నాడు!

వెంటనే గంట మోగించాడు. కార్యదర్శి సందడి కాకుండా మెల్లిగా అడుగులు వేసుకుంటూ పిల్లిలా వచ్చి గదిలో నిలుచున్నాడు.

"ఈ యంత్రం ఇక్కడ పెట్టినవారిని పట్టుకోడానికి సాయపడినవారికి వెయ్యి పౌనులు బహుమతీ ఇస్తున్నాము. ఈ దారుణం చెయ్యడానికి చేయూత ఇచ్చినా సరే! దీని ఆచోకీ తెలియజేసినవారిని శిక్షించకుండా క్షమించి విడిచిపెట్టేస్తున్నాము. ఇది వెంటనే పోలీసు కమిషనర్‌కు తెలియజెయ్యి!"

ఈ మాటలు వింటూనే కార్యదర్శి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

స్కాట్లండ్ కార్యాలయం ప్రత్యేకోద్యోగి ఇంకా అలాగే వేచిఉన్నాడు.

"ఆ యంత్రం ఇక్కడికెలాగ వచ్చిందో మీవాళ్ళకేమైనా తెలిసిందా?"

"ఏమీ తెలియలేదు సార్! అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసులనందరినీ ఆ పనిలోనించి తప్పించివేశాం. కూపీ తీయడం కోసం ఎన్నోవిధాల దర్యాప్తు సాగించాం. కొత్తమనిషెవరు లోపలికి రావడం గాని, తిరిగి వెళ్ళడం గాని జరగలేదని అంటున్నారు"

ప్రధానమంత్రి బాగా మథనలోపడి పెదిమలు కొరుక్కుంటూ—"అయితే సరే!" అన్నాడు. పోలీసుద్యోగి వెళ్ళిపోయాడు.

ఇంక ఆ డాబామీద సమావిష్టులైన పార్లమెంటుసభ్యులలో ఇద్దరు సభ్యులు దీనికి సంబంధించిన వ్యవహారంలో అగ్ర

తాంబూలం అందుకున్నారు. "కొంచెం తప్పిపోయిందిగాని లేకపోతే నేనాయంత్రానికి దగ్గరగా కూర్చుని ఉందును. తలుచుకుంటే ఇప్పుడుకూడా ఒళ్లంతా ముచ్చెమటలు పోస్తూందే! నీకు జ్ఞాపకం ఉందా! నేనాసమయంలో, నిన్న సమావేశంలోమాట్లాడిన సంగతులు చెబుతున్నాను. ఇంతలో_"

మరొక మెంబరిలాఅన్నాడు: ఆఉత్తరం తీసుకొచ్చిన నౌఖర్ని "ఇది నీ కెక్కడ కనపడింద"ని అడిగాను. "నేలమీదే సార్" అని సమాధానం చెప్పాడు. మొట్టమొదట ఏదో సామాన్యంగావచ్చే మందులకంపెనీ కవరే అనుకున్నాను. అది చించాలనికూడా అనుకోలేదుసుమా! ఇంతలో ఒకాయన _"

"నేనేనయ్యా! ఆకవరు చించమన్నది!" అన్నాడాపక్కనే చతికిలపడ్డ 'గంగాళం' సగర్వంగా.

"అవునవును! ఎవరో నన్ను చించమని అడిగినట్లే జ్ఞాపకం! కవరులో ఉత్తరంతీసి రెండుమూడుపంక్తులు చదివాను. అంతే! వెంటనే "ఎంతదారుణం!" అన్నాను! _

అబ్బే! అలాగనలేదు! "ఘోరం! ఘోరం!అన్నారు"అని తిరిగి ఆ 'గంగాళం' సరిదిద్దాడు!

"అవును! నిజమే! అలాగే అన్నాను!" అని అంగీకరిస్తూ ఆ సభ్యుడు మళ్ళీ "ఆపైన అలాగే ఇంకా చివరిదాకా చదువుకుపోయాను! కానిదానిలోతు మాత్రం మొట్టమొదట నాకేమీ బోధపడనేలేదు! అన్నాడు."

*　　*　　*

ఇక్కడ వ్యవహారాలిలాగ సాగుతూంటేగా అక్కడ ఆక్స్‌ఫర్డ్‌వీధిలో ఒక ప్రసిద్ధ సంగీతశాలలో జరిగే గానసభకొక ముగ్గురు పెద్దమనుషులు హాజరయ్యారు. తమకోసం ప్రత్యేకించినమూడు మొదటితరగతి సోపాలలోను ఈ ముగ్గురు సుఖాసీనులైనారు. మాన్‌ఫ్రెడ్ హుందాగా దుస్తులు వేసుకుని సరిగా సాయంత్రం ఏడున్నర అయ్యేసరికి దర్జాగా సోఫాలో జేర్లపడ్డాడు. పాయ్‌కార్ట్ ఎనిమిదిగంటలకు జేరుకున్నాడు. బాగా డబ్బు దస్కం ఉండి, నలభయ్యోపడిలోపడ్డ పెద్దమనిషిలా కనపడ్డాడు. ఎనిమిదిన్నర అయ్యేసరికి గోన్సాలెజ్ వచ్చి సోఫాలో కూర్చుంటూ స్వచ్ఛమైన ఆంగ్లంలో ప్రోగ్రాం కాగితం కావాలని అడిగాడు. ఇతడా ఇద్దరికీ మధ్యగా కూర్చున్నాడు.

ఒకదేశభక్తి గీతం ఆలాపన ప్రారంభమైంది. హాల్లో ఉన్నవారంతా ఆనంద తన్మయతలోపడికొట్టుకుంటూ అదేపనిగా హర్షధ్వానాలు ప్రారంభించారు.

అదేసమయంలో మాన్‌ఫ్రెడ్ గోన్సాలెజ్ కేసి తిరిగి "అదంతా సాయంత్రం పేపర్లలో పడిందే!" అన్నాడు.

గోన్సాలెజ్ జాయగా తలపంకిస్తూ సమాధానం చెప్పాడు!

"కొద్దిలో తప్పిపోయింది గాని కొంచెం గొడవయ్యేదే! ఒక పార్లమెంటు సభ్యుడు నన్ను చూసి మీరే సమావేశానికి హాజరు కారని చెప్పారే!" అన్నాడు. వాటిలో ఒకతను నాదగ్గరిగా వచ్చి నన్ను పలకరించాడు కూడాను!

(ఇంకా ఉంది)

మజ్జన్న చెప్పిన సబబు

బండెద్దులు మెడమువ్వలు గలగల చప్పుడు చేసికొంటూ పరుగు లెడుతున్నాయ్. నొగమీదకూర్చున్న బండతనికి పగ్గాలు బిగపట్ట శక్యంగావటంలేదు!

దూరాన్నుంచి ఏదోపల్లెపాటశ్రావ్యంగా సన్నంగా వినిపిస్తోంది. పక్షులు కిచకిచలాడుతూ గూళ్లు చేరుకొంటున్నాయ్. అల్లంతదూరంలో అక్కడా అక్కడా పచ్చిక మేస్తున్న పశు సముదాయాలు కనబడుతున్నయ్. భానుడు అరుణకిరణాల్ని వెదజల్లుతూ ప్రకృతికన్యకు వినూత్నమయిన సోయగాన్ని చేకూరుస్తున్నాడు.

బండతనుకూడా మాంచి హుషారుగా కబుర్లుచెప్తున్నాడు: "......బాబుగోరూ! రెండు సిగరట్టు పీకలుంటే ఇప్పించండీ... ఏటీ! కాల్సే అలవాటే లేదంటారా...... ఏటుండి! బస్తీబాబులుగందా - ఇంత చేటలవాటుండదా అనుకొండాను......అది సరే గానుండీ......మీ రెన్ని గలాసుల సదువు సదివినారుండీ?......ఏటీ! పద్దెకొండుగలాసు లే!! లేనికయినా పెట్టిపుట్టాలిగందాండి; మా బుడ్డోడున్నాడాండీ...? అడ్ని సదువుకోరా అంటే ససేమిరా సదవనంటాడుండీ......ఎడ్లజత మొన్ననే కొన్నాలెండి ...ఎట్టాగుందంటారు? ... సూశారా గుఱాల్లా గాలపులు తీత్తన్నాయ్...ఏపుండోయ్ పల్లెపాలెం కి వార్లకొచ్చేశినం లెండి..."

కబుర్లు చెబుతూనే బండి మలుపు తిప్పాడు.

దారి పొడుగునా గతుకులూ గోతులూ ఉండటం మూలాన్న కిందకి పడుతూ లేస్తూ పోతున్నది బండి. ఎడ్లలోకూడా మునుపటి ఉత్సాహం లేదు. మొఖ్ఖో మంటూ లాక్కుపోతున్నాయ్—కానీ బండతను మాత్రం ఎప్పటిలానే కొరడా మాటిమాటికీ ఝళిపిస్తూ హుషారుగానే వున్నాడు.

ప్రకృతికన్య తెల్లచీరవిప్పి నల్లచీర కట్టుకుంది. నా ఆలోచనలు మాధవయ్యమావ వైపుకి మళ్ళాయి మాధవయ్యమావ 'పల్లిపాలెం'లో కాపరంవుంటూ ప్రక్కగా వున్న 'వుప్పాంగల' గ్రామంలో కరిణీకం చేస్తున్నాడు. రెండు గ్రామాల్లోనూ మంచి పలుకుబడి, పరపతీ వున్నాయ్.

సెలవ లివ్వంగానే 'పాలెం'లో పదిరోజులుండి రావటం అలవాటు. మరి మాధవయ్యమావకూడా చాలా సరదాఅయిన మనిషి. పొలాలమ్మట తీసుకుపోతాడు. అప్పటికప్పుడు పాలెకాపుచేత లేనక్కాయలు కాల్పిస్తాడు. ఒకొక్కప్పుడు మొక్కజొన్న కండెలు - మరొకప్పుడు తేగలు. ఏమేమో చిత్రచిత్రాలయిన పల్లెగోషవలు చెబుతాడు. ఒకొక్కప్పుడు తన స్వీయానుభవాల్నికూడా చెప్పకం కద్దు. అవన్నీ అనేక కథలుగా అల్లొచ్చు అనిపిస్తోంటుంది. ఒకొక్కప్పుడు పక్క పక్క గ్రామాలకి తనతోబాటుగా తీసుకపోయి అక్కడున్న వింతలూ, విశేషాలూ చూపిస్తాడు. నేనున్నన్నాళ్ళూవిధిగా పేపరు తెప్పిస్తాడు. మావయ్యకి ఇద్దరమ్మాయిలు. అలివేణి పెద్దది. సీతమ్మ చిన్నది.

అలివేణి అదో తరహా మనిషి. అవసరం అయితేతప్ప ఎవళ్ళతోనూ మాటాడదు. పని వున్నప్పుడు పనిచెయ్యటం - లేనపుడు ఏదో పుస్తకం పట్టుకు కూర్చోవటం.

మరి సీతమ్మమాత్రం ఒట్టి చీమిరపకాయ! పొట్టిగా ఉంటుంది గాబట్టి అందరూ ముద్దుముద్దుగా "పొట్టెమ్మాయ్" అని పిలవటం పరిపాటి. అన్నీ తింగణా కబుర్లే చెబుతుంది.

అత్తయ్యకూడా చాలా అప్యాయత గల మనిషి ......

ఆలోచనల కంతరాయం కల్గిస్తో కంచు కంఠం ఖంగుమనిపించాడు బండతను "బాబుగోరూ" అంటూ.

"ఏమిటోయ్...?" అన్నానుచికాగ్గా.

"అదేనుండీ ... కరణంగోరిల్లు ఒచ్చేసిందండి" అన్నాడు.

అనవసరంగా చికాకుపడినందుకు సిగ్గుపడుతూ బండిదిగాను. పక్కింటమ్మాయితో గిల్లికజ్జాలాడుతూన్న 'పొట్టెమ్మాయ్' నన్ను చూడగానే "అచ్యుతం బావొచ్చాడేవ్ ...." అంటూ లోపలికి తుఱ్ఱుమంది. బండతనికి అర్ధెరూపాయలిచ్చి బాగ్ పట్టుకొని లోపలికి వెళ్లాను.

అత్తయ్య సవాలక్ష కుశలప్రశ్నలడిగింది. అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలిచ్చాను.

"వెళ్లాడు - ఏపొద్దనగా బండెక్కాడో? కడుపు కరకరలాడుతూ వుంటుంది. అమ్మాయ్ ... అలివేణీ! పీటా కంచం పెట్టవే నాన్న ఆరోగ్యం బావుందా నాయనా? పోయి పెరట్లో కాళ్లు కడుక్కురా..." అందత్తయ్య.

సరేనని పెరట్లోకి నడిచాను.

అన్నం అంతగా సయించలేదు .... పెరుగన్నం కలుపుకొంటూంటే అత్తయ్య అంది "అదేం తిండిరా! మా కాలంలో...."

ఇప్పుడు తన చిన్నతనపు సంగతులన్నీ ఏకరువు పెడుతుందేమో అనుకొంటూ, "అత్తయ్యా! మావయ్యేడీ..?" అన్నాను ప్రసంగం మార్చే ఉద్దేశంతో.

వస్తున్నానని ఉత్తరమయినా వ్రాశావ్ గాదేంరా? మావయ్య నిన్ననే జమా బందీలకని కాకినాడ వెళ్లారు.........వారం రోజులు పట్టచ్చేమో........." అంది అత్తయ్య

"హతోస్మి!!" అనుకొన్నా.

2

భళ్లున తెల్లారింది!

దంత ధావనానికని పెరట్లోకొచ్చేప్పటికి పొట్టెమ్మాయ్ గొల్లున ఏడుస్తోంది!!

"సంగతేమిటత్తాయ్...?" అన్నాను-నిజానికత్తయ్య అక్కడ లేనేలేదు.

పట్నవాసాల్లో వ్యక్తిత్వానికి గౌరవం ఉండదు. ఎంతసేపూ చట్టానికే అధిక గౌరవం ఇవ్వబడుతుంది. పల్లెటూళ్ళలో మటుకు సాధారణంగా వ్యక్తిత్వమే నాలుగు కాళ్లా చెలామణీ అవుతో ఉంటుంది. ఏదయినా తగాయిదా వచ్చిందంటే పల్లెకి పెదకాపు తనకు తోచిన రీతిలో తీరుస్తాడు.

"పాడిగేద రాత్రి ఈనొచ్చి చచ్చిపోయింది......అదంటే పాపమ్మాయ్‌కి బోలెడు ప్రేమ!" అంది అలివేణి ముసిముసిగా నవ్వుతూ.

వేపపుల్ల విరుచుకొని గొడ్ల చావిటి వైపు నడిచాను.

పిల్లలూ పెద్దలూ చాలామంది చుట్టూ మూగి వున్నారు. రకరకాలుగా తమతమ తాపాలను వెళ్ళగ్రక్కుతున్నారు ప్రతి ఒక్కరూ.

అత్తయ్య చుట్టూ చేరిన ముత్తయిదువులతో చనిపోయిన పడుగు గేద తాలూకు గుణగణాలన్నీ ఏకరువు పెడుతోంది.

ఒక పండు ముత్తయిదువ బుగ్గలు నొక్కుకుంటూ "దుక్కలాటి బర్రెమ్మా..... అయినా ఆ యముడాడికి ఉన్నట్టుండి ఇటువంటి పాడుబుద్ధి కలుగుతుందని కలగన్నామా! ఒక క్షణం ముందు వెనుకల్లో అంతా వెళ్ళవలసిన వాళ్ళేగదా అమ్మా... గీతా రహస్యంలో శ్రీకృష్ణ పరమాత్ముడన్నట్టూ . ...." అంటోంది అందర్నీ తప్పించుకొని లోపలికి వెళ్ళాను.

గేద చచ్చి పడివుంది వీరన్న కాపూ, చౌదరయ్యా, వెంకయ్య తాత ఇంకా కొంతమంది కాపులూ మోకాళ్ళ నానుకుని కూర్చుని తాపీగా లావుపాటి లంక చుట్టలు కాలుస్తున్నారు

వీరన్న కాపు మా మావయ్య భూములు సేద్యం చేసే రైతు రెండు చేతులా ఇంత తినటానికి పెట్టటానికి సరిపడ్డ ఆస్తి వెనకేసుకొని తీరుబాటుగా కాలం వెళ్ళబుచ్చే వ్యక్తి. వెంకయ్య తాత మహా ఘుట్టి సాని కాభూమి! చౌదరయ్య మాత్రం ఉప్పంగల వాస్తవ్యుడు మావయ్య అన్నంటే ఉంటాడు ఎప్పుడూ. మావయ్యకి కుడిభుజం లాటి మనిషి!......మావయ్య కూడా అతనికి చాలా విధాలుగా సహాయం చేశాడని చెప్పుకొంటారు. ఉప్పంగల గ్రామాన్ని గురించి కానీ, ఆ గ్రామవాసుల్ని గురించి గానీ పల్లెత్తు ఒక్కన్నా సహించలేడు. ఏది వొచ్చినా అనవసర తగవులు వకొల్లా పెట్టుకొన్నట్లు వాదిస్తాడు.

మెల్లిగాపోయి వీరన్న కాపు పక్కగా కూర్చున్నాను.

మరో క్షణంలోకే — కళ్ళల్లో చింత నిప్పులు చెరుగుకొంటూ, తీవ్రంగా మాటా మాటా అనుకొంటూ యిద్దరు ఆగంతకులు రంగంలోకి ప్రవేశించారు. అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు ఏం జరగబోతోందా అని.

చౌదరయ్య ఇద్దరిలో ఒకడి నుద్దేశించి "ఏరా యెంకడూ! యేంటి విషయం...?" అన్నాడు చుట్టనుసి దులుపుకొంటూ.

"అసలీడికిక్కడికి రావల్సినవసరం ఏవొచ్చిందండీ .. పతీదానికీ పోటీకి వొత్తంటాడు దొంగయెదవ! ఏగేమైనా ఈ బర్రెని నే పట్టుకు పోవల్సిందేనండీ ... అన్నాడు వాడు.

అవతలవాడుకూడా ఏదో అనబోతుండగానే చౌదరయ్య గర్జించాడు గంభీరంగా: 'నాయం ఎంకడిదేయిప్పే వుంది. అది సరే గాని ఏరా భద్రుడూ! నిన్నెవరు రమ్మన్నారురా?"

"నాయంవుందట నాయం.. అణ్ణి నేనే పిలిపించాను" అన్నాడు వెంకయ్య తాత పళ్ళు పటపట కొరుకుతూ

విషయం ఏమిటని వీరన్న కాపునడిగాను. ఆశ్చర్యంగా నాకేసి చూస్తూ "మీ రెప్పుడొచ్చారు బాబులూ...!" అన్నాడు. సమాధానం చెప్పి వెనకటి ప్రశ్నే అడిగాను రెట్టించి

"అదేనండీ...అడు మన పల్లిపాలెంబారికోడు - ఈడు ఉప్పంగల బారికోడు. గేదని నేతీసుకుపోతానంటే నే తీసుకుపోతనని తగవులాడుతున్నారండీ .." అంటూ "ఒరేయ్ కోటాయ్! - పెదకాపు గారికి ఇషయం కబురు చెప్పు" అన్నాడు వీరన్న కాపు

కోటాయ్ త్వరత్వరగా అంగలు వేసికొంటూ నిష్క్రమించాడు.

ఇరుపక్షాలవారు ఇంకా మాటా మాటా కసిగా అనుకుంటూనే వున్నారు. ఒక్కొక్కప్పుడు మరీ జడిగా వుంది.

ఈసారి చుట్టూచేరిన జనం రకరకాలుగా న్యాయాన్యాయాలు చెప్పుకొంటున్నారు.

మరో అయిదునిమిషాలు గడిచాయో లేదో కోటాయ్ రొప్పుకుంటూ వచ్చాడు.

న్యాయమూర్తి: నువ్వు జేబు కత్తిరిస్తుండగా ఆరుగురు చూశామంటున్నారు. ఇందరు సాక్షులున్నా నువ్వు నేరం ఒప్పుకోవేం?

నిందితుడు: దానికేముంది లెండి. నేను జేబు కత్తిరిస్తుండగా చూడలేదని 60 మందిని సాక్ష్యం తేగలను

"పెదకాపుగారేమన్నారా...?" ఆత్రంగా అడిగాడు వీరన్న కాపు

"చెప్పేనండీ...మరో ఘడియ గడిచాక రాంకోవిలకి రమ్మనా...అన్నారండి" ఒగర్చుకుంటూ చెప్పేడు కోటాయ్.

"పెదకాపుగారు తీర్పు చెప్తారుగా..." అనుకొంటూ ఒక్కొక్కరే నిష్క్రమించారు.

3

పట్నవాసాల్లో వ్యక్తిత్వానికి గౌరవముండదు ఎంతసేపూ డబ్బుకే అధిక గౌరవం ఇవ్వబడుతుంది. కానీ ముప్పాతిప్పలూ పడి ముప్ఫైమూడూ కోట్లు తిరిగి వ్యవహారం సీదాగా పరిష్కారం చేసుకొనేసరికి ఇల్లా వొసార్లో నల్లయి కూర్చుంటుంది. కాగా—

★ సుబ్బన్న చెప్పిన సబబు ★

పల్లెటూళ్లలో మటుకు సాధారణంగా వ్యక్తిత్వమే నాలుగుకాళ్లా చెలామణీ అవుతోంటుంది. ఏదయినా తగాయిదా వచ్చిందంటే పల్లెకి పెదకాపు తనకు తోచిన రీతిలో తీరుస్తాడు. ఏదో మనసీ పెదకాపు చెప్పిన తీర్పుకి బద్ధులై వుండాల్సిందే! మరి 'రామకోవిల్'లే తీర్పులు చెప్పబడే న్యాయస్థానాలుగా వ్యవహరింప బడుతాయ్.

గంభీరమయిన వదనం ... బలిష్టమయిన శరీరం...నల్లగా నిగనిగలాడే మెలేసిన మీసాలూ...నోట్లో లావుపాటి చుట్టా... నిశితమయిన దృక్కులూ...వెనక్కి ముడివైచి కట్టబడివున్న జుత్తుముడీ...వొంటికి వొదులుగావున్న గ్లాస్కో లాల్చీ—అందులోంచి స్పష్టంగా కనబడుతోన్న లేసు బనీనూ...మాంచి తమాషాగా కట్టబడిన ఆ పంచెకట్టూ ... చేతిలో పొన్నుకర్రా ... కాళ్లకి కిర్రుచెప్పులూ...వాలు కుర్చీమీద ఠీవిగా కాలుమీద కాలేసుకొని కూర్చున్న ఆసామీని చూపిస్తో అంది పాపమ్మాయి "అతనేరా-సుబ్బన్న పెదకాపు..." అని.

రామకోవిలకి దగ్గరగావున్న ఎత్తుటరుగుల మీద కూర్చుని చూస్తున్నాం పాపమ్మాయీ నేనూను.

వీరన్న కాపూ...చౌదరయ్యా ... వెంకయ్యతాతా...కోటాయ్...వగైరా వగైరా అంతా హాజరయ్యారు.

పెదకాపు సుబ్బన్న కిర్రు చెప్పు లోమారు కిర్రుమనిపించి, చుట్ట నుసి దులుపుకొంటూ అన్నాడు: "అంతా ఒచ్చినోట్టునోరు... ఈ సారేం సెప్పుకొంటవో సెప్పుకోరా ఎంకడూ..."

"అదికాదుండి పెదకాపుగోరో...ఎక్కడయినా నాయం వుందుండీ? కరణంగోరు మా వూరి మడిసి అవడం ఏటీ-ఆరిగేద సచ్చిపోతే నాకు పోనీకండా ఈ దొంగయెదవ ఎగరేసుకు పోవటం ఏటుండి! ఎంత కాదన్నా కరణంగోర్కి ఆరి కుటంబానికీ మా సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినాంగందాండి...అటువొంటొప్పుడు నాకు రావల్సిందే గందాండీ..." అన్నాడు వెంకడు చాలా ధాటీగా.

చౌదరయ్య పండుమీసాలు మెలేసి, చేతికఱ్ఱొకసారి నేలకి తాటించడంలో "నేనేసుమా వెంకడికిన్ని లాపాయింట్లూ నూరిపోసింది..." అన్న అహం ప్రస్ఫుటమవుతోంది.

కొద్ది సేపయాక సుబ్బన్న కాపు గంభీరంగా అన్నాడు: "ఇక భద్రడు సెప్పుకొనేదేటో సెప్పుకోచ్చు......"

"నాయం సెప్పుకోవాలి పెబువులు... కరణంగోరి గేద నూత్తే మనూర్లోనే పుట్టింది—మనూరు గడ్డితినే పెరిగింది—మనూర్లోనే సచ్చింది—గందాండీ? అటువొంటొప్పుడు...దాని బతుకంతా మనూర్లో అవటం ఏటీ—అదింకో వూరు రెదవ సేతుల్లోకి పోవటం ఏటి!? ఇయాల్టికిదొద్దు! రేపటికింకోటొద్దీ!! అదీగాక—మా అయ్యా, అయ్య అయ్యా, ఆడి కయ్యల మట్టే ఈ పాలేన్ని కనిపెట్టుకున్నాంగందాండీ... ఇట్టాగవుతే మరి ఉండగల్తుమా?" అన్నాడు భద్రుడు మరీ ధాటీగా.

"బా బాగా సెప్పుకొన్నావ్‌రా భద్రుడూ......మనూరిగడ్డి మా సేవయిందిగా మట్టే కరణం గోరి గేదదుక్కలా బలిసింది. మరో వూరుగడ్డి అయితే ఎప్పుడో సచ్చేది" అన్నాడు వెంకయ్య తాత భద్రుడికి బలం చేకూర్చాలన్నట్టుగా.

తెంపకాయ కొట్టినట్టయింది చౌదరయ్యకి. ఎక్కడలేని అభిమానం ముంచుకొచ్చింది—తన గడ్డిని వెంకయ్య తాత పరోక్షంగా ఆడిపోసుకొన్నందుకు. అలవాటు ప్రకారం భుజాలొకసారెగరేసి "గడ్డి గడ్డని మిడిసి పడుతుండారు—మా వూరు గడ్డిబీళ్లు నూడండి తెలుత్తాది.......ఊరికే కూతలు కూయంగానే సరిపోదు" అన్నాడు.

"అయితే మీ వూరు గడ్డి బీళ్ళకే నన్నమాట ప్రసిద్ధి..... పాపం—ప్చ్...ప్చ్" ఒక పల్లిపాలెం వాస్తవ్యుడు గాఢంగా నిట్టూర్చాడు ఊరుకోలేక.

"మా వూర్లో పంట బూములు లేవను కొంటునోరు......? మా వూరు ఆయకట్టు మా దొడ్డది. కావలిస్తే మా కరణంగోరి నడగండి..." అతి కోపంలో కాస్త తడబడ్డాడు చౌదరయ్య.

వాతావరణం చాలా గా వేడెక్కిపోయింది.

సుబ్బన్న కాపు లేచి నిలబడ్డాడు!—త్రాసు ఎటువైపు మొగ్గుతుందో మరి.?

"నాయంగా నూత్తే......మాధవయ్య గోరు మనూరు కరణం గోరు కాదు. 'కరణం గోరు మా వూరు మడిసి అవటం ఏటీ—ఆరి గేద సచ్చిపోతే నాకు పోనీకండా ఇంకో దొంగ రెదవ ఎగరేసుకు పోవటం ఏటీ...ఎంత కాదన్నా కరణం గోర్కి, ఆరి కుటుంబానికి సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినాంగందాండీ......' అంటున్నాడు ఎంకడు. కాకపోతే—కరణం గోరి గేద మనూర్లోనే పుట్టింది—మనూరు గడ్డితినే పెరిగింది—మనూర్లోనే సచ్చింది కూడాను—భద్రుడు సెప్పినట్టు. నాయం నూత్తే ఇద్దరిదీ ఉన్నట్టుండాది!—అందుకని నే సెప్పేదేటంటే...మనూర్ని నమ్ముకున్న మడిసి భద్రుడు—మనూరి గడ్డితిని బల్సిన కరణం గోరి గేద తోలూ మాంసం భద్రుడికి వెళ్ళటం నాయం. కాకపోతే కరణం గోర్కి సెప్పులు కుట్టిచ్చే ఎంకడికి సదరు గేద తోలూ సెర్మం వెళ్ళటం నాయం....." ఇరు పక్షాలకీ న్యాయం చేకూరేట్టు సబబు చెప్పేడు సుబ్బన్న కాపు. ★

న్యాయవాది: నువ్వు నేరం చెయ్యలేదంటావు. నేరం జరిగినప్పుడు నిన్ను చూచిన వారెవరైనా ఉన్నారా?

ముద్దాయి: అదృష్టవశాత్తూ ఎవ్వరూ చూడలేదండి.

నాగార్జునుడు

ఇటీవల నాగార్జునసాగర నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభం కావడంతో నాగార్జునాచార్యుని పేరు బాగా నలుగురి నోళ్ళలోను పడుతున్నది. గుంటూరుకు సమీపంలోవున్న 'నాగార్జునకొండ' కూడా ఈ ఆచార్యునికొక సుస్థిర స్మారక చిహ్నంలా నిలబడిఉన్నది. అయితే యీ నాగార్జునాచార్యుడెవరు?

చరిత్రలో ఇద్దరు ముగ్గురు నాగార్జునులు కనిపిస్తున్నారు. వీరిలో మొదటివాడు నాగార్జునపర్వతంమీద నివసించిన మహానీయుడు. భదంత నాగార్జునుడని మరిఒక నాగార్జును డున్నాడు. ఇతడు వైద్యశాస్త్రంలో ఒక ప్రఖ్యాతగ్రంథం రచించిన మనీషి. ఇలాగే ఇంకొక [illegible]గార్జునుని పేరు కూడా అక్కడక్కడ వినబడుతున్నది. వీరు ముగ్గురు బౌద్ధులే. ముగ్గురు రసాయనశాస్త్రంలోను, వైద్యశాస్త్రంలోను కూడా కొన్ని గ్రంథాలు రచించినవారే! ఇందువల్లనే చరిత్రకారులకు వీరిచరిత్ర పరిశోధన ఒక క్లిష్టసమస్యగా పరిణమించింది. అయితే వీరిలో మొదటి నాగార్జునుని పేరుప్రఖ్యాతులు ఆరోజుల్లో విదేశాలకుకూడా వ్యాపించిపోయాయి.

ఇతడు విదర్భదేశీయుడని ఒక వాదం వున్నదిగాని ఇతని జీవితకాలం అంతా ఆంధ్రదేశంలోనే నాగార్జున పర్వతంమీదనే గడిచిపోయింది.

ఇతడు క్రీస్తుశకం రెండవశతాబ్దంలోనివాడని చరిత్రకారులంతా అంగీకరిస్తున్నారు.

శాతవాహనులు

ఆరోజుల్లో ఆంధ్రదేశం శాతవాహన చక్రవర్తులు పరిపాలించేవారు. వారి రాజధాని ధాన్యకటకం. అదే ఇప్పటి ధరణికోట! ఈ చక్రవర్తులు దక్షిణాపథమేకాక ఉత్తర భారతంలో చాలాభాగం పరిపాలించి క్రీస్తుశకం రెండుమూడు శతాబ్దాలదాకా భారతదేశంలో అంతటా ప్రాముఖ్యం వహించారు.

ఈ చక్రవర్తులు బౌద్ధమతాని కన్నివిధాలా చేయూతనిచ్చి పోషించారు. వీరు బౌద్ధులేమో అన్నంత గౌరవాదరాలతో బౌద్ధ భిక్షువులను గౌరవించేవారు. నాగార్జునుడు వీరి కాలంలో అంటే క్రీస్తుశకం రెండో శతాబ్దంలో నాగార్జునకొండపై ఒక గొప్ప బౌద్ధ విహారం నిర్మించినట్లు తెలుస్తున్నది. ఆరోజుల్లో ఇది దక్షిణాపథంలో బౌద్ధ ధర్మానికి గట్టి పట్టుగొమ్మగా ఉండేది.

మహాయానం

బౌద్ధమతంలో హీనయాన మహాయానాలని రెండు ప్రధానశాఖ లేర్పడాయని చరిత్ర పరిశీలించినవారందరికీ తెలిసినవిషయమే! ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో మహాయాన సిద్ధాంతాలు బీజప్రాయంగా ఉన్నా, మహాయాన సిద్ధాంతం బాగా ప్రవర్తింపజేసినవారిలో ప్రప్రథముడు నాగార్జునాచార్యుడేనని చరిత్రకారులు చెబుతున్నారు. నాగార్జునుడు ప్రారంభించిన ఈ మహాయాన ప్రస్థానం దక్షిణ భారతదేశంలోనేగాక ఉత్తర భారతదేశంలోను చైనా, జపాను, టిబెట్ మొదలైన దేశాల్లోను విశేషంగా వ్యాప్తిచెందింది. ఈ విధంగా పరిశీలిస్తే ఈయన గౌతమబుద్ధుని తరవాత బౌద్ధ ధర్మ ప్రవర్తకులలో ప్రప్రథమశ్రేణిలోకి వస్తున్నాడు.

తత్త్వశాస్త్రవేత్త

ఈయన రచించిన మహాయాన వేదాంత గ్రంథాలసంఖ్యాకంగా వున్నా వాటిలో కొన్నిమాత్రమే మనకిప్పుడు లభిస్తున్నాయి. వీటిలో 'మాధ్యమికకారిక' ఈయన రచించిన గ్రంథాలన్నింటికీ మకుటాయమానమైనది. ఇంకా ఈయన రచించిన కొన్ని గ్రంథాలిప్పుడు చైనా టిబెట్ భాషలలో మాత్రమే లభిస్తున్నాయి. పాశ్చాత్య సంస్కృతవిద్వాంసులు కొందరీ గ్రంథాలలో ఒకదానిని టిబెట్ భాషాగ్రంథాన్ననుసరించి తిరిగి సంస్కృతకారికల్లోకి అనువదించారు. ఆ గ్రంథం పేరు 'మహాయానవింశక సూత్రం'.

పాశ్చాత్యుల ప్రాచ్యవిజ్ఞానాభిమానానికీ సంస్కృతభాషా గౌరవానికీ, పరిశోధనాభినివేశానికి ఇది ఒక చక్కని తార్కాణం! అయితే ప్రస్తుతవిషయానికిది అప్రస్తుతం.

శంకరుని అద్వైతవాదం

శంకరుని అద్వైతవాదానికీ నాగార్జునుని మాధ్యమిక (మహాయాన) వాదానికీ చాలా దగ్గరపోలికలు కనిపిస్తాయి. ఇందువల్లనే శంకరుల అద్వైతవాదానికి 'ప్రచ్ఛన్న బౌద్ధవాదం' అనే అపప్రథ ఏర్పడి ఉండవచ్చును.

నిజానికి నాగార్జునుడు శంకర భగవత్పాదులతో సరిపోల్చదగిన మహా తత్త్వవేత్త. అయితే వీరిద్దరికీ ప్రధాన సిద్ధాంతాలలో కొంతభేదం ఉంటే ఉండవచ్చును. ఐతే అద్వైత వేదాంతానికి ఇటీవలికాలంలో బాగా ప్రసిద్ధి వచ్చివుండడంవల్లను, బౌద్ధం ఆంధ్రదేశంలో నామమాత్రావశేషమైపోవడంవల్లను, నాగార్జునుని మహత్త్వము చైనా టిబెట్ మొదలైన విదేశాల భాషలలోను, 'నాగార్జున కొండ' శిల్పశిథిలాలలోను నామమాత్రంగా నిలబడిఉన్నది. అమరావతీస్తూపనిర్మాణం నాగార్జునాచార్యుని పర్యవేక్షణలోనే జరిగిఉండవచ్చునని కూడా కొందరు చరిత్రకారులూహిస్తున్నారు.

మాధ్యమికవాదం — శూన్యవాదం

మాధ్యమికులనుగురించీ, శూన్యవాదాన్ని గురించీ విద్యారణ్యుని వేదాంతపంచదశిలో కొంత చర్చ జరిగింది. అద్వైత వేదాంతం పూర్వరంగం పరిణామం సమగ్రంగా అవ

డబ్బు పొదుపు చెయ్యాలనుకున్న ఒకాయన ఒకరోజు సాయంత్రం ఆఫీసునుంచి బస్సు వెనకాతలే పరిగెడుతూ ఇల్లు చేరుకున్నాడు.

"ఇవాళ పది అణా చేశాను బస్సు వెనక పరుగెత్తి" అన్నాడు భార్యతో.

"నా పిలకాయలా ఉంది మీ తెలివి. ఏ టాక్సీ వెనకో పరిగెత్తుకొస్తే రెండు రూపాయలు కలిసొచ్చేవిగా" అంది భార్య.

★ నాగార్జునుడు ★

గాహన కావాలంటే నాగార్జునుని గ్రంథాల లోను, విదేశభాషల్లోను నిలిచిపోయిన పరిశీలనం చాలా అవసరం. సంస్కృతం ఈయన గ్రంథాలు తెలుగువారి కందించడం



ఐదవ శతాబ్దంనాటి బుద్ధవిగ్రహం. ఇసుకరాయి (వాలుకాశిల) తో చేసిన ఈ విగ్రహం మథురలో ఉన్నది.

చాలా అవసరం. ఈయన ప్రాచీనాంధ్ర తత్త్వవేత్తలలో ప్రథమగణ్యుడన్న విషయం ఆంధ్రజాతి విస్మరింపరాదు.

రసాయన శాస్త్రవేత్త

ఆ రోజుల్లో బౌద్ధులందరు రసాయనాది ధాతుకశాస్త్రాల్లోకూడా బాగా పాండిత్యం గడించేవారు. నాగార్జునుడు రసాయన శాస్త్రంలోకూడా కొన్ని గ్రంథాలు రచించాడు. స్వయంగా కొన్ని రసాయన ప్రక్రియలవల్ల జరాపీడ వదిలించుకొని చాలాకాలం జీవించాడనికూడా ఒక కథ వినవస్తున్నది. ఈయన నిర్మించిన నాగార్జునపర్వతం బౌద్ధవిహారంలో దేశ దేశాలనుంచి వచ్చిన వేలాది విద్యార్థులు, బౌద్ధభిక్షువులు నివసించేవారనీ బౌద్ధ ధర్మ గ్రంథాలు పఠించేవారనీ తెలుస్తున్నది.

శాతవాహన చక్రవర్తులతరవాత ఇక్ష్వాకు రాజులు నాగార్జునకొండలోని బౌద్ధవిహారాకెన్నెన్నో దానధర్మాలు చేశారు. వీరికాలంలో ఈ విహారాల ప్రతిష్ఠ మిన్నుముట్టింది. ఇక్ష్వాకులతరవాతఆంధ్రదేశంలో బౌద్ధ ధర్మం అంతరించినదనే చెప్పవచ్చును. తరవాత ఈ విహారాలు క్రమక్రమంగా రూపుమాసిపోయాయి.


ఈ విహారాల శిల్ప శిథిలాలు కొన్ని లండన్ వస్తుప్రదర్శనశాలలోను, పాశ్చాత్య వస్తుప్రదర్శనశాలలోను ఉన్నాయి పాశ్చాత్యులు సంగ్రహించగా మిగిలినవి కొన్ని మద్రాసు మ్యూజియంలో ఉన్నాయి. ఇంకా కొన్ని శిథిలాలు నాగార్జునకొండ సమీపంలో ఉన్నాయి. ఈ శిథిలాలు భద్రపరిచే ప్రయత్నం జరుగుతున్నదని తెలుస్తున్నది.

ఈ నెల పదవ తేదీన పండిత నెహ్రూ నాగార్జునసాగర నిర్మాణానికి శంకుస్థాపన జరుపుతున్నారు. మహాతత్త్వవేత్త నాగార్జునుని నామధేయం ఈవిధంగానైనా చిరస్మరణీయం కాబోతున్నదని ఆంధ్రజాతి గర్వించవచ్చును. ఇంతేగాదు, ఈయన పేర నిర్మించే నాగార్జున సాగర జలాల వెల్లువలవల్ల ఆంధ్రదేశంలో బీడుగా పడిఉన్న వేలాది ఎకరాలభూమి సుక్షేత్రఖండికగా మారిపోగలదు. ఇంతేగాక వేలాది గ్రామాలకు విద్యుచ్ఛక్తి మొదలైన సౌకర్యాలుకూడా లభింపగలవు బౌద్ధం జీవకారుణ్యప్రధానమైనధర్మం. బహుశః కరుణాళువైన నాగార్జునాచార్యుని అఖండ తపశ్శక్తివల్లనే ఆంధ్రులకీ అదృష్టం పట్టిందేమో! ఎవరు చెప్పగలరు?


పి. గణపతిశాస్త్రి




చిత్రకారుడు: పి. నరసింహమూర్తి.



గుంటూరు మండలంలో మాచెర్ల వద్ద గల నాగార్జున విశ్వవిద్యాలయపు శిథిలాల దృశ్యం.




నాగార్జున కొండవద్ద త్రవ్వి తీసిన ప్రాచీన శిథిలాల దృశ్యం.




దేశ దేశాల బౌద్ధ భిక్షువులకు ఇది ఆలవాలమై ఉండేది.

28, 29 పేజీ లలో "నాగార్జున సాగర్" నమూనా.



నాగార్జున [illegible]







బొంబాయి, జుహూ బీచ్‌లో బెంగాలీ తార మాలతా సర్కార్.



ప్రతిభావారి "ఏది నిజం?" తెలుగు చిత్రంలో గుమ్మడి వెంకటేశ్వరరావు, జానకి.



నటుడు షమీ కపూర్ భార్య, తార గీతాబాలి.

బొంబాయి సినిమా లేఖ


సంయుక్త మహారాష్ట్ర ఉద్యమవాదులు నవంబరు 21 న జరిపిన ప్రదర్శనల సందర్భంలో రేగిన అల్లరులతో ఇక్కడి హిందీ చలనచిత్ర నిర్మాతలు చాలమంది ఆందోళన చెందుతున్నారు. ప్రాంతీయ తత్వాలు ప్రబలి తమ వ్యాపారానికి హాని కలుగుతుందేమోనన్న ఊహలతో కొంత మంది ఏ ఢిల్లీకో లక్నోకో తరలిపోతే మంచిదన్న ధోరణి ప్రదర్శిస్తున్నారు. కొన్ని హిందీచిత్రాల నిర్మాణం లక్నోలో కొనసాగించడానికి కొందరుసన్నద్ధులవుతున్నట్టు కూడా తెలిసింది. ఇందుకు తగినట్టే, లక్నోలోని ఒక పాత స్టుడియో బూజులు దులిపించి అతిచురుకుగా మరమ్మతులు చేయించి వేస్తున్నారు. ఆధునిక పరికరాలుకూడా అమరుస్తున్నారట.

* * *

భయానక చిత్రాలు తియ్యడంలో సిద్ధహస్తుడైన ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ నవంబరు మూడోవారంలో బొంబాయివచ్చారు.



విక్రమ్ ప్రొడక్షన్స్ వారి "తెనాలి రామకృష్ణ"లో నాగేశ్వరరావు, జమున.



బి. ఆర్. చోప్రా నిర్మిస్తున్న "ఏక్ హీ రాస్తా"లో మీనాకుమారి, అశోక్ కుమార్.

బొంబాయి సినిమా లేఖ

ఈయన నిర్మించిన ఇటీవలి చిత్రం 'టు క్యాచ్ ఎ థీఫ్' (విస్టావిజన్)కు ఆయన ఇక్కడి ఈరాస్ థియేటర్‌లో ప్రారంభోత్సవం చేశారు. చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖులు అనేక విషయాలగురించి ఆయనతో ముచ్చటించారు. ఈ ప్రదర్శనానికి వచ్చిన అందరితోనూ హిచ్‌కాక్ కలసికట్టుగా మాట్లాడారు.

"కీలకం అంతా కథలోనే" ఉంది అని ఒక సందర్భంలో హిచ్‌కాక్ ప్రవచించారు.

* * *

రిపబ్లిక్ పిక్చర్స్ నిర్మించిన హాస్యరస ప్రధానచిత్రం 'ఫాబ్యులస్ సినోరిటా' ఆధారంగా దేవేంద్రగోయెల్ తీసిన 'అల్‌బేలీ' త్వరలోనే విడుదల కాబోతున్నది. గీతాబాలి, ప్రదీప్‌కుమార్, ఓంప్రకాష్ రణ్‌ధీర్, జానీవాకర్ నటీనటులు.

* * *

రఘువీర్ చిత్రనికేతన్ వారి పౌరాణిక చిత్రం 'హరిహర భక్తి' పూర్తిఅయి, ఎడిటింగ్ జరుగుతోంది. ఆశామధుర్, ఉల్లాస్, త్రిలోక్‌కపూర్, సాహుమోదక్, దుర్గాఖోటే ప్రభృతులు నటించారు.

★ మంచి చిత్రాలకు పంచ సూత్రాలు ★

సిద్ధహస్తుడు హిచ్‌కాక్ ప్రవచనం

ఒక చిత్రం మంచి చిత్రంఅని పేరు తెచ్చుకుని విజయవంతం కావాలంటే దాన్ని సర్వాంగ సౌష్ఠవంగా తీర్చిదిద్దాలి. ముఖ్యంగా సినిమాకొచ్చిన జనం కునికిపాటు పడకుండా చూడాలంటే ముందు నిముషంలో ఏం కాబోతుంద అనే ఉత్కంఠ, తహతహ కల్పించడం చాలా అవసరం. ఇది సాధిస్తే కథ సాఫీగా సాగిపోతుందికూడా. సాధించాలంటే, సినిమాతీసే దర్శకుడికి మంచి జ్ఞాపకశక్తి ఉండాలి. చూపబోయేదృశ్యాలు ఎలా ఉంటాయో ముందుగా ఊహించుకునే ధీశక్తి ఉండాలి.

అనుక్షణం ప్రేక్షకులను తహతహలాడించడంలో సిద్ధహస్తుడైన హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ ప్రవచనాలు ఇవి.

ప్రేక్షకులను తహతహ లాడించాలన్న తహతహలో, దర్శకుడు చిత్రంలో వాస్తవికతను కాస్తా వదిలివేస్తే కథ జావగారిపోతుందని, ఫలితం ఏమీ ఉండదని హిచ్‌కాక్ హెచ్చరిక. ఉత్కంఠకు కీలకమైనది వాస్తవికత. ఏదిచూపినా ఏదిమానినా అది హేతువాదానికి తట్టుకోవాలి అంటారాయన. మంచి చిత్రాలకు ఐదు సూత్రాలను ఆయన స్థూలంగా సూచించారు.

1. కథకు తగ్గ వాతావరణం. ఇదివెక్కడో క్లైమాక్సుదగ్గరకుదాకా తేచాలదు. కథాప్రారంభం నుంచి, పాత్రలను ప్రవేశపెట్టే క్షణంనుండి శ్రద్ధవహించాలి. 2. కథ చెప్పడంలో

అంజలీదేవి, ఎన్. టి. రామారావు, జమున, రాజసులోచన, హిందీనటుడుగోపీ, అన్వర్ హుసేన్‌లు నటించిన సాంఘిక చిత్రం 'నయా అద్మీ'. ఈ తిరాదిని బాక్సాఫీస్ చిత్రం కావాలని నిర్మాతలు జూపిటర్ పిక్చర్స్ గట్టిగా కృషిచేస్తున్నారు. వీరు లోగడతీసిన తమిళచిత్రం వేలైకారి ఆధారంగా దీన్ని నిర్మించారు. దర్శకుడు చంద్రప్రకాశ్ దీక్షిత్.

(ఆంధ్ర వారపత్రిక, బొంబాయి లేఖరి)

అందుకు తగు విధంగా వివిధ ఉపకరణాలను ఉపయోగించుకోవడంలో కొత్తదనం ఉండాలి. 3. వాస్తవికత యొక్కడా లోపించకూడదు. 4. ఏది చూపినా ఏది మానినా అది హేతువాదానికి నిలవగలగాలి. వాస్తవికత దెబ్బతింటే, రసభంగం అవుతుంది. 5. అన్నిటికన్నా కథ ముఖ్యం. కథ సరిగ్గా లేకపోతే, విస్టావిజన్‌లో తీసినా సినిమాస్కోపులో తీసినా రంగులూ హంగులూ పుష్కలంగా అమర్చినా చిత్రం దెబ్బతింటుంది.

ఈనాడు ప్రజలు మంచికథలుంటే తప్ప కేన్నీ ఆదరించరు. అందువల్ల కీలకం అంతా కథలోనే ఉందనుకోవచ్చు. ★

'జయ సింహ'

నేషనల్ ఆర్టు థియేటర్స్‌వారి 'జయసింహ" చిత్రాన్ని డిసెంబరు 4వ తేదీన పత్రికా ప్రతినిధులకూ, చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులకూ చూపించారు. నటీనటులు: ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు, గుమ్మడి, రేలంగి, వంగర, కాంతారావు, రాజనాల, డాక్టర్ వక్కలంక కామరాజు, అంజలి, వహీదా రెహమాన్, ఋష్యేంద్రమణి, సీత మొదలగువారు.

ఇతివృత్తం: అనగనగా ఒక రాజు. మాటలు, పాటలు సముద్రాల జూనియర్. సంగీతం: టి. వి. రాజు. నృత్య దర్శకుడు వెంపటి సత్యం. ఫొటోగ్రఫ: ఎం. ఏ. రెహమాన్. నిర్మాత: ఎన్. త్రివిక్రమరావు. దర్శకుడు: యోగానంద్.

అనగనగా ఒకరాజు, ఆయన కొక తమ్ముడు. ఇద్దరికీ చెరోకొడుకు. లెక్కప్రకారం రాజుగారు కథా ప్రారంభంలోనే చనిపోతారు. రాజుగారి సోదరుడికి వారసత్వపు సిద్ధాంతం నచ్చక, యువరాజుని చంపెంచబోతాడు. యువరాజు జయసింహుడు పొరుగురాజ్యం వెళ్ళిపోయి, అక్కడి రాజకుమారిని దొంగలనుండి, రాజును శత్రువులనుండి రక్షించి, మంచిపదవి సంపాదించి ఆపైన రాజకుమార్తెను ప్రేమిస్తాడు. చివరికి, పినతండ్రిని యుద్ధభూమిలో నిరాయుధుడై కలుసుకుంటాడు. పినతండ్రి వధించబోయేసరికి, అతని స్వంతకుమారుడు విజయసింహుడే తండ్రిని చంపివేస్తాడు.

ఈ చిత్రంలో జయసింహుడుగా ఎన్. టి. రామారావు నటన ఉత్సాహయుతంగా సాగింది.

అనగనగా రాజుమోస్తరు కథలలో మూసపోసిన భూమిక ముఖ్యంగా విలన్‌ది ఈ తరహా భూమిక నిర్వహించడంలో కూడా ఎస్.వి రంగారావు విశిష్టత చూపగలిగారు. ముఖ్యంగా అనుచరులు ప్రగల్భాలు పలికినపుడు విసుగుదల చూపడం ప్రశంసనీయంగా వుంది.

చిత్రం బహుళ జనాదరణ పొందటానికి కావలసిన సూత్రాలన్నీ అక్షరాలా పాటించారు. చిత్రంలో సన్నివేశాలన్నీ కత్తియుద్ధాలమయం; (ఒకచోట కొగడాల యుద్ధం చూపించారు). సంభాషణలన్నీ యతిప్రాసలమయం. సంభాషణలు వ్రాసిన సముద్రాల జూనియర్ యతిప్రాసల విషయంలో అతిగా శ్రద్ధ తీసుకున్నారనిపిస్తూంది.

పాటలు, నృత్యాలు ఉన్న సన్నివేశాలు చిత్రించడంలో రెహమాన్ ఛాయాగ్రహణం ప్రతిభావంతంగా ఉంది. ★

తమాషాలూ; విశేషాలూ

ఏడేళ్లపాటు విడాకుల ప్రసక్తిలేకుండా కాపరం చేసిన దంపతులలో-ఏడో సంవత్సరం గడుపుతున్న వారిని విలాసార్థం విహారయాత్రకు పంపించాలని జపాన్‌లో ఒకఫిలిం సంస్థ నిశ్చయించింది. ఇందుకై ఏడోఏడాది కాపరం చేస్తూన్న ఇరవై జంటలను ఏరి ఆహ్వానిస్తారట. ఈ సంస్థ నిర్మించిన 'సెవెన్ ఇయర్ ఇచ్' అనే చిత్రం విడుదల సందర్భంలో జరుగనున్న ముచ్చట ఇది.

* * *

హిప్నాటిజంక్రింద పురుడు పోసుకోవాలని ఒక బ్రిటిష్ తార తలపెట్టిందట. ఆమె పేరు జాన్‌రిచర్డ్స్. జాన్‌స్టర్లింగ్ అనే ఒక హాలీవుడ్ నటి ఇదివరకే ఈ పద్ధతి అనుసరించింది. ముమ్ముందు చలనచిత్ర తారలు జానమ్మల అడుగుజాడల్లో నడవవచ్చునను కుంటున్నారు.

* * *


'గుడ్ బై మై లేడీ' అనే అమెరికన్ చిత్రంలో నటిస్తున్న 12 ఏళ్ల. కుర్రవాడు, షూటింగ్ జరుగుతుండగా, ఒక స్విమింగ్ పూల్‌లోదూకి సరాసరి నేలకి వెళ్లి కొట్టుకున్నాడు ఆడృష్టానికి, అతనిమణికట్టు బెణికింది. గడ్డంమీద పెద్ద దెబ్బతగిలింది' మర్నాడు షూటింగ్ జరిగేవేళకి, ఆఅబ్బాయి మొహంమీద కట్టుకట్టుకొని వచ్చాడు. కథలో అబ్బాయికి కట్లు గట్రా లేవు.

డైరెక్టరూ కవీ గట్టిగాఆలోచించి చివరికి కథ మార్చివేసి, కథలో అబ్బాయికి కూడా దెబ్బతగిలినట్లు వ్రాసుకున్నారు.

* * *

"గొప్ప డబుల్ ప్రోగ్రాం" అంటూ రెండేసి సినిమాలూ మూడేసి సినిమాలూ కలిపి చూపించడం పది పదహేనేళ్లనాడు ఆంధ్రదేశంలో జరిగేది. బొండాం పెళ్లి, బారిస్టరు పార్వతీశం, చదువుకున్న భార్య అనే మూడు సినిమాలూ ఆర్. ఎస్. ఫిలింస్ వారు కలిపి విడుదలచేశారు. అలాగే జగన్నాథ్ ప్రొడక్షన్స నిర్మించిన తారుమారు, భలేపెళ్లి, ఈస్టిండియా వారి సతీ అనసూయ, ధృవవిజయం జంటసినిమాలు.

ఈనాడు జపాన్ ఈ ఈ పంథా త్రొక్కింది. థియేటర్లలో నూరింట 90 వరకూ జంట సినిమాలే ప్రదర్శిస్తున్నాయి ★



హిందీ పౌరాణిక చిత్రం "శ్రీ గణేష్ వివాహ్"లో దుర్గాఖోటే.

స్వయంవరం

అనగనగా ఒక జమీందారు. ఆయనకు లేక లేక ఒక కొడుకు. ఆ కొడుకువిద్యాభివృద్ధికై జమీందారుగారు విపరీతంగా కృషి చేసిచేసి, కొన్నాళ్ళతరువాత ఆ బాధ్యతను భార్య బంగారమ్మకు ఒప్పగిస్తూ విల్లురాసి వెళ్లిపోయాడు. భర్త కోరిక ఈడేర్చాలన్న సంకల్పంతో ఆవిడ బస్తీనుంచి పల్లెకు తరలి వచ్చింది. అక్కడున్న చిన్న డాబా గోడలు ఎత్తుచేయించి, ఆమధ్య ఒక చిట్టిగది కట్టించి "విరాఘాటంగా చదువుకొని మీ నాన్న ముద్దు చెల్లించు, బంగారుతండ్రీ' అవటాని కుమార రత్నాన్ని అందులో కూర్చోబెట్టింది. ఒక వయోవృద్ధుని గురువుగా నియమించింది. ఆ యిద్దరూ కాలుకదప నవసరం లేకుండా, భోజనాది వసతులన్నీ సమకూర్చి పెట్టింది.

ఏడాది తిరిగింది. అబ్బాయికి ఆయేటి కాయేడు పైబడుతూందన్నారు బంధుకోటి. బంగారమ్మగారికొడుకు విషయంలోమాత్రం విద్యకే వివాహం వినాశనకారి కాజాలదంటే కాజాలదన్నారు పెళ్ళీడు పిల్లలున్న అమ్మలక్కలు. పిల్లని తను ఏరితే పిల్లవాడి చదువుకి పిసరంతకూడా డోకా వుండదని బంగారమ్మగారికి గట్టినమ్మకం కుదిరింది. సరే అంది.

'ఊ' అన్నారు ఊళ్లోచాలమంది. బంగారమ్మగారు సుఘ్మంది గే ఘటంకాదు. కొడుకును మేడ దిగనివ్వదు. అందుకని, మోజు గలవాళ్లంతా పిల్లలను వాళ్ళింటికే తీసుకు వెళ్ళేవారు. ఈమాట ఆనోటా ఆనోటా ఊరూర పాకింది. బస్తీకాలేజీలో చదువుతున్న చండిక, కాంచనమాల అనే యిద్దరమ్మాయిలు బంగారమ్మగారి బంగారు పిచ్చిక సంగతివిని విస్తుపోయారు. కుతూహలం కలిగింది. చండిక కాంచనమాల వాళ్ల అసలు పేరుకావు రూపరేఖా విలాసాల వల్ల ఇతరులు ఇచ్చినబిరుదులు. చండికవిచ్చు రూపాయల్లె ఖంగున మోగుతూ వుంటుంది. రూపాయి అంచు గరుకుల్లా ఆమె మొహం నాగవం లేకుండా ఉంటుంది. కాంచనమాల సన్నగా పొడుగ్గా చక్కగా ఉంటుంది. కెంపులీనుతూ ఉంటుంది ఇద్దరూ పంతం వేసుకుని, ఆపైనకూడ బలుక్కుని ఒకరోజు ఎవరికీ చెప్పకుండా బంగారమ్మగారిఊరు బయలుదేరారు.

బంగారమ్మగారి ఇంటి గుమ్మంలోనే ఇంకో అమ్మాయికూడా వాళ్ళకి తారసపడింది. ఆ అమ్మాయి పేరు శ్రీదేవి. చక్కగా ఉంటుంది. మంచివాళ్ళకి నెమ్మదస్తురాలుగాను, చెడ్డవాళ్ళకి నాజమ్మగానూ కనబడుతుంది.

ముగ్గురూ చాపమీద కూర్చున్నారు. బంగారమ్మగారు వాళ్ల పేరు పుట్టుపూర్వాలు కనుక్కుంది. రెండునిముషాలు ఆలోచించింది.

"ఓపిల్లలూ మీ ముగ్గురికీ మూడుపనులు చెబుతాను. పదినిముషాలలో పూర్తి చెయ్యాలి. అప్పుడు మా ఇంటికోడల్ని ఎన్నుకుంటాను" అంది.

సరేనన్నారు ముగ్గురు.

"ఓ చండికా! వసారాలో ఒక గడ్డపాయన ఉంటాడు. పేరు గడ్డంరాజు. మొండి. దేనికీ ఖాతరులేదు నువ్వువెళ్ళి అతగాణ్ణి లేవగొట్టాలి. పొలానికి పంపి ఒక బండెడు తాటాకు తెప్పించాలి అతగాడిచేత." అంది బంగారమ్మ.

"ఓ అదెంతపని అని ఎగిరి గంతేసింది చండిక.

"పిల్లా నీ పేరేమిటన్నావు? కాంచనమాల కదూ? పడకటింట్లో నా తమ్ముడి పడ్డాడున్నాడు. మహాదొడ్డవాడు చదువులో. ఒక్క అడుగు అలా కరణంగారింటికెళ్ళి, బస్తీలో ఇపుడు ఆడుతున్న బైస్కోపు ఏమిటో వాళ్ళ అబ్బాయిని కనుక్కుని వచ్చి చెప్పమను." అంది బంగారమ్మగారు.

"ఓ! ఇంతేకదా" అంది కాంచనమాల విలాసం ఒలకబోస్తూ.

"చిన్నదానా నీ పేరేమిటి?"

"శ్రీదేవి అంటారండి"

"సరే. పెరట్లో గడివాముదగ్గిర బొంత, దిండు వేసుకు కూర్చుని ఏకబిగిని రావుల శాస్త్రి ఏదో రాసేస్తున్న జానపాలకవి ఒకడున్నాడు. కవిత్వం రాయించడానికి మా తమ్ముడి పడ్డకుడు వాణ్ణి తీసుకొచ్చాడు. ఇదుగో ఈదస్తావేజు పట్టికెళ్లి కాస్తసాఫు రాసిపెట్టమను. నిమిషంపని అని చెప్పు. కాస్త ముక్కోపి జాగ్రత్త" అంది బంగారమ్మగారు.

* * * *

ముందు బయలుదేరిన చండిక చరచర నడిచి, సరాసరి వసారాలోకి వెళ్ళింది. కుక్కిమంచంమీద కూర్చుని గడ్డం దువ్వుకుంటున్న గడ్డంరాజు కన్నెత్తి చూడలేదు పన్నెత్తి పలకలేదు

"ఏవయ్యోయ్. గడ్డపాయనా. అలా పొలానికెళ్ళి ఓబండి తాటాకులు పట్టించుకురా" అంది చండిక ధీమాగా. గడ్డంరాజు కదలలేదు మెదలలేదు

"ఈ ఇంటికి కాబోయే కోడల్ని నేను తెలుసా?"

గడ్డంరాజు ఉలకలేదు పలకలేదు నిర్లక్ష్యంగా కూర్చున్నాడు

చండికకి ఒళ్లు మండిపోయి పెరట్లోకెళ్ళి వచ్చి బండెప్పట్టుకొచ్చి, హుంకరించింది.

గడ్డంరాజు కన్నెత్తి చూచి, "మంచి దమ్మా వస్తున్నాను. గంటలో పట్టించుకొస్తా" అన్నాడు.

"విలాసం ఒలకబోస్తూ" బయలుదేరిన కాంచనమాల పడకటింట్లోకి వెళ్ళి బంగారమ్మగారి తమ్ముడికి బావమరదిని పలకరించి, ఇంటికి కాబోయే కోడల్ని అని చెప్పింది. 'ఓహో అలాగా' అని తలవంచుకు చదువు కొనసాగించబోయాడు.

కాంచనమాల, తను వచ్చినపని చెప్పింది. బతిమాలింది బామాలింది బంగారుతండ్రీ, బావాలకొండ అంది. తనకన్న చిన్నదనని అలా పిలవడంతో అతడు తల ఎత్తి కళ్లు విప్పార్చి, సావకాశంగా చూశాడు కాంచనమాలను.

గడ్డం రాజుని గడగడలాడించింది చండిక. చదువుల రాయుణ్ణి చటుక్కున దారికి తెచ్చింది కాంచనమాల. భావకవి గావు కేకలకి బేజారైపోయింది శ్రీదేవి. ఈ ముగ్గురిలో, బంగారమ్మగారి కోడలు కావడానికి నోచుకున్న చిన్న దెవరు?

కొత్త వెళ్ళి కనుక్కు రమ్మంది కాంచనమాల. ఎప్పుడూ ఉండే చదువుకి అంతలో ముప్పేమీ ఉండదని హామీ ఇచ్చింది. ఎవరి మాటా వినని విద్యానిధి, కాంచనమాల మాట కాదనలేక కరణం గారింటికి బయల్దేరాడు శైస్కాప్ సమాచారంకోసం. దస్తావేజు కాగితం చేతబట్టుకొని, చిన్న చిన్న అడుగులు వేస్తూ బయలుదేరిన శ్రీదేవి, గడ్డివాము నీడలో హోరాహోరిగా కవిత్వం రాసేస్తున్న కవిని సొమ్మదిగా పలకరించింది.

'ఎవరవు తన్వీ. దివినుండి భువికి దిగితివో భువినుండి దివి కేగుచుంటివో' అన్నాడు భావకవి. అంటూ నేనాలిక కరచుకున్నాడు.

"ఈ దస్తావేజు కొస్త సాపు రాసిపెట్టాలండి" అంది శ్రీదేవి వినయంగా. మన్నూ మిన్నూల మధ్య ఉన్నదంతా అదరిపడేటంత కేక పెట్టాడు కవి. కొంతసేపు తెలుగులోనూ, ఆ తరవాత ఇంగ్లీషులోనూ కోప్పడ్డాడు. 'ఇన్‌సల్ట్' అనేశాడు. శ్రీదేవి హడలిపోయి కంట నీరెట్టుకుని సరాసరి ఇంట్లోకెళ్ళిపోయి చిక్క మొహం పెట్టుకు కూర్చుంది.

బంగారమ్మగారు సావిట్లోకి రాగానే చండిక గర్వంగా లేచి నిల్చొని, 'గడ్డపాయన్ని హాలానికి పంపేశానమ్మా' అంది.

"మీ తమ్ముడి బావమరది ముందు కునిసినా, చివరికి కరిగిపోయి కరణం గారింటికి కెళ్ళేరత్తయ్యా" అంది కాంచనమాల.

'ఏం చేశావుపిల్లా' అంది బంగారమ్మ.

శ్రీదేవి బొరుమంటు, "ఆయన గసిరి కొట్టారండి. దస్తావేజుకు సాపు రాయలేదు" అంది.

"నాతల్లే మా యింటి మా లక్ష్మి. నువ్వే నా యింటికి కోడలుకు దగ్గదానివి" అంది బంగారమ్మగారు శ్రీదేవిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని. చండిక మండిపడి హుంకరించింది.

"అగుగో అందుకే నువు నా కోడలు కావడానికి పనికి రావన్నది. గడ్డం రాజుని హడలేసిన ఆపెదానివి చేప్పొద్దున్న నా కొడుకుని నీ చేతి కీలుబొమ్మ చేసుకోవు! ఓ కాంచన మాలా! నువ్వూ [illegible]నికి రావు. నీ హొయలు నీ సొగసు చూ[illegible] మా వాడి చదువు, నా ప్రతిజ్ఞ, ఆ మ రాజు కోరిక బుగ్గిపాలయి పోతాయి. మాకు అన్ని విధాలా తగినది శ్రీదేవే. బంగారు తల్లి" అంది బంగారమ్మగారు.

* * *

ఆ ఉళ్ళోనే ఆకాశమంత పందిరేసి, భూదేవంత అరుగేసి అందుమీద ముత్యాల ముగ్గులూ, రత్నాలరంగ వల్లులూ తీర్చిదిద్ది, తన కుమార రత్నానికి శ్రీదేవికీ పెళ్లి చేసింది బంగారమ్మగారు. శ్రీదేవి వంటి ఇల్లాలు పిల్ల దొరికింది కాబట్టి, తన కొడుకు చదువు నిరాఘాటంగా సాగుతుందనీ, తన లక్ష్యం సిద్ధిస్తుందనీ మురిసి పోయిందావిడ.

ఇలా కొంతకాలం సాఫీగా సాగిపోయే సరికి ఒక ఏడాది జూన్ 18 న బంగారమ్మ గారి కుమారుడూ మెట్రిక్యులేషన్ ప్యాసై ఊరుకున్నాడు.

'రమణ' ★



(గత సంచిక తరువాయి)

ఐదో అధ్యాయం

రఘు ఇంటిలో అడుగుపెట్టగానే బావమరది రామమూర్తి ఎదురయ్యాడు. అతన్ని చూసి రఘు మర్యాదకు "ఎప్పుడు వచ్చావ"ని అడిగాడు. "ప్రొద్దున్నే వచ్చానోయ్. అప్పుడే నీవు ఆఫీసుకు వెళ్లిపోయావు" అన్నాడు రామమూర్తి. రఘు మరేమీ అడగలేదు. మాట్లాడలేదుకూడాను. కాని రామమూర్తిమాత్రం "ఇంతసేపేం జేస్తున్నావు. బాగా చీకటిపడేవరకూ రాలేదు. రోజూ ఇలాగే వస్తున్నావేమిటి? ఎక్కడకు వెళ్తున్నావు" అని ఇన్వెస్టిగేషన్ ప్రారంభించాడు. రఘు జవాబీయకుండా దొడ్లోకిపోయి కాళ్ళూ చేతులూ కడుక్కొని వచ్చాడు. బావమరదు లిద్దరూ భోజనానికి కూర్చున్నారు. రామమూర్తి మళ్ళీ మొదలుపెట్టాడు: "ఇంతసేపూ ఎక్కడ ఉన్నావంటే చెప్పావు కావేం? ఇంత రాత్రిపోయేవరకూ ఎక్కడ ఉన్నావు రఘూ." అత నలా గ్రుచ్చి గ్రుచ్చి అడిగే సరికి రఘు చెప్పక తప్పిందికాదు. "పార్కులో కూర్చున్నాను" అన్నాడు ముక్తసరిగా. "నిజమేనా" అన్నాడు రామమూర్తి. రఘుకు ఒళ్లు మండిపోయింది. తను చిన్నపిల్లవాడిలా అబద్ధం చెపుతున్నట్లే గదూ. "అంటే!" అన్నాడు తీవ్రంగా. తెలివితక్కువగా నోరు జారినందుకు రామమూర్తి నాలుక కరచుకున్నాడు. "అఁహఁ ఏమీ లేదు రఘూ. ఇంతసేపూ ఇంతచీకటి పడేవరకూ పార్కులో గడపవలసిన అవసర మేమివచ్చిందనే నే నడుగుతున్నది. ఇదివర కెన్నడూ లేదు ఈ కొత్తఅలవాటు - ఎప్పటినుంచి ప్రారంభమయిందని. నీ వొక్కడివే ఉన్నావా, లేక నీతో ఎవరైనా ఉన్నారా?" అని సాభిప్రాయంగా ప్రశ్నించా డతను. రఘు అతనికేసి ఒకసారి తీక్ష్ణంగాచూసి "ఒక్కడినే" అన్నాడు. రామమూర్తి అతని వాడిచూపు తప్పించుకోవడానికి తలవంచుకున్నాడు. అతను ప్రొద్దుటినుంచీ తల్లీ, ఇరుగుపొరుగులవాళ్లూ చెప్పినవన్నీ విన్నాడు. వాళ్లు చెప్పినదల్లా నమ్మివేశాడు. బావమరది చెడ్డ ప్రవర్తనకు ఆగ్రహం కలిగింది అతనికి. గట్టిగా చీవాట్లుపెట్టి సరియైనదారిలో పెట్టాలని ఆ చీవాట్లన్నీ ఊహించుకుంటూ పెద్ద ఉపన్యాసం తయారుచేసుకొని వర్లె వేశాడు. ఆ ఉపన్యాసం ప్రారంభించడానికి ఇప్పుడు సమయం వచ్చిందనుకున్నాడు. కొంతసేపు తటపటాయించి గొంతుక రెండుమూడుసార్లు సవరించుకొని ఉపన్యాసానికి ఉపక్రమించాడు: "ఇదుగో రఘూ, మనలో మనకు దాపరికం ఎందుకు? ఒకరిబాగోగులొకరికి కావలసినవాళ్ళం. అన్నిసంగతులు నిర్మొగమాటంగానే చెప్పకోవచ్చు -" అంటూండగానే రఘు వెండికంచంలో చేయి కడుగుకొని లేచాడు. రామమూర్తి గంభీరోపన్యాసానికి ఆరంభంలోనే ఆటంకం కలిగింది. పోనీ రఘుతోబాటు లేచి వెళ్దామన్నా ఇవతల విస్తరిలో పదార్థాలు జాలిగా చూస్తున్నాయి మమ్మల్ని ఇలా విడిచిపెట్టి వెళ్ళిపోతారా అన్నట్లు. అతనికొక నియమం ఉంది. తన ఇంట్లో ఎప్పుడూ చాలా క్లుప్తంగా భోంచేస్తాడుకాని ఎక్కడికైనావస్తేమాత్రం జాగ్రత్తగా రుచులన్నీ ఆస్వాదిస్తూ కడుపునిండా భోజనంచేస్తాడు. అందువల్ల రఘు ఎక్కడికి పోతాడనుకొని పదార్థా లొక్కటొక్కటే ఆరగించి గ్రుడన త్రేన్చి చేయికడుగుకున్నాడు. తరువాత పట్టీవేసుకుంటూ రఘుదగ్గరకు వెళ్లాడు.

తిరిగి ఉపన్యాసం ప్రారంభించాడు. "రఘూ, నేనేదో చెపుతున్నానని కోపగించుకోకు. నాకన్న నీ మంచిని కోరేవాడు మరెవడున్నాడు కనుక. చూడు మనకీ పడమటిదేశస్థులకీ ముఖ్యమైన తేడా ఏమిటను కున్నావు? వాళ్ళది భౌతికదృష్టి. మనది ఆధ్యాత్మికదృష్టి. వాళ్ళది భౌతికదృష్టి కాబట్టి వాళ్లు శారీరకసుఖా లెక్కువగా కోరుతారు. వాటికోసమే ప్రయత్నం చేస్తారు. కాని మనది ఆధ్యాత్మికదృష్టి. మనదేశంలో స్త్రీలకున్న గౌరవం మరే దేశంలోనైనా ఉందా? అందుకే మనవారు భార్యను గృహలక్ష్మి అంటారు. ఇల్లాలు కలకలలాడుతూఉంటే ఇల్లు కలకలలాడుతూ ఉంటుందంటారు. అందుకే భార్యను బాధ

డాక్టరు: "మీరు రోజుకు ఎన్ని సిగరెట్లు కాలుస్తారు?"

రోగి: "పదిహేను"

డాక్టరు: "ఇకనుంచీ తగ్గించాలి. అన్నం తిన్నప్పుడు మాత్రం ఒకటి కాల్చి, మిగతా అప్పుడు మానెయ్యండి," అని సలహా ఇచ్చాడు.

ఒక నెల అయిన తర్వాత రోగిని మళ్ళీ పరీక్షించి డాక్టరు "చూశారా, నేను చెప్పినట్లు చెయ్యడంవల్ల మీరు బాగా బలుస్తున్నారు," అన్నాడు.

రోగి: "కాని డాక్టరుగారూ! రోజుకు పదిహేనుసార్లు అన్నం తినడం ఇబ్బందిగానే ఉంటోందండి," అన్నాడు.

పెట్టేవాడెవడూ బాగుపడడనుకో. ఆ సంసారమూ బాగుపడదు—"పెద్ద పెద్ద ధర్మవాక్యాలతో ప్రారంభించి అసలు విషయానికి దిగుతున్నాడు రామమూర్తి. రఘుకు చెడ్డ చిరాకుపుట్టుకువచ్చింది. జేగింజలా పట్టుకొని తనేదో పెద్ద నీతిపరుడైనట్లు ధర్మప్రసంగాలు చేయడం చూస్తే ఎలా వదిలించుకుందామా అనిపించింది. కాని రామమూర్తి మాత్రం వదలిపెట్టడం లేదు. రఘుకు ఓర్పు నశించి పోతోంది. పైగా రామమూర్తి చెప్పదలచుకున్న విషయమేమిటో స్పష్టంగానే తెలుస్తోంది అందులోకే దిగుతున్నాడిప్పుడు. తనేం చేస్తున్నాడని ఈధర్మప్రసంగం స్వయంగా నిజానిజాలు తరచి తెలుసుకోకుండా వాళ్లూ వీళ్ళూ చెప్పింది గుడ్డిగా నమ్మివేసి దాని ఆధారంగా చేసుకొని తనను విమర్శింపబూనుకున్నాడు. తిరిగి రామమూర్తి సాగించాడు. "మా చెల్లెలిని చూడు. దానంత అమాయకురాలు భూమిమీద మరొకతె ఉండదు. ఎవరినీ పల్లెత్తుమాట అనదు. చాకిరీకి విసుగనేదిలేదు. అందానికి మాత్రం దానంత చక్కగా ఉండేవాళ్లెవరు? నిజంగా ఆదర్శ ధర్మపత్ని అంటే— నేను పొగడకూడదు కాని—అసలని చెప్పుకోవాలి. అటువంటిదానికి ఇప్పుడు నిరాదరణ కలిగిందంటే నేను నమ్మలేకుండా ఉన్నాను. చూడు రఘూ మనం మంచి సంప్రదాయం కలవాళ్ళం. అటువంటి నీవు పరాయిదాని పైటకుచ్చులకు మోసపోయి లక్ష్మిలాంటి భార్యను—పోనీ కుర్రవాడివా అంటే లేదు, ఇద్దరుపిల్లలతండ్రివి కూడా—సరిగా చూడకపోవడం ఎంతతప్పు—"

రఘుకు ఓర్పు నశించి పోయింది. "నేనేం చేస్తున్నాను. నేను నా భార్యను కొట్టడంకాని తిట్టడంకాని చేయడం లేదే. బహుశా నీలా భార్యకు దాసోహం చేయడం లేదు అదేనా నేను చేస్తున్న తప్పు" అన్నాడు. రామమూర్తికి చురుక్కున తగిలింది. ఇతరుల విషయాలలో గంభీరోపన్యాసాలు తమ విషయంలోకి వచ్చేసరికి అన్నీ మరచిపోయి సామాన్యమానవులైపోతారు రామమూర్తి గంభీరత కాస్తా ఎగిరిపోయింది. రఘు అన్నమాట చురుక్కున పొడుస్తూఉండడంవల్ల అతను మంట పట్టలేక అన్నాడు: "నా భార్యకు నేను దాసోహంచేయడం నువ్వు చూశావా. నేను నా భార్యను గౌరవిస్తాను గాని అడ్డమైన వాళ్ళతోటీ—"

"మాటలు సరిగా రానీయి" అని రంకె వేశాడు రఘు

"ఏం జేస్తావోయ్. అంటానా, మరీ అంటానా! ఎవత్తో సిగ్గులేనిదాని వెనకబడి తిరుగుతుంటే అనకేం జేస్తాను? ఏం చేస్తావేం?" అంటూ ముందుకు వచ్చాడు పౌరుషంతో రామమూర్తి రఘు కోపంలో ఒళ్లు తెలియక పిడికిళ్ళు బిగించుకొని ఎదరకు వచ్చాడు. ఇది చూసి సుశీలా, తల్లీ గబగబా పరుగెత్తుకు వచ్చి ఇద్దరి మధ్యా అడుపడ్డారు. తల్లి "నా కొడుకును కొట్టేస్తున్నాడండోయ్" అంటూ గోల మొదలుపెట్టింది. దానితో ఇరుగుపొరుగు లందరూ పరుగెత్తుకు వచ్చారు. వాళ్ళను చూసి ధైర్యం పెరిగి రామమూర్తి పెద్ద గొంతుకతో అరవసాగాడు "కొడతాడట చూడండి, మొనగాడు పెళ్లాన్ని ఏడిపించుకు తినే మొనగాడు. ఆ టక్కులమారిదంటే ఎంత అభిమానం పుట్టుకువస్తోందో" "నోరుమూస్తావా మూయవా" అంటూ రఘు మళ్ళీ ఎదరకు వచ్చాడు. కాని అక్కడ చేరిన మగవారు అతన్ని వెనక్కి లాగారు "నీకే మర్యాదవుతుంది పెళ్లాం వెనకాల చేతులు కట్టుకొని తిరగడం తప్పితే. ఆమె మీలాంటివాళ్ళ కన్న వేయిరెట్లు మర్యాద తెలిసినది అభిమానం కలది, మంచిది ఆవిడకున్న గుణాలలో ఒక సహస్రాంశం కూడా మీలో లేదు, ఆమెతో స్నేహం చేస్తుంటే—"

అని రఘు అంటూండగానే రామమూర్తి "ఆహా స్నేహం! ఎంత చక్కని బూటకం. పరాయి ఆడదానితో స్నేహమేమిటి? ఎవడు నమ్ముతాడు!" అంటూ అరిచాడు. ఇరుగుపొరుగులంతా తలకొక రకంగా వాగుతున్నారు. రఘు ఉన్నట్టుండి తిన్నతా నదుపులో పెట్టుకొని తన ఇంటిలో ఇటువంటి సంఘటన జరిగినందుకు అసహ్యించుకొని అక్కడినుంచి విసురుగా తన గదిలోకి చక్కాపోయాడు. కాని అక్కడివాళ్ళ సమావేశం మాత్రం పూర్తికాలేదు. రామమూర్తీ, అత్తగారూ, వెంకటలక్ష్మమ్మగారూ, జానకమ్మగారూ మొదలైనవాళ్ళ గొంతుకలుకలిసి గందరగోళంగా వినిపించాయి. కొంతసేపటికి ఆగిపోయాయి ఆవేళ కూడా సుశీల రఘు దగ్గరకు రాలేకపోయింది.

ప్రొద్దున్న రఘులేచి స్నానం చేస్తూండగా 'నువ్వు చెప్పంటే నువ్వు చెప్పని' అత్తగారూ బావమరిదీ గొణుక్కుంటున్నారు. చివరికి అత్తగారే అంది: "మా అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళ్తామోయ్"

★ అబల ★

అంది రఘుతో రఘు. మాట్లాడలేదు. లోపలకు వచ్చి బట్టలు వేసుకుని కూర్చున్నాడు. కొంతసేపుండి సుశీల ఒంటరిగా ఉన్న సమయం కనిపెట్టి "సుశీలా ఇలా రా" అని పిలిచాడు - ఆమె అన్నగారూ వాళ్ళకు వినిపించకుండా. సుశీల ఉలిక్కి పడి చూసింది. తన చెవులు తానే నమ్మలేకపోయింది. భర్తనోట ఎన్నడూ సుశీలా అని ఇంతవరకూ వినలేదు. ఇప్పుడతని పిలుపు ఎవరో పిలిచినట్లుంది తెల్లబోతూ అక్కడే ఉండిపోయింది. "సుశీలా, నిన్నే, ఇలా రా" అన్నాడు మళ్ళీ రఘు. సుశీల ఆశ్చర్యంతో భయంతో మెల్లగా వచ్చింది. గదిలోకి వచ్చిన తరువాత తలుపు జేరగిలవేసి రఘు సుశీల కళ్లలోకి కొంతసేపు సూటిగా చూశాడు. సుశీల ఆ చూపు కొగలేక తల వంచుకుంది. "ఏం, మీ అమ్మా అన్నయ్యా నిన్ను తీసుకువెళ్తామంటున్నారు. వెళ్తున్నావా?" అని అడిగాడు సుశీల మాట్లాడలేదు. రఘు ప్రక్కకు తిరిగి బుజంమీద నుంచి చెప్పసాగాడు: "ఇదుగో చెపుతున్నాను, సుశీలా! నీకు నామీద గౌరవం, విశ్వాసం లేకపోతే యథేచ్ఛగా వెళ్లు, నిన్నేమీ నే నడ్డుపెట్టను. నేనంటే నీకింత అసహ్యం, అపనమ్మకం ఏర్పడితే నేనేం చేయగలను? - నా మీద నీకు నమ్మకం లేకపోయింది. ఎవరో చెప్పిన మాటలు నీకు గురిఅయ్యాయి. నేను చేసిన తప్పుపని ఒకటి ఎత్తి చూపమంటున్నాను. ఎవరూ నోరు మెదపరేం. ఊరికే తిరిగి సంతలో నోళ్లు పారవేసుకుంటున్నారు. ఆమె ఎంతో స్నేహభావంతో నీ యింటికి వచ్చింది. సాటి స్త్రీవి కదా అర్థం చేసుకుంటావనే ఆశతో వచ్చింది. నీయింటికి రావలసిన అవసరమేముంది ఆమెకు. అయినా వచ్చింది. ఆమెకు మరో ఉద్దేశ్యమే ఉన్నట్లయితే ఇట్లా నీ స్నేహం కోసం ప్రాకులాడుతుందా? అటువంటి ఆమెను ఎంత అవమానించావు. ఏమైనా ఆలోచించావా ఆమెకూ హృదయముంటుందనీ, ఆమెకూ అభిమానం ఉంటుందనీ, ఆమె కూడా బాధపడుతుందనీ. ఎంత నిర్దయగా ప్రవర్తించావు. స్త్రీలు స్త్రీల పట్ల ప్రవర్తించే పద్ధతి అదేనా? మీ అమ్మ ఆమె నలా అవమానిస్తూంటే ఆపకుండా ఊరుకున్నావు. చెపుతున్నాను, సుశీలా, ఎప్పటికేనా తెలుసుకొని పశ్చాత్తాపపడక మానవు ఆమె నిలా అవమానించినందుకు. ఆమెకన్న ఉత్తమ స్నేహితురాలు మరొకతె ఉండదని నీకే తెలుస్తుంది. మళ్ళీ చెపుతున్నాను, సుశీలా! నాకు గాని, ఆమెకు గాని మరో దురుద్దేశ్యం లేదని. మేము కలుసుకోవడం కూడా మానివేశాం. ఇంకా నీకు మీ అమ్మతో వెళ్ళాలని ఉందా? నామీద నీకు నమ్మకముంటే ఉండు. లేకపోతే వెళ్లు. నేనేమీ అడ్డుపెట్టను." సుశీల ఇక ఆగలేకపోయింది. వచ్చి అతని కాళ్ళమీద పడి పాదాలమీద తలపెట్టి కంటికి మంటికీ ఏకధారగా ఏడుస్తూ "నేను వెళ్ళనండి, మిమ్మల్ని విడిచిపెట్టి వెళ్ళనండీ నన్ను సుశీ అనే పిలవండి, సుశీల అనకండి" అంది. రఘు కొంతసేపామెకేసి చూసి మెల్లగా లేవనెత్తాడు. "నేను ఎన్నోసారు చెప్పాను, సుశీ, ఇటువంటి దాస్యపు చేష్టలు నాకు నచ్చవని. ఏడవకు. నామీద నీవు విశ్వాసముంచితే పోయి మీ అమ్మ వాళ్ళతో రానని చెప్పు" అని ఆమె కన్నీళ్లు తుడిచి పంపాడు. సుశీల ఒకమారాతనికేసి జాలిగా చూసి వెళ్లింది. రఘు సంతృప్తితో తన పద్యాల పుస్తకం పేజీలు తిరగవేయసాగాడు.

భోజనాలవేళయింది. భోజనానికి వెళ్లాడు రఘు. అత్తగారూ, బావమరిదీ అతనికేసి చూడడానికి మొగం చెల్లక తలలు ఎత్తకుండా విస్తళ్ళదగ్గర కూర్చున్నాడు. అత్తగారు అంది "మేము ఇప్పుడే పదిన్నర బండికి వెళ్ళిపోతున్నామోయి మా అమ్మాయి కూడా మాతో వస్తోంది." రఘుకు ఆశ్చర్యం వేసింది భార్యకేసి చూశాడు సుశీల తలవంచుకొని ఉంది. "మాతో వచ్చి కొన్నాళ్లుంటుందిలే అమ్మాయి నువ్వు కూడా అన్నంపెట్టుకుని తిను. బండికి వేళవుతుంది" అంది తల్లి. రఘు సుశీలను అడిగాడు "ఏం వెళ్తున్నావా సుశీ" అని - ఇంతలోనే ఇంతగా మారిపోయిందా అని. ఊఁ అన్నట్లు తల ఊపింది సుశీల. "మా అమ్మ అన్నయ్యా చాలా బలవంతం చేస్తున్నారు. పదిహేనురోజులుంచి పంపిస్తామంటున్నారు" అంది వినిపించీ వినిపించకుండా. తల్లి వెంటనే అంది: "మాకు కన్న కడుపు తీపిలేదనుకున్నావా, మాకు మాత్రం మా అమ్మాయి మాతో కొన్నాళ్లు గడపాలని ఉండదూ. అమ్మాయి మా యింటికి వచ్చి చాలారోజులయిందికూడా. త్వరగానే పంపిస్తాములే. మాతో తీసుకువెళ్తాము" అని. రఘు మారు పల్కలేదు. భోజనం పూర్తిచేసి చేయికడుక్కొనివచ్చి ఆఫీసు దుస్తులు వేసుకున్నాడు. రామమూర్తి బండి తీసుకువచ్చాడు. సామాన్లు బండిలో పెట్టించాడు "అమ్మా, అమ్మాయీ, రండమ్మా" అని కేక వేశాడు. ఎలాగో తెగించి "వెళ్ళి వస్తామోయ్ రఘూ" అని కేక వేశాడు. రఘు బయటికి వచ్చాడు. సుశీల కొంగు మొగానికడ్డుపెట్టుకొని నిలబడింది. పిల్లలెక్కించబోతున్నాడు రామమూర్తి. చటాలున రఘు ముందుకు వచ్చి పిల్లల్నిద్దరిని పట్టుకొని "మీ అమ్మాయిని తీసుకువెళ్తే తీసుకువెళ్ళండి. నా పిల్లల్ని తీసుకువెళ్లడానికి వీలులేదు," అన్నాడు. అంతా కొయ్యబారిపోయారు. సుశీలకు కళ్లు తిరిగినట్లయింది "అమ్మా నేను రాను, మీరు వెళ్ళండి" అని లోపలికి పరుగెత్తబోయింది. కాని తల్లి పట్టుకుంది. రామమూర్తి ముందుకు వచ్చాడు. శేషమ్మ నోరు తెరచింది ఏదో చెప్పడానికి. కాని ఆవిడ చెప్పేది వినడానికి ఇష్టపడక రఘు బుద్ధిమార్చుకొని "సరే తీసుకువెళ్ళండి" అని పిల్లల్ని వదిలివేశాడు. రామమూర్తి, పిల్లల్ని వాళ్ళు ఏడుస్తున్నా లాగుకుపోయి బండిలో కూర్చోబెట్టాడు సుశీలనుకూడా తొందరచేసి ఎక్కించి తనుకూడా ఎక్కి కూర్చుంది శేషమ్మ. రామమూర్తి మళ్ళీ ఒకమారు "వస్తానోయ్" అని బండివెనకాల నడవసాగాడు. సుశీల కొంగు నోట్లోకి కుక్కుకొని భర్త తనకేసి చూస్తాడేమోనన్న ఆశతో అతనికేసి చూసింది. కాని రఘు ఆమెకేసే చూడక ఇంటికి తాళం వేసుకొని రెండో ప్రక్కగా ఆఫీసుకు వడివడిగా వెళ్ళిపోయాడు.

(ఇంకా వుంది)


అన్నీ అన్నయ్యకే!

"ఎందుకు బాబూ ఏడుస్తున్నావు?"

"రేపు మా అన్నయ్యకి సెలవండి. నాకు లేదు"

"నీ కెందుకివ్వలేదు"

"నన్నింకా బళ్లో వెయ్యలేదండి."



విదేశాలలో

బ్రిటను దేశములో విడాకులబిల్లు చట్టమై అనేక సంవత్సరా లయింది. కాని ఇప్పటికీ వివాహాలకు సంబంధించిన సమస్యల ముమ్మరముతో ఆ దేశము కొట్టుకొనిపోతున్నది.

1953-వ సంవత్సరములో బ్రిటను దేశములో 32,746 విడాకులను కోర్టుద్వారా డిక్రీ చేయవలసివచ్చినది. ఆ సంవత్సరంలో ప్రతిదినమూ సగటున 90 వివాహాలనుగురించి తీర్పు చేసి, విడాకులను ఇప్పించవలసి జరుగుతూ ఉండేదన్నమాట. "ఈవిషాద సంఘటనలకు దారితీసిన కారణాలు ఏవై వుంటాయి? వాటిని చక్కబరచి జీవితాలను సౌఖ్యవంతముగాను ఆనందకరముగాను చేయటానికి సాధ్యమా? ఏవిధానము అవలంబించతగినది?" అని అనుభవజ్ఞుడైన ఒక మ్యాజిస్ట్రేట్ కొన్ని అరు సంభాష్మి ప్రశ్నిస్తున్నారు.

వివాహితులలో చాలామంది తమ జీవితాలు అంతవరకూ సౌఖ్యవంతముగా వున్నప్పటికీ, ఏనాడో ఒకనాడు వివాహ విచ్ఛేదను చేసుకొని తమ సహచరులను విడనాడవచ్చునన్న భావముతోనే - విడాకులు అతి సామాన్యమైన విషయముగా పరిగణిస్తున్నట్లు ఆయన తెల్పారు.

జీవితాలలో విషమపరిస్థితులు ఏర్పడినప్పుడు, వివాహాలను రద్దుచేసుకోవటమే ఉత్తమము. కాని సర్దుబాట్లవల్ల చక్కబడే పరిస్థితులు కొన్ని ఉంటాయి. వాటిని అర్థముచేసుకొని చిక్కులను విడదీసుకొంటే విడాకులు పొందేవారిసంఖ్య తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

వైవాహిక సమస్యలు

ప్రతి సంవత్సరమూ స్త్రీ పురుషులు వేలకువేలుగా డైవోర్సు కోర్టులముందు హజారుచేస్తూ ఉంటారు. వీరందరూ తమ జీవిత పర్యంతమూ ప్రేమించుకొంటామని, వివాహ వేదిక ఎదుట ప్రమాణాలు చేసిన వారే. వారి సుఖస్వప్నాలను భగ్నపరచి, జీవితమాధుర్యాన్ని వెగటుపరచే సమస్యలు ఎటువంటివి?

విడాకులు ఇచ్చిన దంపతుల లెక్కలను పరిశీలించి చూసినట్లయితే వైవాహిక జీవితములో ప్రమాదకరమైనకాలము మొదటి 7 సంవత్సరాల కాలమని తేలినది. ఈ కాలములోనే వివాహవిచ్ఛేదాలు అతిగా జరుగుతాయి. ఈ 7 సంవత్సరముల కాలము జాగ్రత్తపడినట్లయితే, వైవాహికజీవితములో మిగతా భాగము ఏ విధమయిన ఒడుదుడుకులూ లేకుండా — నిరాటంకముగా - ఆనందకరముగా సాగిపోతుందన్న అర్థముకాదు; మొదటి 7 సంవత్సరాలకాలము గడువ గలిగినట్లయితే, వైవాహిక జీవితాలలోని అవాంతరాలకు బలికాకుండా, ఎదుర్కొనగలశక్తిని సంపాదించుకొనగలుగుతారు. అనేకములో వివాహ విచ్ఛేదాలకు నాలుగు కారణాలు సర్వసాధారణమైనవిగా భావింపబడ్డాయి. వీటిని దుర్భరమైన కారణాలుగా దంపతులు భావిస్తారు. మొదటిది తమమధ్య ప్రేమ, ఆకర్షణ నశించిపోయినవన్న భావము కలగటము. వాస్తవముగా చూసినట్లయితే పైపై వ్యామోహము తగ్గిపోవటానికి మొదలు పెట్టిందన్నమాట. పైపై వ్యామోహము తగ్గగానే దేవతలతోలూకు స్వప్నసుందరీ, సభ్యతా చతురసంభాషణా, సౌందర్యానికి వెనుదీయని ఆకర్షణీయమైన యువకుడూ తిరోహితులు కావటమూ, సర్వసామాన్యమైన యువతీయువకులుగా దంపతులు

ఇల్లిందల సరస్వతీదేవి

మిగిలిపోవటమూ జరుగుతుంది. ఇది బాలు సాధారణమైన విషయము.

రెండవ కారణము ఆర్థికపు సర్దుబాట్లవల్ల కలిగినది. డబ్బు ఎవరిదగ్గర ఉండాలన్న

సమస్యే [illegible]ఉండా దానిని ఏవిధముగా వినియోగపరచవలెనన్నది ప్రధానాంశము. మాసాదాయములో ఎంత నిలవచేయాలి- సెలవులలో వినోద కాలక్షేపము ముఖ్యమా?



నిజం

"ఒకసారి నేనూ నా స్నేహితుడూ, ఒకరి లోపాలు మరొకరికి నిష్కర్షగా చెప్పుకోవాలని నిశ్చయించుకున్నాం?"

"భేష్, ఎలాసాగింది కథ."

"మేమిద్దరం మాట్లాడుకుని రెండేళ్లు కావస్తోంది."

లేక-ఇంటికి కావలసిన వస్తువులను కొనటము ప్రధానమా? డ్రాయింగు రూముకు నీలిరంగు పరదాలు ఉంటే బాగుంటాయా? సోఫా సెట్టు పెనిమిటికి నచ్చినది భార్యకు నచ్చదు. నచ్చినా ధరలదగ్గర పేచీ రానే వస్తుంది. సాధారణముగా పురుషులు స్త్రీల పట్ల తమ ప్రేమను వ్యక్తము చేయటానికి ధనము ఖర్చుచేస్తారు. కనుక ధనవ్యయానికి పురుషుడు వెనుదీస్తాడంటే తనయెడ అతనికి ప్రేమలేదనే నిర్ణయానికి ఆ దేశపు స్త్రీలు వస్తారు. స్త్రీ పురుషు లిద్దరికీ జీవితావసరాలనూ విలువలనూ గురించి ఏకాభిప్రాయము కుదరనట్లయితే, 10 మందిలో 9 మందికి సామరస్యము కలుగదు. వ్యక్తిగతముగా ఎవరి అభిమతాల ననుసరించి వారు నిర్ణయించుకోవటము వైవాహిక జీవితములో సాగదు. ఆర్థిక సమస్యలను భాగస్వాముల వలె భార్యాభర్తలు పరిష్కరించుకోనని కారణముచేత, వైవాహిక జీవితాలు దుర్భరములుగా తోస్తాయి. ఇద్దరూ కలిసి సమిష్టిగా కష్టపడవచ్చుగాని, ఎదటివారు తనసుఖాన్ని దూరము చేస్తున్నారన్న భావము కలిగినప్పుడు నిజమైన ప్రేమకు స్థానము కనబడదు.

మూడవది సంతానము. తలి దండ్రులకు విశ్వాస కుదరని ప్రతిసందర్భములోను అయిష్ట భావావేశాలకు పిల్లలు గురికావటము సహజము. సాధారణముగా దంపతులు తమ వైవాహిక జీవితాలు విఫలము కావటానికి పిల్లలే కారణమని భావిస్తారు. దంపతులలో ఒకరికి సంతానము కలగటమే ఇష్టము ఉండదు. మరొకరికి బిడ్డలపైన ప్రేమ. ఈ భావాంతర మున్నచోట సంతానము కలగటమే తటస్థించినట్లయితే చికాకులు, జగడాలు ముఖము తప్పించటాలు ప్రారంభమవుతాయి.

నాలుగవ కారణము తొలినాటి ఆకర్షణ: స్త్రీ పురుషుల పైపై మెరుగులకు ప్రారంభములో పరస్పరాకర్షణలు కలుగుతాయి. ఇవి తగ్గగానే స్వభావాలలోని నిజస్వరూపాలు బయటపడి విడాకులకు దారి తీస్తాయి.

విడాకులకు కారణాలు పరస్పరమూ సర్దుబాటూ సమైక్యభావమూ లేకపోవటము వల్లనే కలుగుతాయి. డైవోర్సు కోర్టులలో వివరింపబడే హేతువులూ, వివాహాలను విఫలము చేయగలిగిన కారణాలూ వాస్తవముగా సర్దుబాటుకు అనువైనవే.

అనేక సందర్భాలలో స్త్రీ పురుషులలో కేవలము ఆకర్షణ నశించినందువల్లనే విడాకులు తటస్థించుతున్నాయి. 'ఆయనకు నామీద ప్రేమ లేదు' అని అనేకమంది స్త్రీలు అనుకొంటూ ఉంటారు. ప్రేమ అభిమానము ఇతర విషయాలకంటె ప్రధానమైనవని కొందరనుకొంటారు. అటువంటివారు భౌతిక సుఖాలను లక్ష్యముచేయరు. పెద్ద కారు ఇచ్చినా, ధనమిచ్చినా, విలగల దుస్తులు ఇచ్చినా ఆ స్త్రీలు దైన్యములో వాడిపోయిన ముఖాలతో ఉంటారు. ఇటువంటి వారికి ఎదటి వారిలో ప్రేమాభిమానాలు కనబడకపోయినట్లయితే జీవితాలలో వైరాగ్యము కలుగుతుందని మనస్తత్వ వైద్యులు అభిప్రాయపడ్డారు.

అనుభవజ్ఞులు చాలామంది యువతీయువకుల వైవాహికజీవితాలు భగ్నము కావటానికి అత్తమామలు కారకులని నిర్ణయించారు. రెండువపక్షాల తలిదండ్రులూ దంపతులలో కలతలకు కారకులని వారి నమ్మకము. తల్లి అదుపాజ్ఞలలో ఉన్న కొడుకు ఆతల్లినే ఆదర్శ స్త్రీగా ఆరాధిస్తాడు కనుక వైవాహిక జీవితములో సుఖించలేడని వారి అభిప్రాయం. తనతల్లిలో తాను ఆరాధించేగుణాలు తన భార్యలో లేవన్న విచారము పురుషుడికి కలుగుతుంది. ఈ విధముగానే తండ్రి అదుపాజ్ఞలలో పెరిగి, ఆయన గుణాలను ఆరాధించే కూతురు, తండ్రినీ భర్తనూ ప్రతివిషయములో పోల్చిచూస్తుంది. ఈ వ్యత్యాసాలు యువతీయువకుల వైవాహిక జీవితాలలో విషబీజాలు నాటుతున్నాయని తేలింది.

విడాకులను తీసుకొన్నవారిలో మూటికి రెండువంతుల మద్యపాన సమస్యలచే బాధపడ్డవారని లెక్కలవల్ల తేలినది. 'ఆయన మద్యపానానికి అలవాటుపడకముందు అంతా బాగానే ఉండేది' అని భార్యలు చేసే ఫిర్యాదు సర్వసామాన్యముగా వినబడుతూనే ఉంటుంది. కాని మ్యారేజి కౌన్సిలర్లకు 'అంతా బాగానే ఉండేది' అన్న మాటలు అన్ని సందర్భాలలోనూ సత్యమైనవిగా కనబడవు. 'కనుకనే మద్యపానాసక్తత కలిగినది' అని ఊహిస్తారు.

చాలా కేసులలో విడాకులు కష్టాలను తొలగించలేవు. కష్టాలు విడిగా ఉన్న వ్యక్తులను బాధించినంతగా వివాహితులను బాధించవు. ఎవరయినా స్వభావగుణాలను పరిత్యజించలేరుగా! ఆకారణంచేత ఎవరి దురదృష్టము వారివెంబడే ఉంటుంది. ఎన్ని వివాహాలు చేసుకొన్నా వంటబట్టిన గుణాల ఫలితముగా అన్నీ విఫలమవుతూనే ఉంటాయి. ద్వితీయ తృతీయ వివాహాలు సఫలీకృతము కావటము అరుదు. అది ప్రత్యేకముగా పేర్కొనతగినదని రికార్డుల వల్ల తేలింది. తరువాత చేసుకొన్న వివాహాలు ప్రథమ వివాహమంతట స్థిరమైనవి కావని లెక్కలవల్ల తేలినది. వివాహాలు చేసుకొంటూ ఉన్నకొద్దీ విడాకులకుకూడా అలవాటు పడతారని నిర్ణయింపబడ్డది.

విడాకులలో అంతర్గతముగా ఉన్న కారణాలు స్వభావాలలోనివే. ఇవి వంశపారంపర్యము సంక్రమించే అవకాశం ఉన్నది, విడాకులను తీసుకొన్న చాలామంది తలిదండ్రులు, బిడ్డల అభ్యుదయాన్ని కాంక్షించే తాము విడిపోతున్నామనుకొంటారు. కాని తలిదండ్రులు అనుసరించిన మార్గము బిడ్డల దృష్టిపథములోనే ఉంటుందన్న విషయాన్ని గ్రహించరు. రికార్డుల వల్ల అంచనా వేయబడినదేమనగా, విడాకులను పొందినవారి సంతానములో, తమ వైవాహిక సమస్యలను విడాకులవల్లనే పరిష్కరించుకొన్నవారి సంఖ్య ఎక్కువ అని తేలింది. విడాకులను పొందనివారి సంతానములో వివాహవిచ్ఛేదము చేసుకొన్నవారిసంఖ్య పై సంఖ్యకంటె తక్కువదని అంచనా వేయబడ్డది.


సంతానాభివృద్ధికి విడాకులు వేరుపురుగులని బ్రిటన్ దేశములో అనుభవజ్ఞులు నిర్ణయించారు. తలిదండ్రులను భక్తిగౌరవాలతో ప్రేమతో ఆరాధించాలని బిడ్డలు కోరుకుంటారు. తల్లిదండ్రులు తమ ప్రేమనూ వాత్సల్యాన్నీ కేంద్రీకృతముచేయటానికి

★ విదేశాలలో వైవాహిక సమస్యలు ★

సంతానము కావలెననుకుంటారు తలిదండ్రులు లేనిదే బిడ్డలు సరిగా పెరగలేరు. బిడ్డలను వదలి తల్లిదండ్రులు ఉండలేరు. ఇవి సామాన్యపరిస్థితులు. కాని-బిడ్డలు, తలిదండ్రు లిద్దరిలో ఏ ఒక్కరు తమను ఏవగించుకొంటారనుకొన్నా, తమయెడ వారికి ప్రేమలేదని గ్రహించినా, వారి అభివృద్ధికి నష్టము కలుగుతుంది. ఐకమత్యమూ సన్నిహితత్వమూ గల తలిదండ్రులు బిడ్డల కాదర్శప్రాయముగా ఉంటారు. కాని విడాకులను పొందినవారి సంతానము తలిదండ్రులను ఆదర్శముగా భావించటానికి అవకాశము లేదు. అంగవైకల్యముకంటె మనోవైకల్యము చెడ్డది. విడాకులను తీసుకొన్న వారి సంతానములో మనోవైకల్యము కలవారు అధిక సంఖ్యలో ఉన్నట్లు లెక్కలవల్ల పరిగణింపబడ్డది.

విడాకులు శస్త్రచికిత్సవంటివి. వ్యాధులు రాకుండా కాపాడుకోవటానికి తగిన జాగ్రత్తలను తీసుకోవటమూ, వచ్చిన తరువాత మందులతో తగ్గించుకోవటానికి ప్రయత్నించటమూ, అంతకు మించిపోయినవాటికి గతిలేక శస్త్రచికిత్సను ప్రయోగించటమూ అనుసరించవలసినమార్గాలు. ఆ విధముగానే విడాకులు గత్యంతరము లేక అనుసరించే మార్గమేనని దంపతులు గ్రహించినట్లయితే విడాకులు తీసుకొన్న వారిసంఖ్య తగ్గిపోయే మార్గమున్నది. దాంపత్య విచ్ఛేదము వంశాభివృద్ధికి అరిష్టసూచకము కనుక న్యాయాధిపతులు, మనస్తత్వశాస్త్రజ్ఞులు కుటుంబ సలహాదారులు, అనుభవజ్ఞులు విడాకులు తీసుకొన్న వారి సంఖ్యను తగ్గించటానికి వైవాహికజీవితాలను ఆరోగ్యకరమైన పరిస్థితుల్లో ఉంచటమూ, వాటిని పుష్టివంతముగా చేయటానికి ప్రయత్నించటమూ, చేయవలసిన పనులని నిర్ణయించారు. వాటి పునాదులను దృఢపర్చవలెనని నిశ్చయించారు. ఒక న్యాయాధిపతి 'విడాకులంత సులభమైనవని భావిస్తావా?' అని మ్యారేజి కౌన్సిలరును ప్రశ్నించగా ఆయన 'విడాకులకంటె వివాహాలే సులభమైనవని నా ఉద్దేశ్యము' అన్నాడట.

వివాహితులకు సలహాలనిచ్చే సంస్థలలో



కొన్ని ప్రముఖస్థానము కలిగి ఉన్నాయి 'ఏ వ్యక్తి అయినా వివాహము చేసుకోవచ్చు. కాని కొక పరీక్షా యోగ్యత ప్రత్యేకముగా నిర్ణయింపబడి లేవాయెను! యువతీ యువకులు సమ్మతిస్తే చాలుకదా! మిగతా యోగ్యతలు ఎన్ని ఉన్నప్పటికీ నిలకడ అనేది లేకపోతే అది యోగ్యతక్రింద లెక్కింపతగినదే. ఒక నెల అయినా నిలకడగా ఒక ఉద్యోగము చేయలేనివారు కూడా వివాహాలు చేసుకొని స్థిరచిత్తము లేకుండా వైవాహిక జీవితాలను గడుపుతారు. అటువంటివారివల్లనే ఈ ప్రమాదాలు సంభవిస్తున్నా'యని ఒక సంస్థ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది

వివాహాల వైఫల్యాన్ని నిర్దుష్టముగా పరిశోధించిన ఒక న్యాయాధిపతి మానసికారోగ్యము తక్కువగా ఉన్నవారిలోను, పరిణతి చెందని స్వభావముగలవారిలోనూ విడాకు లివ్వటము ఎక్కువగా జరుగుతున్నదని నిశ్చయించారు. స్త్రీ పురుషులు అనుభవిద్దామనుకొన్న స్వర్గసుఖాలను వైవాహిక జీవితాలలో పొందలేకపోతున్నారు. కష్టాలనుండి తప్పుకోవటానికి వివాహబంధనాలనుండి విముక్తి పొందటమే మార్గమని భావిస్తున్నారు' అని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఒకటి రెండు తరాలక్రిందట కూడా వివాహము చేసుకోదలచిన స్త్రీ పురుషులు ఒక సంవత్సరమో ఆరు నెలలో వివాహానికి ముందర బాగా ఆలోచించుకొని, ఒక నిర్ణయానికి వచ్చేవారు. యువతీ యువకుల పరిచయము వివాహముగా మారేముందు, చక్కగా ఆలోచించుకోవటము, స్వభావ గుణాలను పరస్పరమూ గ్రహించుకొని అర్థము చేసుకోవటమూ జరిగేది. కాని ఇప్పుడు ప్రథానాలు జరగటానికి కూడా తగిన అవకాశము కొన్ని వివాహాలకు ఉండటము లేదు. యువతీ యువకులకు పరిచయ కాలము ఎంత అల్పమయితే, ప్రథానానికి వివాహానికి మధ్యకాలము ఎంత వ్యవధి తక్కువయితే, విడాకులు తీసుకోటానికి అన్ని అవకాశాలు ఉన్నాయని తేలినది.


వివాహాలకు సంబంధించిన సలహాదారులు న్యాయాధిపతులు వైవాహిక జీవితాలలోని వైరాశ్యాన్నీ కాలుష్యాన్నీ నిర్మూలించటము ప్రథమ కర్తవ్యమని నిర్ణయించారు. వివాహాలకు ముందు యువతీ యువకులకు దానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని కలిగించటము ముఖ్యమని అభిప్రాయపడ్డారు. 'వివాహానికి ముందు కనీసము ఒక పర్యాయమయినా స్త్రీ పురుషుల సలహా తీసుకోవటము మంచిది' అని అమెరికా దేశములోని మ్యారేజి కౌన్సిలర్లలో ప్రముఖుడయిన డాక్టరు అబ్రహామ్‌స్టోను తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు. 'వైద్యులు అటువంటి సలహాల నివ్వటానికి సిద్ధముగా ఉండాలి యువతీ యువకులకు వివాహములోని నిజమైన విలువలను బోధించాలి వారికి వెన్నెలవిహారాల ఆనందమూ, పూపొదరింట్లలో ఏకాంత సమావేశాలలోని మాధుర్యమూ మాత్రమే కాకుండా వైవాహిక జీవితములోనిపవిత్రాశయాలను, గృహస్థాశ్రమ బాధ్యతలను గురించీ బోధించటము అవసరమని తన అనుభవమువల్ల తెలుస్తున్నదని' అన్నారు

వైవాహిక సలహాసంఘాలు (Marriage guidance councils) విరివిగా స్థాపింపబడి బ్రిటనులో పనిచేస్తున్నాయి. అనేక క్రైస్తవ దేవాలయాలు వివాహాలకు పూర్వం సలహాల నిస్తున్నాయి అధిక సంఖ్యలో వైద్యులు సలహాదారులుగా శిక్షణ పొందుతున్నారు ఇది అభ్యుదయసూచకమే. ఐనప్పటికీ ప్రజలలో వివాహ దృక్పథంపట్ల ముఖ్యమైన మార్పులు రావలసి ఉన్నాయి అసలు 'వివాహమంటే ఏమిటి, దాని ప్రయోజనము ఏమిటి?' మొదలైన అంశాలను ప్రచారము చెయ్యవలసిఉన్నది. వివాహము యువతీ యువకులు భావించినంత సుఖవంతమైనది కాబోదు. కంట్లో నిరుమిల్లుగొలిపే దేవలోకము సంప్రాప్తింపగలదని భయపడవద్దు.

"వివాహమంటే స్త్రీపురుషుల శారీరక సుఖములకొరకేర్పడినది కాదు ఇదమూ ఏకాంతలవారు యథేచ్ఛగా ప్రవర్తించటానికి వివాహము అనువైన సంస్థకాదు." అనేక సమావేశాలు చర్చలూ జరిగిన తరువాత ఈపై నిర్ణయానికి రావటము జరిగింది. ఈపై అంశాలను ప్రజలలో ప్రచారము చేయవలసి ఉన్నదని తీర్మానించుకొన్నారు.

'అయితే ఈపై వసతులవల్లనూ నిర్ణయాలవల్లనూ వైవాహిక జీవితములో ఇంతవరకూ స్త్రీ పురుషులు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యము అరికట్టబడవచ్చు. మానవుడు నిర్మించుకొన్న నియమాలు సూత్రాలు అతడినే బంధిస్తాయన్న సత్యము ఇక్కడకూడా ఋజువు కావచ్చు. అయినా అభ్యుదయమార్గాన్ని అనుసరించటమే వాంఛనీయము'

మానవసమాజము నదివంటిది. నదీజలము అప్పుడప్పుడు మురికిగా బురదగా మార్పు చెందుతుంది. దానిని తేటపరచటానికి అనువయిన మార్గాలను మానవుడు అన్వేషిస్తూనే ఉంటాడు. ★



పరిచర్య

కవిరావు

ప్రొద్దుపొడుపున నీవు
ముద్దు లొలికించుతూ
బంగారు బంతివలె
పరుగెత్తుకొచ్చావు
    కావిరంగుల వలువ
    కట్టి పంపిన దెవరు?

తల్లి నిను జూడగనె
ఉల్ల ముప్పొంగగా
ఆరుబయటకు పోయి
ఆడుకొంటున్నావు!
    కవ్వించి లోలోన
    నవ్వింతు రెవరురా?

మెల్లగా నీ వమ్మ
మెడ కౌగలించుకొని
ఆమె చెవిలో యేమి
అర్థించుచున్నావు?
    నిండు చందురు జూచి
    పండు కోరితివేమొ!

తల్లి యొడిలో నీవు
తల దూర్చి నిదురింప
మిన్ను తన వేవేల
కనుల నిను గనుచుండు!

గాలి నీ అందాల
కాలిగజ్జెల రవళి
తనివితీరక మోసు
కొనిపోవుచున్నాడు.

ఉదయ కాంతులతోడ
నిదుర గన్నియలు నిను
కలలోని తీయలో
కాలు చూపించెదరు.

ప్రకృతియంతయు నీకు
పరిచర్య చేయ నీ
మాత చెంగటను, భూ
మాత చల్లని యొడిని
    వరుసగా వేయేండ్లు,
    వర్ధిల్లు నా తండ్రి!

[ఆధారము : టాగోర్]

బాలసాహితి సీరియల్ ......

మార్టిన్ రాట్లర్

మూలం: ఆర్. ఎమ్. బాలన్‌టైన్

15

బార్కీ కేక వెయ్యడానికి కారణభూతమైన దృశ్యం ఏమిటి ?

పదహారడుగుల పొడవు, మనిషిఅంతలావూ ఉన్న ఒక సర్పం. కంఠంవద్ద మనిషికి మూడు రెట్లు లావున్నది. అయితే ఇది ఆ జాతి సర్పాల్లోకల్లా చిన్నది. పెద్దవైతే నలభై అడుగులదాకా ఉంటాయి. కాని అసలు ఏ పామునూ చూసి ఎరగని మన మిత్రులకు ఇదే అద్భుతంగా కనబడింది.

"ఓ. అది అనకొండా జాతి సర్పమై ఉంటుంది. అవునా ?" అని మార్టిన్ వృద్ధ వ్యాపారస్థుణ్ణి అడిగాడు.

"అవును. అది చచ్చిపోయింది," అని క్లుప్తంగా జవాబిచ్చాడు వృద్ధుడు.

"అరె, దాని నోట్లో కొమ్ములున్నాయేమిటి ? పదపద, పోయి చూద్దాం. పడవ ఒడ్డు పట్టించు" అన్నాడు బార్కీ.

పడవ ఒడ్డుకు రాగానే ముగ్గురూ సర్పాన్ని సమీపించారు. ఆ సర్పం ఒక ఎద్దును ఎద్దు పళంగానే మింగేసెయ్యబోయి కొమ్ములు మింగలేకపోవడంవల్ల ఆ విధంగా కొమ్ములు బయటికి కనిపిస్తున్నాయని వారు గ్రహించారు.

వృద్ధుణ్ని అనేక రకాలుగా బోలెడుసేపు ప్రశ్నించి ప్రశ్నించి అనకొండా సర్పాలకు సంబంధించిన భోగట్టాను మార్టిన్ సేకరించాడు.

ఆ సర్పాలు గుర్రాల్ని, ఎద్దుల్ని ఆపళంగానే మింగేస్తాయట. సద్దు చెయ్యకుండా, కదలకుండా సర్పం పడుకుని ఉంటుంది. అభాగ్యజంతువేదైనా చూసుకోకుండా దగ్గరికి వచ్చిందో, వెంటనే సర్పం దానిమీదికి దూకి దాన్ని చుట్టుకుని, నొక్కి చంపివేస్తుంది. తరవాత ఆ కళేబరాన్ని ముద్ద ముద్ద చేస్తుంది. అలా వికృతంగా తయారైన కళేబరాన్ని చుట్టూ నాలికతో నాకి ఒక రకమైన లాలా జలంతో కప్పివేస్తుంది. అప్పుడు నెమ్మదిగా తోక దగ్గిర మొదలెట్టి కళేబరాన్ని మింగుతుంది. అంతా మింగిన తరవాత మత్తుగా కొన్ని వారాలపాటు పడుకుని ఉంటుంది. ఆహారం జీర్ణం కాగానే మత్తు వదలి మళ్ళీ లేచి మరో జంతువుకోసం పొంచి ఉంటుంది. గుర్రాల్లాంటివైతే ఏ అడ్డమూ లేకుండా సరాసరి నోట్లోకి వెళ్ళిపోతాయి. కాని ఆవులు, ఎద్దులూ మొదలైనవైతే కొమ్ము లడ్డం వస్తాయి. ఆ కొమ్ములు వాటంతటవి నోటినుండి కింద పడిపోయేదాకా ఆ సర్పాలు అలాగే తిరుగుతాయి.

ఆ సర్పాన్ని అలా పరీక్షిస్తుండగా వారి వెనకాల పొదల్లో ఏదో కదిలిన చప్పుడైంది. వెనక్కి తిరిగి చూడగా పొదల్లో మరొక అనకొండాసర్పం

అనువాదం: నండూరి రామమోహనరావు

వారిపైకి దూకడానికి సిద్ధంగా ఉంది. అది చూసి భయపడి వారు క్షణంలో పరిగెత్తి పడవలో పడ్డారు.

అలా చాలావారాలపాటు మన మిత్రులు అమెజాన్ ఎగువకు ప్రయాణం సాగించారు. ఒక్కొక్కసారి కోకోతోటలు కనిపిస్తే అక్కడ ఆగి తాము తెచ్చిన సరుకును తోట యజమానులకు అమ్మజూపేవారు. ఒకసారి వారు ఒకతోటలో చాల రోజులు ఆగి విశ్రాంతి తీసుకున్నారు. ఆ తోటయజమానికి ఒక

పెద్ద సరస్సు ఉన్నది. ఆ సరస్సులో ఎలిగేటర్ మొసళ్లు చాలా నివసిస్తున్నాయి. నీగ్రో బానిసలు వాటిని వేటాడడం చూసి వారు అమితంగా ఆనందించారు. నీగ్రోలు నిర్భయంగా నీళ్లలోకి దిగి పొడుగాటి ముల్లుకర్రలతో మొసళ్లను పైకి రెచ్చగొడతారు. అవి మీదకు రాబోతుండగా ఉచ్చుతాళ్లు విసిరి వాటి మెడలకు తగిలించి బంధించి ఒడ్డుకు లాక్కుపోతారు. దీనికి ఎంతో సాహసం, నేర్పు, తెలివితేటలు కావాలి. నీగ్రో బానిసలు సునాయాసంగా మొసళ్ళను అలా వేటాడ్డం చూసి మార్టిన్, బార్నీ చకితులయ్యారు.

అక్కడినుంచి బయలుదేరి ముగ్గురూ తిరిగి అమెజాన్ నదిలో ప్రయాణం సాగించారు. త్రోవలో అనేక కష్టాలను ఎదుర్కొని, అన్నీ గడిచి సాగిపోయారు.

ఒకచోట నదికి రెండువైపులా బండరాళ్ళు వరసగా పేర్చినట్టు కనిపించాయి. ఒక రోజున ఆ తీరంలో ఆగి అక్కడ విశ్రాంతి తీసుకుందామనుకున్నారు. పడవ ఒడ్డు పట్టించారు. ఆ సాయంత్రం ప్రశాంతంగా ఉన్నది. మామూలుగా ఆవేళప్పుడు ఝుమ్మని ముసిరే పెద్దపెద్ద దోమలు కూడా ఆ రోజున మాయమైనాయి. ఒకటి రెండు కోతులు ఈ కొత్తవారెవరా అని తొంగి చూసి పారిపోయాయి. వంట వండుకుని భోజనాలు ముగించారు.

"దోమలు రాకుండా ఉంటే ఈ రాత్రికి ఇక్కడ హాయిగా పడుకుని సేద దీర్చుకోవచ్చును," అన్నాడు మార్టిన్.

"ఏమో నాకు అనుమానంగానే ఉన్నది. ఈ ప్రశాంతత, సాయంకాలపు సౌందర్యం చూస్తుంటే ఇదంతా నిజమా కలా అనిపిస్తోంది. ఈ విచిత్ర దేశంలో ఏం జరిగినా ఆశ్చర్యపడనక్కరలేదు. అదుగో అటు చూడు. ఆ రాతిమీద నుంచున్నది మనిషో, జంతువో, భూతమో తెలియకపోవడం విచిత్రం అవునంటావా, కాదంటావా?" అని వేలుపెట్టి చూపిస్తూ అడిగాడు బార్నీ.

మార్టిన్ అటువైపు చూసి, సంభ్రమంతో లేచి నుంచున్నాడు.


"అరె, అది దెయ్యంకాదు, జంతువు కాదు, మనిషే. ఇండియన్ జాతివాడు. అబ్బ, ఎంత అన

హ్యాంగా ఉన్నాడో. వాడెవడో, ఏం చేస్తున్నాడో తెలుసునా నీకు ?" అని మార్టిన్ వృద్ధ వ్యాపారస్థుణ్ణి అడిగాడు.

"తెలియదు"అని ముక్తసరిగా చెప్పే వృద్ధుడు కంగారుపడుతూ అటే చూడసాగాడు.

దూరంగా రాతిమీద నిలబడి వీరికేసి చూస్తున్న మనిషి రెడ్ ఇండియన్ జాతివాడే. గోచీ

(55- వ పేజీ చూడండి)



మచ్చుకి ఒక చిన్న ప్రశ్న అడుగుతాను, చెప్పండి. ఒక చీర ఒక గంటలో ఆరుతుంది. పది చీరలూ ఎన్ని గంటల్లో ఆరుతాయి? చాలామంది 'పదిగంటలు' అని వెంటనే జవాబు చెప్పేస్తారు. లెక్కకయితే జవాబు చెప్పేరుగాని దాని వెనక ఉన్న ప్రాథమిక ప్రకృతి సూత్రాన్ని మరచిపోయారు. పది చీరలూ ఒక గంటలోనే ఆరుతాయి.

మరో లెక్క యిస్తాను, గబుక్కుని చెప్పాలి మరి.

నా వయస్సూ మా అన్నయ్య వయస్సూ కలిపి ప్రస్తుతం 50 ఏళ్లు. 10 ఏళ్ళక్రితం మా యిద్దరి వయస్సుల మొత్తమెంత?

40 ఏళ్ళు అంటారు మీరు. కాని అదీ తప్పే. 10 ఏళ్ళక్రితం మా యిద్దరి వయస్సూ నాది పదీ మా అన్నయ్యది పదీ 20 ఏళ్ళు తగ్గుతాయి. అంటే జవాబు 30 ఏళ్ళు. మరో సమస్య యిస్తాను చూద్దాం ఎంతమటుకు చెప్పగలరో!

చలపతి అనే కుర్రాడికి సిగరెట్లంటే చెప్పలేనంత ప్రేమ. ఇంట్లో డబ్బు లియ్యరూ, ఎలా మరి? బాగా ఆలోచించాడు. సిగరెట్టు పీకలు ఏరడంలో వాడికేం నామోషీ కనిపించలేదు. పది సిగరెట్టు పీకలు ఏరి, ఒక మామూలు సిగరెట్టు చేసేవాడు. అలా ఒకసారి బోలెడన్ని సిగరెట్టు పీకలు ఏరి ఏరి పది సిగరెట్లు చేసుకున్నాడు.

కష్టపడి చేసుకున్నాడా మరి, ఒక్కొక్క సిగరెట్టు గంటసేపు కాలుస్తాడు.

అవసరాల రామకృష్ణరావు

అయితే ఆ పదిసిగరెట్లూ ఎన్ని గంటల్లో కాలుస్తాడూ?

ఇలా ఒకసారి అడుగుతే అందరూ పదిగంటలని జవాబు చెప్పేరుట.

పది సిగరెట్లలోనూ పదిముక్కలు మిగలవా, ఆ పదీ కలిపి ఒక సిగరెట్టవదా, అదీ గంటసేపు కాల్చడా, అలా అయితే పదకొండు గంటలు కావా అని అడిగేడుట ఓ బుద్ధిమంతుడు.

అందులో మాత్రం ముక్క మిగలదా, అది మాత్రం కాల్చడా అన్నాట్ట మరో మహామహుడు. పీకలు కాల్చడుగా? అని దానికి జవాబు చెప్పేరుట.

కాబట్టి ఆన్సరెంతా? పదకొండు గంటలు.

ఏమిటీ సమస్యలు? ఎందుకివీ??

ఏదయినా విషయం సమస్యగా మారిపోయినపుడే దానిమీద మన మనస్సుకి బలమైన ఆకర్షణ కలుగుతుంది. గుప్పెట మూసి 'ఇందులో ఏముందో చెప్పుకోండి' అన్నప్పుడే పిల్లలూ, పెద్దలూ తహతహ లాడుతారు. నిత్యం జరిగే సంఘటనలయినా అక్కడక్కడ తెరమరుగు చేసి చమత్కారంగా చెప్పగలుగుతేనే రచయితకు పది కాలాలపాటు పదిమందిలో కీర్తి.

వాల్మీకి వెర్రివాడై సీతమ్మవారిని అల్లంతదూరంలో లంకలో పెట్టేడా? సీతను తిరిగి తెచ్చే సమస్య రాముడి దొక్కడిదేనా? చదివే ప్రతి పాఠకుడిదీను.

సమస్యల్ని సాధించడమే రహస్యాల్ని ఛేదించడమే-లలితకళలూ, శాస్త్రాలూ అభివృద్ధిలోకి రావడానికి కారణం కాదా?


పక్క పేజీలో ఒక సమస్యవున్నది. దాన్ని పరిష్కరించండి చూద్దాం.

రాజు, రాణి, యువరాజు మేడమీంచి దిగడం ఎలాగ?

అనగనగ ఓరాజు ఉన్నాడు. రాజంటూ ఉన్నాక రాణి తప్పదుగదా! వీళ్ళిద్దరూ ఉన్నాక ఒక యువరాజు ఉండడం సాధారణంగా సహజం. సరే రాజుకు శత్రురాజులు ఎలాగూ ఉంటారు. అలాంటి ఒక దుర్మార్గుడైన శత్రురాజు రాజునీ, రాణినీ, యువరాజునీ మాయోపాయంచేత బంధించి ఒక మేడమీద ఖైదుచేసి ఉంచాడు. వీళ్ళని బంధించిఉన్న గదినుండి దిగి పారిపోవాలంటే ఒకే ఒక మార్గం. ఒకవైపు తెరచిఉన్న పెద్ద కిటికీ. కాని ఏం లాభం? ఆ కిటికీ ఎత్తు 100 అడుగులు!

వీళ్ళని రేపు ఉరితీస్తారనగా రాజమంత్రి ఎవరూ లేని నిర్జన ప్రదేశంలో ఉన్న మేడమీదకి సరిగ్గా కిటికీ దగ్గరగా ఒక కప్పీ దానికి నూరు అడుగుల తాడూ, రెండు ప్రక్కలా కూర్చుని దిగడానికి రెండు బుట్టలూ ఎలాగో కష్టపడి అమర్చేడు. అంటే ఒక బుట్ట సరిగ్గా కిటికీ దగ్గిరకి వస్తే రెండవది నేల మీద ఉంటుందన్నమాట.

అవాళ సాయంకాలం రాజూ, రాణీ యువరాజూ తమ కష్టాలు తలుచుకుని విచారిస్తూండగా కిటికీ లోనికి రివ్వున ఒకబాణం, దానితోక చీటీవచ్చి పడ్డాయి. రాజు ఆత్రుతతో ఆచీటీ తీసిచూస్తే అందులో ఇలా ఉంది: "ప్రభూ, జరిగినదానికి విచారించకండి. మీరు దిగి పారిపోడానికి నేనో మార్గం సూచిస్తున్నాను. జాగ్రత్తగా గమనించండి. కిటికీకి ఎదురుగా ఒక కప్పీగుండా తాడు తీసి రెండుబుట్టలు అమ



★ సమస్యల తోరణం ★

ర్చాను. తమరు, రాణీసాహెబా వారూ, చిరంజీవి యువరాజా వారూ, ఆ బుట్టలు ఎక్కి జాగ్రత్తగా దిగిరావాలి. ఒక్కొక్కరు ఒక్కొక్క బుట్టమాత్రమే ఎక్కాలి. అంతేకాదు. పైనున్నది కప్పీ అన్న సంగతి మరిచిపోకూడదు. ఈ బుట్టకీ ఆబుట్టకీ బరువులో 15 పౌన్ల కన్న ఎక్కువ తేడా ఉండకూడదు. ఉంటే ఏమౌతుంది? బరువైన బుట్ట 'ధభీ' మనిఒక్కసారి అంత ఎత్తునుంచీ నేలని పడిపోతుంది. 'మరి మా బరువులు మీకు తెలీదే?' అని వెనుదీయకండి. ఆభారం నాకు వదిలిపెట్టండి. ఈ మధ్య ఆరోగ్య శాఖా మంత్రి గుర్తించిన మీబరువులు నాకుగుర్తే. ఏలినవారి బరువు 195 పౌన్లు. అమ్మాజీ సర్కారు బరువు 10^5 పౌన్లు, రాజా యువరాజా కుమార రాజా వారు 90 పౌన్లు. అంతేకాదు మీ మేడమీద ఖైదీల వీపుకి కట్టే ఇనపరాయి ఒకటిఉండాలిచూడండి. దాని బరువు, (వెనక అలాంటి రాళ్లు ఈరాజ్యం పాలించే మీతాతగారు చేయించారు, నాకు జ్ఞాపకమే) 75 పౌన్లు.జాగ్రత్తగా ఆలోచించి మీరు ముగ్గురూ దిగిరావాలి.'—త్వరలో మీ దర్శనం కోరే సేవకుడు—చమత్కారిగ్రావాలు.

ప్రాణదానం కన్న పెద్ద ఉపకారం ఏముందీ? రాజకుటుంబం మంత్రి చమత్కారికి మనసులోనే కృతజ్ఞత తెలిపారు.

సరిగ్గా జ్ఞాపకముంచుకోండి.

రాజు బరువు	195 పౌన్లు
రాణి	105 పౌన్లు
యువరాజు	90 పౌన్లు
రాయి	75 పౌన్లు

వీరు ముగ్గురూ సురక్షితంగా క్రిందకి దిగగలరా? రెండు బుట్టలకీ తేడా 15 పౌన్లు విధిగా ఉండాలని మరిచిపోకూడదు. ఒకడు దిగిన వెంటనే ఆ బుట్టలోంచి లేచి పైకిపోతే రెండో బుట్ట ధమ్మని క్రిందపడి ఆ మనిషి ప్రాణం పైకి లేచి పోతుందని మరచిపోకూడదు. ఎవరో యిద్దరు దిగిపారిపోతే లాభం లేదు. బరువైన రాజు కోపంతో ఆ రాయి ఎవరిమీదేనా ఎత్తేయ్యవచ్చునని కూడా మరచిపోకూడదు.

తెల్లారితే ఉరితీసేస్తారుట!

మీ రెవరేనా వారిని దింపగలరా?

(జవాబు వచ్చేసంచికలో చూడండి.)

జబ్బులు నయంచేసే ఈ డాక్టర్లందరికీ ఒక పెద్ద జబ్బుందని ఒకడు తన మిత్రుడితో అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు రెండోవాడు. మొదటివాడు: "డాక్టర్లు రాసిచ్చే ప్రిస్క్రిప్షన్ చీటీలుంటాయి చూడు. ఆ దస్తూరీ మనకి చస్తే బోధపడదు, మందులషాపువాళ్లకి తప్ప. ఇతర్ల ఆరోగ్యం బాగుచేసే ముందు డాక్టర్లు తమ దస్తూరీ బాగుచేసుకోకూడదు!'

రెండోవాడు: "అనవసరం. వాళ్ల దస్తూరీ అలా ఉండడమే మంచిది. ఏడాదికిందట నాకు ఒక డాక్టరు మందు చీటీ ఇచ్చాడు. మందు తెచ్చుకున్న తరవాత ఆ చీటీని కాంప్లిమెంటరీ టికెట్ అని బుకాయించి ఇప్పటికి పదొనిమిది సార్లయినా సినిమాలకి వెళ్లాను.

* * *

సినిమా హాల్లో నౌకరీకోసం దరఖాస్తుపెట్టిన వృద్ధుణ్ణి మేనేజరు చాలా ప్రశ్నలు వేసి చివరికి అడిగాడు: "హఠాత్తుగా ఎక్కడన్నా నిప్పంటుకుని ప్రమాదం సంభవిస్తుందనుకో. ఏం చేస్తావు??

"ఆమాత్రం తెలియదా బాబూ ఎంత ముసలాణ్ణయినా, నిప్పంటుకుందంటే పారిపోకుండా కూకుంటానాండి."

శంకరనారాయణ వీధి

పి. యస్. రామజోగారావు

ఒకానొకప్పుడు ఆంధ్రదేశంలో శైవమతము వైష్ణవ మతము రెండూ బాగా వ్యాప్తిలో నుండేవి. ప్రజలు ఎవరిమట్టుకు వారు విధిగా ఏదో ఒక మతాన్ని అవలంబించే వారు. కాని వారి మధ్య మతసహనము మాట అలా ఉండగా మత విద్వేషాలే బాగా ప్రబలి ఉండేవి. పండితులు మొదలుకొని సామాన్యులవరకూ ప్రతివారూ, మత విషయ చర్చలలో తమ మతాన్ని పొగడుకోడంతో బాటే ఎదుటివారి మతాన్ని వారి దేవుళ్ళను దూషించడానికి ఏమాత్రం వెనుదీసేవారు కాదు.

ఒకసారి తిమ్మయ్య అనే ఒకాయన బహుకాలం ఉత్తరదేశంలో తీర్థయాత్రలు చేసుకున్న తర్వాత తన దేశానికి తిరిగి వస్తూన్నాడు. అతను ఒక ఊరు చేరేసరికి మధ్యాహ్నమైంది. కాని అక్కడికి తన ఊరు ఇంకాదూరంగా ఉండడంచేత ఏం చేద్దామా అని తటపటాయిస్తున్న తిమ్మయ్యకి హఠాత్తుగా, ఆ వూళ్లో తన బంధువు లున్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఇంకేం, ఆ పూటకు చుట్టాలింటిలో విశ్రాంతి తీసుకుని మర్నాడు మళ్ళీ బయలుదేరవచ్చని నిశ్చయించాడు తిమ్మయ్య.

తన బంధువులున్న వీధి పేరు శంకరనారాయణగారివీధి అని తెలుసునుగాని అసలా వీధి ఎక్కడుందో అతనికి తెలియదు. చాలాకాలం నుంచి తీర్థయాత్రలు చేస్తూ ఈ ప్రాంతాలకు దూరంగా ఉండడం వల్ల ఇక్కడ రేగుతున్న మతకషలు గురించి అతనికేమీ తెలీదు. అదీ కాక అతను సాధారణంగా మత వివాదాలజోలికి పోయేవాడుకాదు.

ఆ వీధిగురించి ఎవర్ని వాకబు చేయటమా అని ఆలోచిస్తూన్న తిమ్మయ్యకి, ఇంటిఅరుగుమీద ఆసీనుడైన ఒక ఆచార్యులవారు కనిపించాడు. అతనిపక్కన నిగనిగలాడుతూ పట్టెవర్ధనాలు తీర్చిదిద్ది ఉన్న ఒక కలశం ఉంది. ముందు దాహమైనా తీర్చుకోవచ్చుకదాఅని తిమ్మయ్య అతని కెదురుగా పోయి

నమస్కరించాడు. ఆచారిగారుతిరిగి దండం పెడుతూ ఇలా అన్నాడు.

"ఇలా అరుగుమీద కూర్చోండి. మీది ఈ వూరు కానట్టుందే?"

"కాదు. ఇక్కడ మా బంధువు లున్నారులెండి" అతని ఆదరానికి ఉబ్బిపోయిన తిమ్మయ్య మళ్ళీ ఇలా అన్నాడు.

"కొంచెం మంచినీళ్ళిప్పిస్తారా?"

"అలాగే" అంటూ ఆచార్యులు "మీ బంధువులు ఈ వూళ్ళో ఎక్కడున్నారు?" అని మళ్ళీ ప్రశ్నించాడు.

"శంకరనారాయణగారి వీధిలో ......" అని తిమ్మయ్య ఇంకా ఏదో అనబోతూంటే, ఆచార్యుల వారి ముఖకవళికలు ఇట్టే మారిపోయాయి. నీళ్లు పొయ్యడానికి ఎత్తిన కలశం అలాగే క్రిందికి జారవిడిచి "(శ్రీ)రంగరంగ.........అపచారం" అంటూ లెంపలేసుకున్నాడు!

తిమ్మయ్యకేం అర్థంకాక ఇంకా మంచినీళ్లకోసం ప్రాధేయ పడబోయాడు. అతన్ని సగంలోనే ఆపి ఆచార్యులు "ఇంకా నీకు నీళ్లు కావాలీ, పవిత్ర నారాయణశబ్దం ముందు శంకర, కంకర అనడానికి సిగ్గులేక...ఫో అవతలికి" అని కసిరి కొట్టాడు.

ఇది జరిగిన తర్వాత వీధిగురించి మరెవ్వరి నడగడానికీ తిమ్మయ్యకి ధైర్యం చాల్లేదు. ఎండెక్కుతూన్న కొలదీ అలిసి తిరుగుతూన్న అతనికి ఒక జంగం కనిపించాడు. అతనికా వీధి ఎక్కడుందో తెలియకపోదని తిమ్మయ్యకో ఆలోచన తట్టింది. వెంటనే అతనిదగ్గరకెళ్ళి, మంచి చేసుకోడానికి ఓకానీ అతనిసంచీలో వేసి తిమ్మయ్య ఇలా అడిగేడు.

"జంగమస్వామీ, మీరు శంకర..."

"అవును నాయనా. శివుడు నీలోనూ, నాలోనూ అందర్లోనూ ఉన్నాడు, శివోహం..."

"అది కాదయ్యా సాద, మీరు శంకరనారాయణగారి వీధి ఎక్కడుందో ఎరుగుదురా" అని వెళ్ళబోశాడు తిమ్మయ్య.

'నారాయణ' అని వినగానే జంగమయ్యకి ఒంటిమీద జెఱ్ఱులు పరిగెత్తాయి. "శివశివా" అంటూ చెవులు మూసుకుని "శంకరనామ పారాయణకు పక్కనే 'నారాయణ' అనడానికి నీది నాలుకా తాటిపట్టా..." అంటూ తెల్లమొహం వేసి చూస్తూన్న తిమ్మయ్యమీదికి విరుచుకుపడ్డాడు.

తిమ్మయ్యగారికి ఇంక వీధి కనుక్కునే దారి కనపడలేదు. చీవాట్లతో బరువెక్కిన అతని తలకు కొంతసేపటికో ఉపాయం తోచింది. సంశయిస్తూనే తిమ్మయ్య, వీధిపేరు తనే అనడానికి బదులు, ఒక వీధిలో కెళ్లి "ఈ వీధి పేరేమిట"ని ఒకరిని అడిగాడు.

"వీధి పేరే తెలియనివాడివి ఇంక ఇల్లెలా కనుక్కుంటావయ్యా!" అని పదిమంది జవాబిస్తూ అతనివేపు అదోలా చూసేరు.

దానితో తిమ్మయ్య హతాశుడైపోయాడు కాని ఎలాగో తేరుకొని, ప్రతి వీధిలోకి వెళ్ళి "ఇదే వీధి" అంటూ వాకబు చేస్తూనే ఉన్నాడు...చివరకెల్లాగో అలాగ ఆ వీధి పట్టుకున్నాడు!

★

డాక్టరు రోగితో: "ఏదీ, నోరు తెరిచి 'ఆ' అనండి."

రోగి: "నేను మందుకోసం రాలేదండి. బిల్లు చెల్లిద్దామని వచ్చానండి"

డక్టరు: "ఆఁ......"

(49 వ పేజీ తరువాయి)

తప్ప వంటిమీద బట్టలేమీ లేవు. అమ్ములపొది ఒకటి బుజానికి తగిలించుకుని, పొడుగ్గాఉన్న బల్లెంలాంటిది చేత్తో పట్టుకున్నాడు. బలంగా ఉన్నాడుకాని చూడడానికి మహావికృతంగాఉన్నాడు. చెవులకు కొయ్యతో చేసిన పెద్దపెద్ద రింగులు వేలాడగట్టిఉన్నాయి. అటువంటిదే మరొక రింగు అడుగు పెదవికి ఉన్నది. ఈ రింగులు వేయడానికి చెవులకు, పెదవికి ఉన్న రంధ్రాలు కాలక్రమాన రింగుల బరువుకి పెద్దవై అసహ్యంగా తయారైనాయి.

ఆ ఇండియన్ వీరిని చూసి, మొదట ఆశ్చర్యపడి, సంబాళించుకుని గావుకేక పెట్టాడు.

ఈ గావుకేకకు సమాధానంగా మరొక గావుకేక వినిపించింది. మరికొన్ని నిమిషాలలో ఒక ముప్ఫయ్ మంది ఆటవికులు అడవులలోనుండి పరిగెత్తుకుంటూవచ్చారు. వారు కూడా మార్టిన్ వగైరాలను చూసి ఆశ్చర్యపడ్డారు. వారిమీదికి దాడి చెయ్యడానికి సిద్ధపడ్డారు.

బార్కీ కూడా ఆశ్చర్యంనుండి తేరుకుని, పిస్తోలు తీసి సిద్ధపరచుకున్నాడు. తన కత్తిని మార్టిన్ కిచ్చి సిద్ధంగా ఉండమన్నాడు. ఇద్దరూ ఉద్రేకంతో ముందుకు దూకేవారేగాని, వారి చర్యలను భయభ్రాంతుడై గమనిస్తున్న వృద్ధ వ్యాపారస్థుడు వారిని పట్టుకుని ఆపాడు. ఆటవికులతో తలపడితే తలలు పోగొట్టుకోవడంకంటే వేరే జరిగేదేమీ లేదని, మాట్లాడకుండా ఊరుకుంటే వారు ఏమీ చెయ్యకపోవచ్చుననీ నచ్చచెప్పాడు. ఇంతలో మరో యాభై మంది దాకా ఇండియన్లు వచ్చి చేరారు. వీరందర్నీ చూసేసరికి మార్టిన్, బార్కీలకు జంకుపుట్టింది. వృద్ధ వ్యాపారస్థుడు చెప్పినట్లు మాట్లాడక ఊరుకోవడమే ఉత్తమమని గ్రహించారు. ఏంచెయ్యడమా అని వారు ఆలోచిస్తూ ఉండగానే వెనకనుంచి మరికొందరు ఆటవికులు గభాలునవచ్చి ముగ్గురు మిత్రుల్నీ పెడరెక్కలు విరిచి కట్టేశారు. బార్కీ మొదట బాగా పెనగులాడాడు. కాని పలువురు అతన్ని చుట్టుముట్టడం చేత చివరికి లొంగిపోయాడు. మార్టిన్ను కూడా అలాగే చేతిలో కత్తిలాగేసి బంధించారు. వృద్ధ వ్యాపారస్థుడు అసలు పెనగులాట లేకుండానే లొంగిపోయాడు.

ఇండియన్లు వారిని ముగ్గురినీ బంధించి, పడవలో ఉన్న వర్తక సామగ్రిని ఇతరసామగ్రిని దోచుకున్నారు. అన్నీ మూటకట్టి బుజాలమీద వేసుకున్నారు. ఆతరవాత ముగ్గుర్నీ నడిపించుకుంటూ బయలుదేరారు.

ఇండియన్లలో ప్రతివాడి చేతిలోనూ పొడుగాటి బల్లెంలాంటి కర్ర ఉన్నది. అది బల్లెం అవునా, కాదా అని బార్కీ, మార్టిన్ అనుమానిస్తూండగా, వారిలో ఒకడు కర్రను వంచాడు. బాణం తీసి కర్ర కొసన ఉన్న ఒక రంధ్రంలోపెట్టినోటితో పట్టుకొనిలాగాడు. బాణం రివ్వునపోయి చెట్టుమీద కూర్చున్న ఒకపక్షికి తగిలి అది కింద పడింది. అప్పుడు మన మిత్రులకు అది ఆ దేశపు విల్లు అని బోధపడింది. పైగా ఆటవికుడు వదలిన బాణం పక్షి రెక్కలమీంచి మాత్రమే దూసుకుపోయింది. అయినా అది చచ్చిపోవడం చూస్తే ఆ బాణం విషబాణం అయిఉండాలి. ఆ విషయం గుర్తించేసరికి బార్కీ, మార్టిన్లకు గుండెలు ఝల్లుమన్నాయి. తాము వారితో పోట్లాడకుండా ఊరుకోవడమే చాలా మంచిదైనదని అనుకున్నారు.

16

ఇండియన్లు తమ చేతిలో చిక్కిన ఆ అభాగ్యులను హింసపెట్టకపోయినా అరణ్యమార్గాలగుండా బోలెడుదూరం నడిపించారు. బార్కీ, మార్టిన్ దూరపు నడకలకు అలవాటుపడినా, మార్గం చాలా కఠినంగా ఉండడంవలన బాగా శ్రమకు లోను కావలసివచ్చింది.

ఆ బృందం అలా నడిచినడిచి పర్వతాలతో నిండిన ప్రాంతం చేరారు. వంకరటింకరగా ఉన్న దారిని పడి నడిచారు. బంధితులు కొండలమీద నడవడానికి వీలుగా కట్లు విప్పేశారు. బంధితులు పారిపోవడానికి ప్రయత్నించలేదు. అన్నిపక్కలా ఇండియన్లు కాపలా కాస్తూ నడుస్తుండగా, వారి చేతుల్లో విషబాణాలు ఉండగా పలాయనానికి ప్రయత్నించడంకూడా వ్యర్థమేనని వారు గ్రహించారు.

అలా చాలా వారాలపాటు ఆటవికులు నడిచి

నడిచి ఒకనాటి సాయంత్రానికి అందమైన ఒక లోయను చేరుకున్నారు. అక్కడ అవాళ్టికి మజిలీ చెయ్యాలని నిశ్చయించుకున్నారు. అందరూ విశ్రమించిన తరవాత బార్నీ మార్టిన్‌తో మెల్లిగా అన్నాడు.

"మార్టిన్ ! ఎంతకాలం ఈ ఆటవికులతో గడపవలసివుందో తెలియడంలేదు. పారిపోవడానికి సాధనం ఏమిటా అని మథనపడిపోతున్నాను. అసలు ఒకటి అనుకుంటున్నానులే."

"ఏమిటది ?"అన్నాడు మార్టిన్.

"బహుశా ఈ జన్మలో మనకు విముక్తిలేదు."

"అలా అధైర్యపడకు బార్నీ. వాళ్ళు మన్ని చంపకుండా ఉంటే అదే చాలు. బతికివుంటే ఏనాటికైనా మనం తప్పించుకోలేకపోము."

వీరిలా మాట్లాడుతుండగా వృద్ధ వ్యాపారస్థుడు దుప్పటి ముసుగుపెట్టుకొని గాఢంగా నిద్రపోయాడు. ఇండియన్లు భోజనాలు కానిచ్చి ఒక ముఠాగా కూర్చుని తమలోతాము ఏదో మాట్లాడుకోసాగారు. వారిలో వారికి ఏదో విషయమై వివాదం వచ్చినట్లుంది. అప్పుడప్పుడు బార్నీ, మార్టిన్‌లకేసి చూపులు ప్రసరిస్తున్నారు. అది చూసి బార్నీ "వాళ్ళు మనల్ని గూర్చి ఏదో అనుకుంటున్నారు. వాళ్ళ చూపులు చూస్తే మనకి మంచి చెయ్యబోవడంలేదని తెలిసిపోతోంది. ఇప్పుడు చేతిలో నా పిస్తోలు, కత్తి ఉంటేనా వీళ్ళందర్నీ హతమార్చిఉందును. కాని ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? మార్టిన్ ! ఇక పడుకుని నిద్రపోదాం," అంటూ పైపులో బూడిద దులుపుకుని పడుకున్నాడు. ఇండియన్లుకూడా చర్చలు మానివేసి, పడి నిద్రపోయారు.

మర్నాడు ప్రొద్దున బార్నీ భయపడినంతా జరిగింది. ఇండియన్లు రెండుముఠాలుగా చీలిపోయారు. ఒక ముఠాలోకి బార్నీని, వృద్ధ వ్యాపారిని తీసుకున్నారు. మరొక ముఠాలోకి మార్టిన్ రాట్లర్‌ను తీసుకున్నారు.

"బహుశా, మన్ని విడదీయాలని అనుకుంటున్నారల్లేవుంది," అన్నాడు బార్నీ.

"అవును, అలాగే ఉంది చూస్తే. కాని బార్నీ మనం ఏమైనా సరే విడిపోగూడదు. ప్రాణాలకి తెగించి మనం పోట్లాడుదాం," అన్నాడు మార్టిన్.

ఇద్దరికీ పట్టరాని ఆవేశం వచ్చింది. ఈ దూరదేశంలో, అనేక కష్టాలకులోనై ఇంతదూరం, ఇంతకాలం కలిసి మెలిసి ఉన్న తాము ఈనాటికి విడిపోవలసిస్తోందనే భావం కలిగేసరికి వారికి అమితమైన ఆగ్రహం కలిగింది. బార్నీ కోపంతో రొప్పుతూ, ఆకలితో ఉన్న సింహంలాగ చూస్తూ, ఏదైనా ఆయుధం దొరుకుతుందేమోనని నలుపక్కలా చూశాడు. అతని ఉద్దేశం గ్రహించి ఇద్దరు ఇండియన్లు అతనిపైబడి పట్టుకున్నారు. మార్టిన్‌ను కూడా కదలకుండా పట్టుకున్నాడొకడు.

మార్టిన్‌ను అలా పట్టుకోవడంతో బార్నీ మరింత రెచ్చిపోయి విడిపించుకోడానికి పెనగులాడాడు. కాని అతనిమీద మరికొందరు బలిష్ఠులైన ఇండియన్లు పడి పట్టుకున్నారు. అతడు గావు కేకలు పెట్టి గోలగోల చేస్తున్నా, ఇండియన్లు లెక్క చెయ్యకుండా అతన్ని రాళ్ళమీంచి బడబడ లాక్కుపోయారు. అయినా అతడు పెద్దపులిలాగ భయంకరంగా దెబ్బలాడుతూనే ఉన్నాడు. చేతికందిన వాళ్ళని చేతులతోనూ, కాళ్ళకందిన వాళ్ళని కాళ్లతోనూ కొడుతూ, తన్నుతూ ఉన్నాడు. అతని దెబ్బలకు ఇండియన్లకు వీపులు పగులుతూ, పళ్లురాలుతూ ఉన్నా మోటమనుషులు గనక లెక్కచెయ్యలేదు. అతన్ని చంపడానికి ఇష్టంలేక కాబోలు, అతడేం చేసినా భరించి ఊరుకున్నారు. మార్టిన్‌ను పట్టుకున్న ఇండియన్లు మరొక దిక్కుగా ప్రయాణం చేశారు. "బార్నీ, బార్నీ" అని మార్టిన్ పెట్టే కేకలు ఆ పర్వతాలలో మారుమోగాయి. ఒకరినొకరు విడవలేక, విధిలేక విడిపోతూ, ఎంతో దుఃఖపడుతూ ఆ విధంగా మార్టిన్, బార్నీలు చెరొక దిక్కుకు చీలిపోయారు.

(ఇంకా ఉంది)

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Tambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.

సిరోలిన్

మీ దగ్గుకి కారణము నిర్మూలము చేస్తుంది —మీ దగ్గుటను ఆపుట మాత్రమే కాదు



సిరోలిన్ మీకు దగ్గును కలిగించే అపాయకరమైన రోగ క్రిములను నిర్మూలిస్తుంది



దగ్గు అపాయ చిహ్నము. మీకు దగ్గు వస్తే గొంతుకలోను, ఊపిరి తిత్తులలోను వుండే సున్నితమైన స్నాయువులు వాచి, ఉబ్బేయున్నమాట. ప్రత్యక్షముగా మీ దగ్గుకి కారణమును పోగొట్టే ఒక మందు అవసరము — దగ్గుటను ఆపుట మాత్రమే చేసే మందు వాడుట వలన లాభము లేదు

సిరోలిన్ రెండు విధములుగా మీ బాధను నిర్మూలము చేస్తుంది. మొదటిది. దాని క్రిమి సంహార శక్తి రోగ క్రిములను హరింపచేసి అవి యింకా వ్యాపించకుండా ఆపుటలో సహకరించును రెండవది. గొంతులో అడ్డు పడిన కఫము చీమిడి సులభముగ పైకి రావడానికి సహకరించి సత్వరమైన. నిజమగు ఉపశమనము నిచ్చును సిరోలిన్‌లో ఎఫిడ్రిన్ చేర్చబడలేదు

దగ్గుకు నిరపాయమైన కుటుంబ ఔషధము ఔను. కుటుంబములో అందరూ దీనిని భయము లేకుండా వాడవచ్చును — పిల్లలుకూడ. ఎందుకంటె సిరోలిన్‌లో హానికరమైన మత్తు మందులు లేక యితర మందులు లేవు దాని కమ్మని రుచి పిల్లలకు ప్రీతి. సిరోలిన్ ఎల్లప్పుడూ ఒక సీసా మీ యింట్లో ఉంచండి.



సిరోలిన్ 'రోష్'

BY. 1701



మీ పిల్లల దుస్తులకు ప్రఖ్యాతి గాంచిన కాట్స్‌వాల్ కొనండి

ఇది మెత్తగా, సౌఖ్యముగా ఉండి, దేహమునకు గాలి ఆడేలా ఉంచుతుంది

ఈసారి మీ పిల్లలకు క్రొత్త బట్టలు కొనునపుడు ఆకర్షణీయమైన కాట్స్‌వాల్ ఎన్నుకొనండి. కాట్స్‌వాల్ తేలికగా ఉండే బట్ట. ఇది ఊలు మరియు నూలుల సరియైన మిశ్రమములో తయారైనది.

కాట్స్‌వాల్ దేహమునకు గాలి ఆడేలా ఉంచుతుంది కనుక మీకు చిరాకు కలిగించేటంత వేడిగా ఎన్నడూ ఉండదు. ఈ ఆకర్షణీయమైన కాట్స్‌వాల్ చాల కాలము మన్నుతుంది, మరియు క్రుంగకుండా ఉంటుందని హామీ కలదు. ఇది క్రుంగుతే దీనికి బదులుగా బట్ట యివ్వబడుతుంది.

కాట్స్‌వాల్ అనేక దివ్యమైన అద్దకములు మరియు రంగులలో దొరకుతుంది — మీ బట్టల వర్తకుని వద్దకు వెళ్లి నేడే చూడండి!

బిన్నీ కాట్స్‌వాల్ అన్ని [illegible] ఋతువులలోను వాడుటకు అను[illegible] ఉంటుంది

ఏక రంగు రకములు 29/30"	ఒక గజమునకు రు. 3/10
ఇజారు చారలు 29/30"	ఒక గజమునకు రు. 3/10
ఏక రంగు రకములు 35/36"	ఒక గజమునకు రు. 4/5
అద్దకములు 29/30"	ఒక గజమునకు రు. 4/4
చెక్కు గుడ్డలు 29/30"	ఒక గజమునకు రు. 4/1

అమ్మకపు పన్ను అదనము

ఇంకా వెచ్చని దుస్తులకు — బిన్నీ అంగోలా కొనండి

ఈ నాణ్యమైన ఊలు, నూలు కలిపి దట్టముగా నేసిన బట్ట చల్లని శీతోష్ణస్థితిగల ప్రదేశములు, పర్వత ఆశ్రయములకు తగినది. చొక్కాలకు, స్త్రీల దుస్తులకు మరియు ఇజారులకు అందమైన రకములలో ఏక రంగులో దొరకుతుంది.

బెంగుళూర్ వులెన్, కాటన్ & సిల్క్ మిల్స్ కంపెనీ లిమిటెడ్

ఏజెంట్స్, సెక్రటరీస్ & ట్రెజరర్స్: బిన్నీ అండ్ కంపెనీ (మద్రాసు) లిమిటెడ్

భారతీయ పరిశ్రమల ప్రదర్శనము న్యూఢిల్లీ — '55 అక్టోబరు 30 నుండి డిసెంబరు 15 వరకు

బొంబాయి మిల్లు యజమానుల అసోసియేషన్ పెవిలియన్ స్టాల్ నెం. బి. 70 వద్ద మమ్ము సంప్రదించండి.